
ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



25 నయాపైసలు

31-7-57

ANDHRA PATRIKA

ILLUSTRATED WEEKLY

సంవత్సర చందా
రు. 13-0-0
విడిప్రతిక 25 న.పై

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 48
31-7-57

హేవిళంబి శ్రావణం బహుళ పంచమి బుధవారం

★ విషయానుక్రమణిక ★

ముఖచిత్రం :
ఏ. నాగేశ్వరరావు.

★



కీ॥ శే॥ వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి

"కూచిపూడి నాట్యకళానిధి"

కూచిపూడి భరతనాట్యంలో ప్రసిద్ధులైన శ్రీ వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి ఈ నెల 13 వ తేదీన స్వర్గస్థులయ్యారు. వీరి మరణం నాట్యకళాభిమానులకు తీరనివిచారం కలిగించింది. శాస్త్రిగారు 77 ఏళ్ళ వృద్ధులు. వీరి అద్వితీయ ప్రతిభాసంపత్తిని గౌరవించడానికి మదరాసు ప్రభుత్వం 1948 లో "కూచిపూడి నాట్యకళానిధి" అనే బిరుదు ఇచ్చి, సింహతలాటం బహూకరించి సన్మానించింది.

కూచిపూడి సంప్రదాయానికి చెందిన భరతశాస్త్రాచార్యులలో లక్ష్మీనారాయణశాస్త్రి గారిని చెప్పి మరొకర్ని చెప్పాలి. వీరివద్ద నాట్యవిద్య నేర్చుకున్న శిష్యులనేకులున్నారు. ఆయనకి చేతనైనన్ని భంగిమలు మరెవరికీ చేతగావని ప్రతీతి. ఒకసారి మువ్వలో క్షేత్రయ్య వర్ధంతి సభలలో శాస్త్రిగారు "ఇన్నాళ్ళవలె కాదమ్మా— మువ్వ గోపాలుడెన్నో నేర్చినాడమ్మా" అనే క్షేత్రయ్య పదంలోని పల్లవినొక్కదాన్నే గంటకు పైగా వివిధరీతులుగా అభినయం చేశారట. పండు ముదుసలి అయినా అయిదారేళ్ళ క్రితం దాకా భామవేషం వేస్తూనే ఉన్నారు అయన గజ్జెకట్టి అభినయిస్తుంటే సాక్షాత్తు నృత్య సరస్వతి అనిపించేవారు శాస్త్రిగారు ప్రదర్శించే అనేక భంగిమలు చూసి, ప్రఖ్యాతినర్తకుడు ఉదయశంకర్ వాటిని తనకు కూడా నేర్పవలసిందని అర్థించాడు.

సారథి ఫిలిమ్స్ నిర్మాత సి. వి. ఆర్. ప్రసాద్ గారికుమార్తెకు శాస్త్రిగారు గడచిన రెండేళ్లుగా భరతశాస్త్రం నేర్పుతూ, ప్రసాద్ గారి కుటుంబంతో పాటు హైదరాబాదులోనే ఉంటున్నారు. అక్కడే శాస్త్రిగారికి జబ్బుచేసింది. వారిని బ్రతికించుకోవాలని చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనాయి.

అంతకుముందు శాస్త్రిగారు బందరు ఆజాద్ హిందూ బాలికా పాఠశాలలో పనిచేసి బాలికలనేకులకు నాట్య శిక్షణ ఇచ్చారు.

శాస్త్రిగారి నిర్యాణంతో మహోత్తరమైన కూచిపూడి నాట్య సంప్రదాయానికి తీవ్రమైన ఆఘాతం కలిగిందనే అనాలి. నాలుగైదు శతాబ్దాలుగా కూచిపూడి భరతనాట్యం దక్షిణాకేశమంతటా అవిచ్ఛిన్నంగా ఏలింది. ఇన్ని అధునాతన విదేశీయ ప్రభావాలు, భావాలు దేశంలో ప్రబలిపోయినా ఈ నాటికీ భరతశాస్త్రం, ముఖ్యంగా కూచిపూడి వారి కళా ప్రాభవం సజీవంగా ఉన్నాయంటే లక్ష్మీనారాయణ శాస్త్రిగారి వంటి ఉద్దండ పండితుల నిరంతర కృషే కారణం. శాస్త్రిగారు నిర్యాణం చెందినప్పటికీ వారి తరిఫీధులో తయారైన శిష్య ప్రశిష్య కోటి ద్వారా సజీవులే. ఆంధ్రజాతిలో నాట్యకళాభిమానం ఏకిసరంతైనా మిగిలి ఉన్నంతవరకూ శాస్త్రిగారు యశఃకాయంలో జీవించే ఉంటారు.

వారి ఆత్మకు పరమేశ్వరుడు శాంతి ప్రసాదించుగాక! ★

మనం, మన సైన్యం

న్యూఢిల్లీ ప్రతినిధి

కొచిన్ నౌకా పరిశోధనాలయం

భారత ప్రభుత్వ రక్షణశాఖ డిప్యూటీ మంత్రి శ్రీ కొత్త రఘురామయ్య మొన్న ఈమధ్య కొచ్చిన్ నౌకాశ్రయానికి వెళ్లినప్పుడు, అక్కడ వున్న నౌకా భౌతిక శాస్త్ర పరిశోధనలయాన్నికూడా సందర్శించారు. ఈ పరిశోధనాలయం సాగిస్తున్న మహత్తర కృషి ఏమిటో బహు కొద్దిమందికి మాత్రమే తెలుసు. బ్రిటిష్ నౌకాశాస్త్ర పరిశోధనశాఖకు చెందిన డాక్టర్ కేస్టన్ మన దేశ పరిస్థితులను స్వయంగా పరిశీలించి చేసిన సిఫార్సుల ఫలితంగా ఈ పరిశోధనాలయాన్ని 1952 లో స్థాపించడం జరిగింది. సముద్రాంతర్భాగాన శబ్దతరంగాల వ్యాప్తి, వాటికి వర్తించే నియమనిబంధనలు, సముద్ర జలాల కాలుష్యం, మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ మొదలైన అనేక విషయాల మీద ఇక్కడ నిత్యం పరిశోధనలు, పరిశీలనలు జరుగుతూంటవి. దీనిలో మనస్తత్వశాస్త్ర పరిశోధనా విభాగంకూడా ఒకటి వున్నది. నౌకాశాఖలో ప్రత్యేకశిక్షణ నిమిత్తం వచ్చేవారిని వారి వారి మానసికతత్వాలను గ్రహించి ప్రత్యేక తరగతులుగా విభజించడానికి ఈ విభాగం సహాయపడుతుంది. సముద్రాంతర్భాగంలో శబ్దతరంగాల వ్యాప్తిని పరిశోధించడంవల్ల సముద్రంమీద బాహాటంగానూ, సముద్రంలోపల రహస్యంగానూ వచ్చే నౌకల, జలాంతర్గాముల రాకను ముందుగానే గ్రహించడానికి వీలవుతుంది. ఈ శాస్త్రంలో ఉపయోగపడే అనేక హైడ్రోఫోన్లను పరిశోధనాలయంలో అమర్చారు. నౌకల, జలాంతర్గాముల రాకపోకల ఫలితంగా సముద్ర ఉపరిభాగంలోనూ, అంతర్భాగంలోనూ సంభవించే పరిణామాలనుసరిగా కొలిచినట్లు తెలుసుకోడానికి సహాయపడే ప్రత్యేక లోలకాలుకూడా ఇక్కడ వున్నవి. వీటినే ఇంగ్లీషులో మైక్రోసీస్మిక్ పెండ్యులమ్స్ అంటారు. ఎలక్ట్రానిక్స్ సహాయం ద్వారా ఈ లోలకాల సంచలనాన్ని పెద్దదిగా కనిపించేట్టు చేస్తారు. రేవులలో సముద్రజలాల మట్టంలో ఏ మాత్రం మార్పు వచ్చినా కనిపెట్టడానికి సముద్ర కెరటాల ఎలక్ట్రానిక్ రికార్డర్ యంత్రంకూడా ఈ పరిశోధనాలయంలో వున్నది. రేవు పరిసరాలలోని సముద్రజలాలలో ఉప్పు ఎంత దట్టంగా వున్నదీ, ఈ సాంద్రత పెరుగుతున్నదా, లేక తగ్గిపోతున్నదా అనే విషయాన్నీ, పరిసరాల ఉష్ణోగ్రత ఎంతవున్నదనే విషయాన్నికూడా పరిశోధనాలయం ఎప్పటికప్పుడు సేకరిస్తుంటుంది. రక్షణశాస్త్ర పరిశోధనలలో విశేష అనుభవశాలిఅయిన డాక్టర్ ఎస్.ఎస్. శ్రీవత్సవగారి అధ్వర్యాన ఇక్కడ ఉద్యోగ బృందం పనిచేస్తుంటుంది. డాక్టర్ శ్రీవత్సవ లండన్‌లోని ఇంపీరియల్ కళాశాలలోనూ, భారతదేశ జాతీయ భౌతికశాస్త్ర పరిశోధనాలయంలోనూ ఇదివరలో పనిచేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న భూ భౌతిక పరిశోధనలలో కొచ్చిన్‌లోని ఈ పరిశోధనాలయం కూడా పాల్గొని సహాయపడుతున్నది.

*   *   *

సైన్యంలో పనిచేసే ఆఫీసర్లకు, ఇతర ఉద్యోగులకు, మామూలుగా దేశప్రజలందరికీ వర్తించే సాధారణశాసనాలేగాక ప్రత్యేక సైనిక శాసనాలు కూడా వర్తిస్తుంటవి. సైన్యానికి సంబంధించినవారు ఈ ప్రత్యేక సైనిక శాసనాలన్నిటికీ తల ఒగ్గిపనిచేస్తుండాలి. 1947 లో మన దేశం స్వతంత్రమైనప్పుడు మనసైన్యం 1911 నాటి సైన్య శాసనానికి (ఆర్మీఆక్టు) లోబడి పనిచేస్తుండేది. ఈ చటంకింద తయారైన నియమనిబంధనలు, ఉత్తర్వులు వారికి వర్తిస్తుండేవి. దేశదాస్య విమోచనంతో ఈ చట్టాన్ని సవరణచేసుకోవలసి వచ్చింది. మన సైన్యంలో క్రమశిక్షణను, సైనిక పరిపాలనా వ్యవహారాల నిర్వహణనూ కట్టుదిట్టం చేయడానికి కొత్త సైన్య శాసనాన్ని (1950) తయారుచేశారు. 1954 లో కొత్త సైనిక నియమావళిని ప్రభుత్వం ప్రకటించింది. సైన్యశాఖలో పనిచేసేవారికి కావలసిన ఉద్యోగపు హామీనీ, ఏ ఉద్యోగికైనా అన్యాయం జరిగినప్పుడు త్వరితగతిని దానిని విచారించి సర్దుబాటు చేయాలన్న నిబంధనను ఈ కొత్త నియమావళిలో పొందు పరిచారు. సైన్యంలో పనిచేసేవారి నెవరినీ అక్రమంగా, విచారణ లేకుండా ఉద్యోగం నుంచి తీసివేయకూడదన్నదీ, విచారణలో వున్న ఏ వ్యక్తినీ అనవసరంగా మిలిటరీ కస్టడిలోకి తీసుకోరాదన్నదీ, క్రమశిక్షణను ధిక్కరించేవారిపై జరిపే విచారణలో అనవసరమైన జాప్యం కూడదన్నదీ ఈ నియమాలలో ముఖ్యమైనవి. కిందిఉద్యోగి తీర్పులపై పై ఉద్యోగికి అప్పీలు చేసుకునే అధికారం కూడా సైనికుడికి ఇందువల్ల లభ్యమైంది. కోర్టుమార్షల్ విధించే శిక్షలమీద కూడా అప్పీలు చేసుకోవచ్చునన్నమాట.

సైన్య శాసనంలోని 175-వ సెక్షన్ ప్రకారం కేంద్రప్రభుత్వం 1957 జనవరి 1

నుంచీ తిరుమల్ ఘర్ లో ఒక సైనిక కారాగారాన్ని స్థాపించింది. ద్వితీయ ప్రపంచ సంగ్రామ సమయంలో దేశంలో ఏర్పడిన సైనిక కారాగారాలను ఆర్థికపరిస్థితులదృష్ట్యా 1947 లో భారతప్రభుత్వం రద్దుచేసి వేసింది. ఈ కారణాలచేత, మూడు నెలలకు మించి శిక్ష అనుభవించవలసిన సైనికులను మామూలు సివిల్ జైళ్ళలోనే నిర్బంధిస్తుండేవారు. మామూలు జైళ్ళలో వీరిని నిర్బంధించడంవల్ల ఖైదీ సైనికులు మామూలు నేరస్థుల దుస్సహవాస ప్రభావంవల్ల చెడిపోవడం మొదలుపెట్టారు. ఆ కారణంగా వారిని సైన్యం నుంచి బర్తరఫ్ చేయవలసివచ్చింది. తిరుమల్ ఘర్ జెలు స్థాపనతో ఈ దుష్పరిణామం తొలగిపోతుందనే ఆశించవచ్చు.

*   *   *

ప్రాచ్య సైనిక కార్యాలయానికి అనుబంధ సంస్థగాలక్నోలో పనిచేస్తున్న వ్యాయామ శిక్షణ పాఠశాలకు (ప్రెపరేటరీ ఫిజికల్ ట్రెయినింగ్ స్కూలు) విద్యార్థులను ఎంచవలసిందని ఉత్తర్వులు జారీ అయినవి. అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్ల బేసిక్ ట్రెయినింగ్ కోర్సుకు, రిక్రియేషనల్ ట్రెయినింగ్ కోర్సుకు సైన్యంలోని అభ్యర్థులను తయారు చేయడమే ఈ పాఠశాల నడపడంలోని ఉద్దేశం. అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్ల బేసిక్ ట్రెయినింగు కోర్సును, రిక్రియేషనల్ ట్రెయినింగు కోర్సును పూనాలో వున్న సైనికపాఠశాల నిర్వహిస్తుంది. మొదటి కోర్సు ఆరువారాలపాటు సాగుతుంది. 65 మంది విద్యార్థులుంటారు. రెండోకోర్సు నాల్గు వారాలపాటు నడుస్తుంది 25 మంది విద్యార్థులుంటారు. ఏప్రిల్ 1 నుంచీ ఒక విద్యార్థి బృందం శిక్షణ పొందుతున్నది. తరగతులు వచ్చే జనవరివరకూ సాగుతవి. వ్యాయామశిక్షణమీద అభిరుచి వున్నవారినీ, శిక్షణపొందిన తర్వాత ఆయా ప్రాంతాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఉపయోగపడగలరన్న నమ్మకం వున్న వారినీ మాత్రమే ఈ కోర్సులకు ఎన్నుకుంటారు. వీరి వయస్సు 28 ఏళ్ళకు మించకూడదు. లక్నోలోని ప్రాచ్య సైనిక కార్యాలయం తాలూకు ప్రెపరేటరీ ట్రెయినింగ్ స్కూలులో వున్నవారిలో అర్హులైన వారినే వీటికి ఎన్నుకుంటారు. కోర్సు పూర్తి అయ్యే వరకూ ఒక్కరోజుకూడా సెలవు తీసుకోకుండ పాఠశాలకు హాజరుకావాలి.

*   *   *

అస్సాంలో దియాంగ్ నదిమీద నిర్మించిన "సస్పెన్షన్" వంతెనకు జులై మొదటి వారంలో ప్రారంభోత్సవం జరిగింది. ఈ వంతెన పొడవు 186 అడుగులు; వెడల్పు 12 అడుగులు. నాగజాతి నివసించే కొండల ప్రాంతానికీ, మిగతా మైదాన భూభాగానికీ మధ్య ఈ వంతెన నిర్మాణంతో ఒక రహదారి ఏర్పడిందన్నమాట. మేజర్ జనరల్ కొచార్ ప్రారంభోత్సవం చేసినందువల్ల ఈ వంతెనకు "మేజర్ జనరల్ కొచార్ వంతెన" అని నామకరణం చేశారు. మూడు టన్నుల బరువు వరకూ భారీ వాహనాలు దీనిమీద వెళ్ళవచ్చు. కేవలం కొయ్య దూలాలతోనే నిర్మించిన సస్పెన్షన్ బ్రిడ్జి భారతదేశం మొత్తంమీద ఇదొక్కటే. ఎనిమిదే ఎనిమిది వారాలలో దీని నిర్మాణాన్ని మన సైనికులు పూర్తిచేయగలిగారు నాగజాతి నివసించే జిల్లాకు (కొండ ప్రాంతం) లొహా ప్రాంతానికీ మధ్య ఈ వంతెనవల్ల రాకపోకసౌకర్యం ఏర్పడింది. వాతావరణ పరిస్థితులు ఏనాడూ స్థిమితంగా వుండవనీ, ప్రదేశమంతా అనేక పర్వతాలలోనూ, అరణ్యాలలోనూ, బ్రహ్మాండమైన వేగంతో పైనించి క్రిందికిదూకే కొండ వాగులతోనూ నిండి వుంటుందనీ గ్రహిస్తేనే తప్ప, ఇక్కడి ప్రజలకు ఈ వంతెన ఎంత ఉపయోగపడుతుందో అవగాహనకాదు. పైగా ఈప్రాంతానికి నదులు తమ ప్రవాహమార్గాన్ని తరుచూ మార్చి వేసుకునే స్వభావం కూడా వున్నది. ఈ వంతెన లేక పూర్వం లొఖా అనే కొండ ప్రాంతం నుంచి వాహనాలు కొహిమా, దిమాపూర్ల మీదిగా చుట్టు తిరిగి మైదాన ప్రాంతాలు చేరడానికి దాదాపు 48 గంటలసేపు పట్టేది. ఇప్పుడా బాధ తప్పిపోయింది. శీఘ్రంగా రవాణాలు చేయవచ్చు. ఈ విధంగా ఇది లొఖా ప్రాంతపు ప్రజల ఆర్థికాభివృద్ధికి బాగా సహాయపడుతుంది. ★

'జాగ్‌తే రహో'కు ప్రథమ బహుమతి

అమెరికా, బ్రిటన్ మొదలైన 42 దేశాలు పాల్గొన్న కార్లోవీవారీ (జెకోస్లోవాకియా) అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఈ ఏడాది, రాజ్ కపూర్ చిత్రం "జాగ్ తే రహో" ప్రథమ బహుమతి (గ్రాండ్ ప్రిక్స్) నందుకొంది. అంతర్జాతీయ శ్రేణిలో ఇలా అగ్రతాంబూలం అందుకొన్న ప్రథమ భారతీయ చిత్రం ఇదే.

కాన్స్, బెర్లిన్, వెనిస్, ఎడింబరో చలన చిత్రోత్సవాల స్థాయిని ఈఉత్సవానికి కూడా ఇచ్చి గుర్తిస్తున్నట్లుగా అంతర్జాతీయ ఫిలిం ఫెడరేషన్ గత సంవత్సరం ప్రకటించడం విదితమే.

మొత్తం 70 చిత్రాలలో 'జాగ్ తే రహో' ఈ గౌరవాన్ని గడించుకుంది. 'అండర్ ది కవర్ ఆఫ్ నైట్' అనే పేరుతో దీన్ని ప్రదర్శించారు.



"మహామంత్రికి జయము."

"ఎవరు? గోవిందరాయలా! రా! కూచో."

"మహామంత్రులు ఏదో దీర్ఘాలోచనలో వున్నట్టుంది?"

"ఏముంది? నీకు తెలిసిన విషయమేగా."

"అంటే, నేటి క్లిష్ట సమస్యను ఎలా పరిష్కరించాలనేనా?"

"అవును."

"అప్పాజీ! మొట్టమొదట దిగ్విజయ యాత్రను చాలించి, స్వదేశానికి మరలిపో నిశ్చయించి, తిరిగి కటకం వరకు పాడిగించడంలో ప్రభువుల ఉద్దేశమేమిటి?

"అదంతా ఒక గాథలాంటిది."

"మీకేమీ అభ్యంతరం లేకపోతే అది వినాలని కుతూహలంగా వుంది ""

"ఏముంది? రాయలు నరసరాజుకి ఔరస పుత్రుడు కాడని ప్రవాదమున్న సంగతి తెలుసుకదా!"

"ఔను. చంద్రుడికి మచ్చలా ప్రభువులకి దాసీపుత్రులన్న కళంకం ఒకటి ఉన్నది కదా!"

ఆc! ఆ కళంకాన్ని కడిగివెయ్యాలని నా ప్రయత్నం."

"అయితే?"

"కటకపురాధీశ్వరుడైన వీర రుద్రగజపతి సుక్షత్రియుడు కదా! అతని పుత్రిక 'అన్నపూర్ణ' ప్రభువులకు రాణిగాచేస్తే ఆ కళం

కం రూపుమాసి పోవచ్చని నా ఊహ."

"మీ ఆలోచన అద్భుతమైనది. అలా చేస్తే వీరరుద్రగజపతివంటి బలాఢ్యుడి అండకూడా వుంటుంది."

"నేను గజపతికి నా ఉద్దేశాన్ని వ్యక్తీకరిస్తూ, ఒక లేఖ వ్రాసిపంపేను. ఆ లేఖచూసి అతను మన దూతను అవమానించి 'దాసీపుత్రునకు నా కుమార్తెనిచ్చి వంశాన్ని కళంకితం చేయదల్చుకోనలేదు. ఇటువంటి అవివేకపు జాబు లికముందు పంపకండి ఇది ప్రథమ తప్పిదం క్రింద మన్నిస్తున్నాం." అని వార్త పంపేడు.

"అన్నా! ఎంత పొగరు! తరువాత ఏం జరిగింది?"

"ఈ వార్త విని రాయలముఖం కెంపుబారింది. అతడు క్రోధంతో వూగికిపోయేడు 'ఏవిధంగా నయినా గజపతి కుమార్తెనే పరిగ్రహిస్తాను. లేకుంటే ప్రాణత్యాగం చేస్తాను' అని ప్రతిజ్ఞ చేసేడు. ఆ వెంటనే కటకపురికి సైన్యాలను మరలించడమైంది."

"అసలు విషయం ఇప్పుడు తెలిసింది. నిన్నటి యుద్ధపరిస్థితిని బట్టి చూస్తే విజయం అంత సుగమం కాదని నా అభిప్రాయం. విశ్రాంతిలేక మన సైనికులకి ఉత్సాహం, బలం, సన్నగిల్లుతోంది."

"ఔను. నిజమే."

"వీరరుద్రగజపతికీ అతని సామంతులైన మహాపాత్రులు కుడిభుజం వంటివారు. వారి ప్రభుభక్తి అనుపమానం నిన్నటి యుద్ధంలో వారు చూపిన ప్రతిభ నిరుపమానమైనది."

"ఔను. పాత్రులందరూ గజపతితో కలసి ఉన్నంతకాలం మనకు విజయం సులభసాధ్యం కాదు."

"అప్పాజీ! అదనపు సైన్యాలని పంపమని రాజధానికి ఉత్తరం పంపేరా?"

"పంపేను కాని ఆ సైన్యాలు మనల్ని చేరే ముందుగానే ఇక్కడి పరిస్థితులు విషమిస్తాయేమో నని నాకు భయంగా వుంది"

"అదీ నిజమే. ఆ సైన్యాలు మనకి చేరేసరికి కనీసం నెలదినాలైనా పడుతుంది అదీగాక ఈ ప్రదేశం అంతా దుర్గమంగా వుంది. మనకు క్రొత్తది. అందుచేత పరిస్థితులు విషమించవచ్చు"

"మన బలాలు చెక్కు చెదరకుండా గజపతిని వశం చేసుకోలేమా అని ఆలోచిస్తున్నాను."

"మీ బుద్ధికి అసాధ్యమైది ఏది అప్పాజీ! ఆలోచించండి"

తిమ్మరుసు దీర్ఘాలోచనా నిమగ్నుడై ఒక్క క్షణం నిశ్శబ్దంగా ఉన్నాడు. మరుక్షణం అతని పెదవులపై విజయ సూచకమైన చిరునవ్వు వెలసింది. వెంటనే అతడు గోవిందరాయలను ప్రక్కగదిలోకి కొనిపోయి రహస్యంగా మంతనాలు సాగించేరు. పిమ్మట గోవిందరాయలు తన శిబిరానికి మరలిపోయేడు. తిమ్మరుసు వికసిత వదనంతో కృష్ణదేవరాయల శిబిరానికి బయలు దేరేడు.

అక్కడ కటకపురిదుర్గంలో వీరరుద్ర గజపతి తన ప్రధానమంత్రితో మంతనాలు సాగిస్తున్నాడు. తొలిరోజు యుద్ధంలో వారికి విజయం లభించినా మరునాడు అపజయమైంది. ఆనాడు నాయక పాత్రుడు యుద్ధానికి రాకపోడమే దీనికి కారణం అని వారి ఊహ. ఇంతలో నగర రక్షకులైన సైనికులు ఇద్దరు వ్యక్తులను గజపతిముందు నిలిపేరు. వారిని తీక్ష్ణంగా చూసి గజపతి సైనికులతో "ఎవరు వీరు?" అన్నాడు. ఒక సైనికుడు ముందుకి వచ్చి ఇలా చెప్పేడు.

"ప్రభూ! వీరిద్దరూ విజయనగర సైనిక శిబిరాలనుండి మన మహాపాత్రుని గుడారం వంకకుపోతున్నారు. మాకు అనుమానం కలిగి 'ఎవరని' ప్రశ్నించేం. వీరు మామాటలు లక్ష్యపెట్టక ముందుకు సాగిపోయేరు. దండనాధులకు అనుమానం కల్గి వీరిద్దరినీ తమ సన్నిధికి పంపేరు"

పారిశ్రామిక గోష్ఠి

"ఎవరు మీరు?"

"జానపదులం"

"మహాపాత్రులలో మీకేం పని?"

"యాచన"

"నిజం చెప్పండి" అని గద్దించేడు గజపతి

"మేము చెప్పింది నిజమే!"

వెంటనే గజపతి కనుసన్నతో రెండు కొరడాలు వారివీపులపై పడ్డాయి. భయకంపితులై వారిద్దరూ "ప్రభూ! రక్షించండి. సత్యం మనవిచేస్తాం" అని మొరపెట్టుకున్నారు. గజపతి ఆజ్ఞతో శిక్ష ఆగింది. వారిద్దరూ ఒక లేఖను గజపతి సముఖంలో ఉంచి "ప్రభూ! ఈ లేఖను నాయక పాత్రులవారికి అందజేయమని తిమ్మరుసు మహామంత్రి మమ్మల్ని ఆజ్ఞాపించేడు. మాకేం తెలియదు ప్రభూ! జానపదులం. రక్షించండి" అని మొదపెట్టుకున్నారు. ప్రధాని లేఖతీసి ఇలా చదివేడు.

"శ్రీమన్మహామేరుసమానధీరులైన నాయకపాత్రులవారి సన్నిధికి తిమ్మరుసు మహామాత్యులు వ్రాసి పంపుకొను లేఖాంశములు.

మీరుకోరినప్రకారం మీకుస్వాతంత్ర్యం ప్రసాదించడానికి మా ప్రభువులు అంగీకరించేరు. కాబట్టి మీరు మాకు వాగ్దానం చేసిన ప్రకారం మూడు దినాలలో గజపతిని మాకు బందీగా అప్పజెప్పవలెను. మీరు రణరంగంనుండి పలాయితులౌతున్నట్టు నటించి పారిపోయిన యెడల మా సైనికులు విజృంభించి గజపతిని బంధించడానికి వీలు కలుగుతుంది. మీరు మాట తప్పరని విశ్వసిస్తాము.

ఇట్లు మీ
శ్రేయోభిలాషి
తిమ్మరుసు"

లేఖా పఠనం అవుతున్నంతసేపూ గజపతి తనేదో స్వప్నావస్థలో ఉన్నట్టు తలచేడు. ఎంత ద్రోహం! విశ్వాస పాత్రులని నమ్మి తన సర్వస్వం వారి హస్తగతం చేసేడు. చివరకు వారెంత ద్రోహం చేయడానికి పూనుకున్నారు! అతడు జేవురించిన ముఖంతో ప్రధానిని చూసి "పాత్రులు ఇంత ద్రోహానికి ఒడిగడతారంటే నమ్మలేకపోతున్నాను." అన్నాడు. "ప్రభూ! నేను మొదటనే మనవి చేసేను. సర్వస్వం వారి హస్తగతం చెయ్యవద్దని. ఇది తప్పక నమ్మదగ్గదే! అందు చేతనే నిన్నను నాయకపాత్రుడు యుద్ధంలో పాల్గొనలేదు"

ఈ సంభాషణ జరుగుతూండగా జానపదులిద్దరూ గజపతికి నమస్కరించి బయలుదేరేరు. సైనికులు వారినివారించేరు. కాని పరాకుగా వున్న గజపతి విడిచిపెట్టమని సంజ్ఞ చేసేడు. వారు బయటపడ్డారు.

ఇంతలో బయట ముట్టడి జరుగుతూన్న కోలాహలం అకస్మాత్తుగా వృద్ధిచెందింది. ఒక భటుడు రొజుతూ ప్రవేశించి పాత్రులందరూ పలాయితులౌతున్నట్టు తెలియజేసేడు. గజపతికి ఈ వార్తతో చేష్టలు తప్పిపోయేయి. చివరకు తెప్పరిల్లి అతడు ఇలా అన్నాడు.

"మహామంత్రీ! ఇప్పుడుకర్తవ్యమేమిటి?"

"ప్రభూ! వెంటనే సంధి ప్రయత్నాల చేయించండి పిమ్మట కర్తవ్యాన్ని ఆలోచిద్దాం"

వెంటనే గజపతి కోటబురుజుమీద శాంతియుతంగా సంధి సంప్రదింపులను కాంక్షించే ధవళ పతాకం రెపరెపలాడింది. దానికోసమే ఎగురు చూస్తున్న తిమ్మరుసు వెంటనే యుద్ధాన్ని ఆపవలసిందిగా ఆజ్ఞలనిచ్చేడు. పిమ్మట రాయలు కోరిన షరతులకు అంగీకరిస్తూ దూతని పంపేడు గజపతి తిమ్మరుసు అన్నపూర్ణను రాయలకిచ్చి పాణిగ్రహణ మొనరించవలసిందిగా వార్త పంపేడు. గత్యంతరంలేక గజపతి అంగీకరించేడు.

గోవిందరాయలతో మంతనాలు ముగించి తిమ్మరుసు రాయలతోకూడ ఆలోచించి, ఇద్దరి సైనికులకు ఒక లేఖను ఇచ్చి, జాన

★ మేధాశక్తి ★

పసుల వేషంతో పాత్రుల శిబిరాలపైపు గజపతి సైనికులు చూస్తూండగా పొమ్మని ఆదేశించేడు. వారు పట్టుబడ్డ తరువాత వారు చెయ్యవలసిన విధానం అంతా వారికి ఉపదేశించేడు. వారిద్దరూ బంధిపబడిన వెంటనే తిమ్మరుసు సైనికులను హెచ్చరిస్తూ పెద్దకోలాహలం చేయించేడు. ఇంతలో "గజపతి మాయోపాయముచే పట్టుబడెను" అన్న కేకలు వినిపించేయి. ఆ శబ్దం గజపతి మందిరం వైపునుండి రావడంచేత అందరూ నమ్మేరు. ఆ కేకలు వేసిన వారు జానపదులమని చెప్పిన యిద్దరు వ్యక్తులే! గజపతివద్ద శెలవుతీసుకొని వస్తూ తిమ్మరుసు ఆదేశానుసారం అలా కేకలు వేసేరు. ఈ వార్త వినగానే సైన్యం చెల్లాచెదరైపోయింది. అదిచూసి విజయనగరం సైనికులు విజృంభించేరు. పాత్రులు చేసేది లేక బలాలతో సహా పలాయితులయినారు. పాత్రులు పలాయితులౌతున్నట్టు గజపతికి తెలిసింది. ఈ సంఘటన లేఖలో ఉన్న విధంగా జరిగిందని భావించేడు గజపతి. ఇంక తననెలాగైనా బంధిస్తారని భయపడి గజపతి సంధి సంప్రదింపులుచేసేడు. రాయల కోరిక ప్రకారం అన్నపూర్ణని అతనికిచ్చి వివాహమహోత్సవం జరిపించడానికి నిర్ణయమైంది.

వైవాహిక క్రియ అతివైభవంగాజరిగింది. రాయలు కవి గాయకులకు ఘనంగా సన్మానాలు చేసేడు. ఒక సభచేసి సామంతరాజుల నందరినీ ఉచితరీతిని సత్కరించేడు. దీంతో గజపతి సామంతులు అందరూ రాయల ఔదార్యాన్ని వేనోళ్లనుతించేరు. వివాహానంతరం రాయలు తన ప్రతిజ్ఞ తీరిందని సంతసించేడు. కాని తిమ్మరుసుమాత్రం గజపతిని పూర్తిగా నమ్మలేదు. రహస్యంగా చారుల్ని నియోగించి అతని చర్యల్ని ఎప్పటికప్పుడు తెల్సుకుంటున్నాడు. అంతఃపురంలో కూడా రహస్య సంచారుల్ని ఉంచేడు.

ఆ నాడు శోభనమహోత్సవం. శోభనగృహం అత్యద్భుతంగా అలంకరించేరు. నాటి రాత్రి శోభనగృహం ప్రవేశించబోయేముందు తిమ్మరుసు రాయలను ఏకాంతంగా కొనిపోయి రహస్యంగా కొన్ని సంగతులు ముచ్చటించేడు. తరువాత తిమ్మరుసు రాయలను శోభన గృహంలోకి సాగనంపి తాను నిష్క్రమించేడు. చెలికత్తెలు అన్నపూర్ణను కొనివచ్చి పడకటింట్లో ప్రవేశపెట్టేరు. వేడుకలు ముగిసిన పిమ్మట దంపతులను ఇద్దరినీ పాన్పుపై ఆసీనులవమన్నారు. పాన్పు సమీపిస్తూనే రాయలు తన చేతితో బలంగా పాన్పు నాలుగువైపులా తట్టేడు. వెంటనే పటపటమన్న శబ్దంతో కుట్లుతెగి దిండూ, బాలీసులూ అన్నీలోతున ఎక్కడో నీటలోపడిన శబ్దం వినిపించింది. ఇంతలో అన్నపూర్ణ రాయల వక్షస్థలంపై బాకుతో పొడిచింది. బాకువంకరపోయిందే గాని రాయలకు హాని కలగలేదు. ఇంతలో బయట కోలాహలం చెలరేగింది. సైనికులతో ప్రవేశించి తిమ్మరుసు అన్నపూర్ణను ఖైదు చేసేడు. రాయలు ఆశ్చర్యపోతూ ఇలా అన్నాడు.

"అప్పాజీ! ఆమెను ఖైదు చెయ్యడం ఎందుకు? దీనికి మూలకారకుడు ఆ గజపతిని బంధించండి."

"రాజా! ఈమె నిజమైన అన్నపూర్ణ కాదు. చూడు."అంటూ మేలిముసుకుపటుకులాగేడు. రాయల ఆశ్చర్యానికి మేర లేదు.

"ఆఁ! పురుషుడా! ఎవరితను?"

"ఇతను గజపతి ఉంపుడుకత్తె కుమారుడు. తండ్రి ఆజ్ఞవల్ల ఈ ఘాతుక కృత్యం చెయ్యడానికి పూనుకున్నాడు."

"నా కిదంతా అగమ్యంగా గోచరిస్తూంది."

"అసలు నీకు వివాహమైంది కూడా ఈ అన్నపూర్ణతోనే. నిజమైన అన్నపూర్ణ శుద్ధాంతంలో ఉంది."

ఇంతలో యిద్దరు భటులు ప్రవేశించి:

"ప్రభూ! గజపతి సొరంగమార్గం ద్వారా పారిపోతున్నాడు." అని చెప్పేరు. తిమ్మరుసు నిశ్చలంగా "ఫరవాలేదు. గోవిందరాయలు జాగ్రత్తగా అతన్ని బంధించి తెస్తాడు" అన్నాడు.

రాయలు ఆశ్చర్యంగా "అప్పాజీ! మీకు ఈ కుట్ర సంగతి పూర్తిగా తెలుసా?"

"తెలుసు. అందుకనే నిన్ను లోన కవచం వేసికొనమని హెచ్చరించేను."

"ఔను. మీరు నన్ను కవచం వేసికొనమని హెచ్చరించి, పాన్పు గట్టిగా తట్టమని చెప్పినప్పుడే ఏదైనా కుట్ర జరిగి వుంటుందని ఊహించేను. మరి గజపతి పారిపోతాడని మీరెలా ఊహించేరు?"

"అతని ప్రయత్నాలుగాని వ్యర్థమైతే పలాయనం కావడానికి అన్ని యేర్పాట్లూ చేసే ఉంచేడు గజపతి. అది నాకు ముందే తెలిసింది. మన చారులు ఆ సొరంగమార్గం ఎక్కడి వరకూ ఉన్నదో తెల్సుకున్నారు. గోవిందరాయలు ముందుగా కొంత సైన్యంతో వెళ్లి ఆ మార్గంలో ఒకచోట వేచి ఉన్నాడు. అతడు గజపతిని బంధిస్తాడు."

"అప్పాజీ! మీకు నా కృతజ్ఞతని ఎలా తెలియచెయ్యాలో నాకు తెలియడం లేదు."

ఇంతలో గోవిందరాయలు బందీకృతులైన గజపతి కుటుంబంతో సహా ప్రవేశించేడు. తిమ్మరుసు ఆదరంగా చూసి:

"ఓహో! వీరరుద్రగజపతి మహారాజులా! దయచెయ్యండి." అన్నాడు.

రాయలు కోపంతో ఏదో అనబోయేడు. కాని తిమ్మరుసు కనుసన్నతో శాంతించేడు. తరువాత తిమ్మరుసు అతని చెవిలో ఏదో చెప్పేడు. వెంటనే రాయలు చిరునవ్వుతో గజపతి బంధాల్ని విడిపించి నమస్కరించేడు. రాయలు, తిమ్మరుసు చూపిన ఆదరానికి గజపతి సిగ్గుపడ్డాడు. అతని హృదయం పశ్చాత్తాపంతో నిండిపోయింది. ఆ తరువాత గజపతి మనస్ఫూర్తిగా అన్నపూర్ణను రాయలకిచ్చి అతి వైభవంగా వివాహం చేసేడు. ఈ విధంగా రాయలు విజలక్ష్మితో పాటు అన్నపూర్ణనుకూడ పరిగ్రహించి విజయనగరానికి మరలిపోయేడు.

ఈ విధంగా తిమ్మరుసు తన మేధాశక్తి వల్ల సామంతులకు, గజపతికి వైషమ్యాలు కల్పించి తనప్రభువుకు విజయం ప్రాప్తించేటట్టుచేసి, శోభన గృహంలో జరిగిన కుట్రనుకూడ తెలిసికొని రాయలకు ప్రాణదానం చేసి రక్షించేడు. ఆ తరువాత విజయనగరంలో జరిగిన విజయోత్సవ సభలలో రాయలు మహత్తర రాజకీయ ప్రజ్ఞాధురంధరుడు, శాంతమూర్తి, మేధాశక్తిసంపన్నుడు ఐన తిమ్మరుసును వేనోళ్ల నుతించి సన్మానించేడు. ★

ద్వాదశి గ్లాసు

ద్వాదశిగ్లాసు పోయింది. అందమైన, ముద్దొచ్చే కంచుద్వాదశిగ్లాసు-మాంచి దళసరిగా, మధ్య వొంపు తిరిగి నిగనిగలాడే ద్వాదశిగ్లాసు - రోజూ కాఫీలదగ్గర కిష్టిగాడూ, వాసుగాడూ "ద్వాదశిగ్లాసుతో నేను తాగాలంటే నేను తాగాలని" తగూలాడుకునే ద్వాదశిగ్లాసు-పోయింది! పత్తా లేకుండా పోయింది.

ఎలాపోయిందో ఎవరికీ తెలీదు.

ఇంట్లో అందరికీ యీ విషయం కష్టం కలిగించింది. కిష్టిగాడూ, వాసుగాడూ సరే సరి; మొహాలు ముడ్చుకుంటూ కూచున్నారు. ఆఫీసునుంచి వచ్చిన మామయ్య కూడా ఈ సంగతి తెలిసి ఇంట్లో అందర్నీ కేకలేశాడు—"ఎవరేనా యింటికి కొత్తవాళ్ళు వచ్చారంటే ఇహ యింట్లో వాళ్లకు ఒళ్లూ, గిళ్లూ తెలీదు!...ఛ! సంసారమన్నాక!...అసలు యీ జాగర్తలన్నీ ఒకళు చెబితే వొస్తాయా?, స్వతహాగా రావాలిగాని!" అంటూ అస్త్ర సన్యాసం చేసి ఆఫీసుకు వెళ్లిపోయాడు.

అందరి సంగతీ అలావుంచి బామ్మకు మాత్రం ఈవిషయం మరీ బాధ కలిగించింది. గ్లాసు పోయిందని మామయ్యతో చెబుతున్నప్పుడు బామ్మకు కళ్ల నీళ్ల పర్యంతం అయింది!

కాదా మరి; ఆగ్లాసు ఆవిడ స్నేహితురాలైన స్వర్గీయ నరసాయమ్మగారి జ్ఞాపక చిహ్నం! నరసాయమ్మ చనిపోయేముందు, ఓసారి ఏకాదశి ఉపవాసంచేసి, ద్వాదశి పారణకు ఎవర్నయినా ఒడుగైన కుర్రాణ్ని బ్రాహ్మడికి పిలిచి పెట్టమని బామ్మతో అందిట. అప్పుడు బామ్మ "ఎవర్నో ఎందుకు నరసాయమ్మక్కయ్యా!, నిక్షేపం వంటి బ్రహ్మచారి వెధవ మా యింట్లో వుండగా." అని చెప్పి, ఆవిడిచేత "అయ్యొ నా తెలివిమండా! ఆమాటే మరిచానక్కయ్యా!.. సరే, మరో చోటికి పోవటమెందుకంట, వాణ్ని పంపేం!" అనిపించుకుని, శేషుబావను బ్రహ్మచారిగా పంపిందట. నరసాయమ్మక్కయ్య వాడికి ఆపోశనం వేసుకుని, పంచభక్ష్య పరమాన్నాలు ...వగైరాలతో భోజనంపెట్టి, పాయసంతో నిండిన చక్కని కంచుగ్లాసును వాడికి దానమిచ్చిందట. అదే యీద్వాదశిగ్లాసు! ఇది అయిదేళ్ళ కిందటి మాట......

అంత చరిత్రాత్మకమైన ద్వాదశిగ్లాసు పోతే బామ్మకు దుఃఖం కలగడంలో వింతేమీ లేదు.

ఎలాపోయిందో జాడలేదు. జాడ తెలిస్తే పోల్చుకోవడం సులభం. దానిమీద ముత్యాలంతేసి అక్షరాలతో "రావులకొల్లు చంద్రమౌళి పంతులు" అని మామయ్య పేరుంది.

ఎలాపోయిందో......

ఆ ముందురోజు సాయంత్రం ఇంటికి రంగమ్మత్తయ్య—చిన మామయ్య భార్య-వచ్చిందట. రంగమత్తయ్య చెయ్యి ఇటువంటి వస్తువుల్ని చూసినప్పుడల్లా కాస్త స్వైరవిహారం చేస్తుండటం కద్దు!...... ఆవిడ తిరిగి వెళ్ళిపోయినాక — రాత్రి అన్నాల దగ్గర కిష్టిగాడు ద్వాదశిగ్లాసు కోసం వెతికి తేలేదు!

"ఇది తప్పకుండా ఆరంగిపనే రా బాబూ! ఆ గ్లాసు దానింట్లో అయినా చేరి వుండాలి; లేదా రెక్కలు కట్టుకుని మరో దేశానికి ఎగిరిపోయైనా వుండాలి." అంది బామ్మ.

పణతుల రామచంద్రయ్య

"అవునే బామ్మా! ఈ మధ్య పత్రికల్లో కూడా చదివినట్లు జ్ఞాపకం — అదేదో దేశంలో కంచాలూ, అవీ ఎగిరిపోతున్నాయనీ—" అన్నాను.

ఈ గ్లాసు ఎగిరిపోయినా ఆ రంగి యింట్లోనే తిరిగి వాలివుంటుంది" అంది బామ్మ. పాపం! బామ్మకు రెండురోజుల్నించీ అన్నం కూడా సరిగా సహించటం లేదు.

నాలుగోరోజు ఆచోకీ తెలిసింది. అందరి అనుమానమూ అక్షరాల నిజమయింది. రంగమ్మత్తయ్య యింట్లోనే వాలిందట ఆగ్లాసు!

వరహాలతో నింపిన పెద్దబంగారు బిందె హఠాత్తుగా పోయి హఠాత్తుగా దొరికినంత సంతోషం బామ్మకు! చచ్చి స్వర్గానికి పోయిన నరసాయమ్మక్కయ్య ఉన్నట్టుండి భూలోకానికి దిగివచ్చి, తన్ను అమాంతం కౌగలించుకున్నట్లయింది ఆమెకు!

బామ్మ స్వతహాగా అహింసావాది. అందువల్ల ఈ ఆచోకీ తెలియగానే రంగమ్మత్తయ్య మీద కోపం సెగలు లేచినా, కడుపులో అగ్నిపర్వతాలు విజృంభించినా-ఏమీ తెలియనట్లే అతిసౌమ్యంగా కార్యం సాధించుకు రాదలచింది. పాలచెంబులు మొహంలో దొంతర్లాడించుకుంటూ పోయి, రంగమత్తయ్యను కదలేసింది.

"ఈ రోజు మా తమ్ముడికి ఏం కూర వండి పెట్టావే" అంటూ సంభాషణకు నాందీ పలికి, "అయ్యో! అదేం నాగరీకమే మా తల్లీ! రోజుకు రోజుకూ నూలుదారమై పోతున్నావూ! మా తమ్ముడికి బియ్యం ఆదా చేస్తున్నావంటే—నీ నాగరీకంమీద వానకురిసిపోనూ!" అన్నదాకా వచ్చి; ఆ తర్వాత ద్వాదశి గ్లాసు విషయాన్ని పట్టు మడతల్లో చుట్టి ఆవిడముందు పెట్టింది.

అయితే రంగమ్మత్తయ్యమాత్రం ఏం తక్కువ తిన్నది గనక! కాకుంటే, అప్పుడప్పుడు చెయ్యిమాత్రం ఏదో ముందూ వెనకా లేకుండా ప్రవర్తిస్తూ వుంటుందని కాని, నోరు విప్పితే ఎంత సౌమ్యమనీ, ఎంత లాలనా, ఏమికదా!

ఆమె ఏమన్నదంటే—

"అయ్యొయ్యొయ్యొయ్యొ! ఎవరు చేశారే వొదినా అంతపనీ! ఎవరికి చేతులాడాయో నమ్మా!...పాపం, చచ్చి ఏలోకానవుందో నరసాయమ్మొదిన, ఆ గ్లాసు చూడగానే గుర్తొచ్చేది. అయినా ఎవరు తీశారో, వాళ్ల చేతులు విరిగిపోనూ..."

బామ్మ ఎడదలో బడబాగ్ని సెగలు రేగింది. "నీ చేతులు విరిగిపోతే ఎలాగే, ఇంకా ఎన్ని ద్వాదశి గ్లాసులు జాగర్త చెయ్యాలో నువ్వు" అని స్వగతం చెప్పకుంది. ఆ మరుక్షణంలోనే ఆ విషయాన్ని మార్చేసి (ఇదే బామ్మలోని ప్రత్యేకత), ఏదో లోకాభి రామాయణం మాట్లాడుతూ, ఇల్లు నలుమూలలా దృష్టి సారించింది. సారించేసరికి, ఇంకేముందీ' దక్షిణపుమూల, ఆవకాయ జాడీ పక్కనే ద్వాదశిగ్లాసు కనిపించింది!

అయితే బామ్మ వెంటనే లంఘించి ఆ గ్లాసును చేతిలోకి లాక్కోలేదు. తన కోపాన్నీ, ఆశ్చర్యాన్నీ గుండెల్లోనే అదిమి పట్టుకుని, ఏదో పనివున్నట్లుగా ఆ యింట్లో కాస్సేపు ఆ వేపుకూ యీ వేపుకూ తిరిగింది. రంగమ్మత్తయ్య చూస్తుండగా ఆవిడ కన్నుగప్పి దాన్ని ఇవతలికి దాటేయడం బ్రహ్మాదులకూ్కడా తరం కాదని బామ్మకు తెలుసు. అందువల్ల, అలా పచార్లుచేసి, అప్పుడే చూసినట్లుగా

ద్వాదశి గ్లాసు

సంభ్రమాశ్చర్యాలు నటిస్తూ, ఆ గ్లాసును చేతిలోకి తీసుకుని—"ఇదిగో నే పిల్లా గ్లాసు! చూశావా, యీ పిల్ల వెధవలు ఆటల్లో తీసుకొచ్చి యిక్కడ పడేసివుంటారు. నీ మతిమరుపులో నువ్వూ చూసి వుండవ్." అంది!

అయితే, ముందుగా నే మనవి చేసుకున్నానుగా, రంగమ్మత్తయ్య బామ్మకంటె రెండాకులు ఎక్కువే చదివిందని! అవిడ హనుమంతుడల్లే బామ్మ దగ్గరికి వచ్చి, నెమ్మదిగా ఆ గ్లాసును బామ్మ చేతుల్లోంచి ఊడలాక్కుని కింద పెట్టింది.

అలా ఊడలాక్కుంటూంటే బొమ్మలా నిల్చుని చూస్తున్న బామ్మతో రంగమ్మత్తయ్య "అయ్యో! నేననుకుంటూనే వున్నా వొదినా, మీ ద్వాదశి గ్లాసూ ఇదీ ఒకే పోలికగా వున్నాయా, ఎప్పుడో వీట్ని గురించి కీచులాటలు తప్పవని అనుకుంటున్నట్టే అయింది గదా!" అంది.

ఈ మాటల్తో బామ్మ కోపం ఉన్నతోన్నత శిఖరాల నందుకుంది. అవిడ రెచ్చిపోయి, "చూసి మాట్లాడవే! దాని మీద పేరు చూడు-చంద్రమౌళి అని రాసివుందో లేదో" అంది.

ఐతే, యీ మాత్రపు కోపాలకే జడిసిపోతే రంగమ్మత్తయ్య ప్రత్యేకత మాత్రం ఏముంది? ఇలాంటి సాక్ష్యంలేని ప్రశ్నలకు జవాబు చెప్పడం అవిడకొక లెక్కలోది కాదు ఈ సంగతి మీరీ పాటికే గ్రహించి వుంటారు.

"హయ్యో! అదికాదే వొదినా, మొన్న నెవరో ఇలాంటి గ్లాసులు అమ్మొస్తేనూ, ఒక్కటైనా కొని పెట్టమని నానిగాడు ఒకటే గోల. ఇక కొనకుంటే ఊరుకోడు గదా మొండి వెధవ! అందులోనూ మొండి అనేది రావులకొల్లు వారి వంశంలో ఈనాడు కొత్త కొదాయె! ఏతమ్మాయ్ వదినా! అదిగో చూశావా, రావుల కొల్లు వారి న నేసరికి ఎంత కోపమొస్తోందమ్మ నీకూ! సరే తరవాత తీరా చేతికొచ్చాక రూపాయీ పెట్టి కొనేసరికి—ఆ చెక్కేవాడు తయారై కూనుని "ఎం పేరెయ్యమంటా రమ్మగారూ?" అంటూ ఒకటే సొద! ఇదిగో, నువ్వే చెప్పొదినా, అంత మందిలోనూ 'ఆయన' పేరు చెప్పి వెయ్యమనడ మెలాగ చెప్పు? అదే యీ కాలప్పిల్లలైతే అడక్కముందే చెప్తుంటారనుకో, గంట కొట్టినట్టు! నిజం చెప్పొద్దు తల్లి, నాకు చచ్చే సిగ్గయ్యింది. అంగువల్ల, ఎవరి పేరైతే యేంలే, ఇందులో కాదనేది మాత్రమేముందీ అనే వుద్దేశంతో, పెద్దాయన పేరు చెప్పి, ఆపేరే వెయ్యమన్నా

నసుకో. ఇదే వొదినా నేం చేసిన పాపం. చేసిన పాపం చెబితే పోతుందంటారు ." అంటూ కథనం చేసింది రంగమ్మత్తయ్య

ఈ మాటలు వింటూ బామ్మ ఎలా మండిపోయిందో, ఆమె గుండెల్లో ఎన్ని ప్రళయ కాల భయంకర పర్జన్యాలు గర్జించాయో చెప్పలేను గాని, ఆవిడ మరొక్క క్షణం అక్కడ కూచోకుండా లేచి వచ్చేసిన మాట మాత్రం నిజం

అంతే! ఆరోజునుంచీ రంగమ్మత్తయ్య కూడా మా యింటికి రాకపోకలు తగ్గించింది అథవా వచ్చినా బామ్మ ఆవిడతో మాట్లాడదు. పాపం బామ్మకు సరిగ్గా అన్నం సయించడంలేదు స్వర్గంలో వుందనుకొన్న నరసాయమ్మ బామ్మ హృదయంలోకివచ్చి కూర్చుని "నా ద్వాదశి గ్లాసు మాటేమిటి? ఇందుకేనా ఆ గ్లాసు నీకిచ్చింది?" అంటూ గొడవ చేస్తోంది

ఎలాగ తిరిగి ఆగ్లాసు రాబట్టడం? బామ్మ కిదే సమస్య ఐపోయింది

చిత్రమేమిటంటే, మానవుడు పరిష్కరించలేని ఎన్నో జటిల సమస్యల్ని విధి ఇట్టే పరిష్కరించి పారేస్తుంటుంది లేకపోతే, బామ్మతో తగూ పడినాక నెల తిరక్కుండా నే రంగమ్మత్తయ్యకు అంత జబ్బుచేస్తుందని ఎవరనుకున్నారు?

వాళ్ళా వీళ్ళా సలహాలమీదట రంగమ్మత్తయ్యను మామయ్య అమెరికన్ ఆస్పత్రిలో చేర్చాడు రోజు రోజుకూ జబ్బు ఎక్కువౌతోందేకాని తగ్గుముఖం కాలేదు. ఎన్ని స్పర్థలున్నా ఇలాంటప్పుడు సాధింపులు పనికి రావు కదా! అంచేత బామ్మ ప్రతిరోజూ ఆస్పత్రికి పోయి రంగమ్మత్తయ్యను పలకరించి వస్తుండేది

ఓరోజు బామ్మ రంగమ్మత్తయ్యను చూడటానికని ఆస్పత్రికిపోయింది ఆమె వెళ్లేసరికి రోగి దగ్గర ఎవ్వరూ లేరు; రంగమ్మత్తయ్య మేలుకుని పడుకొనివున్నది అంతకు ముందు రోజునుంచీ జ్వరం కొంచెం సుమారుగా వుంది ఆవిడకి

బామ్మను చూడగానే రంగమ్మత్తయ్య నీరసంగా, "రావొదినా, ఇలా వచ్చికూచో" అంది చెయ్యిచూపిస్తూ. పాతాళబిలం లోపల్నుంచి మాట్లాడుతున్నట్టుంది ఆవిడ గొంతు.

బామ్మ వెళ్ళి పడకమీద కూచుంది

రెండు నిముషాలు నిశ్శబ్దంగా గడిచాక, "ఎలావుందే?" అని అడిగింది బామ్మ.

"ఎలావుంది? హుం, హుం, హుం! అధ్వాన్నంగా వుంది

ఈ జీవి ఇంతటితోకడతేరిపోయినా " అంది రంగమ్మత్తయ్య ముక్కుతూ

"అయ్యో, అదేవిటే" అంది బామ్మ అసలు రంగమ్మత్తయ్య అలా అన్నదే కాని, ఆ విడకి మాత్రం తెలీదూ, తను చనిపోదనీ, చనిపోలేదనీ!

ఆవిడ మళ్ళీ ముక్కుతూ "హుం ఏమో నమ్మ వొదినా? నాకేం, నేను బతుకు తానని నమ్మకం అవుపించడంలేదు . ఇదిగో వొదినా, నేను వెళ్ళిపోయేటట్లయితే ఆయన్నూ, పిల్లగాడ్నీ నీ చేతుల్లో పెట్టి పోతున్నాను " అంది

"ఊ! ఊరుకో ఏంమాటలు?" అంది బామ్మ మందలింపుగా రంగమ్మత్తయ్య కేమీ ధోకాలేదని తనక్కూడా నిర్ధారణ అయినందువల్ల, అంతకంటె యెక్కువగా ఆవిణ్ణి ఓదార్చవలసిన అవసరం కనిపించలేదు బామ్మకు!

బామ్మ అంది "ఆఁ, యేమిటో ఎప్పుడో ఒకప్పుడు అంతా కదిలి వెళ్ళవలసిందే, ఆ శ్రీమన్నారాయణమూర్తి పిలుపు వచ్చినప్పుడు తప్పుతుందా? ఆ వెళ్ళిపోయే సమయంలో మనస్సు శాంతిగావుంటే చాలు "

రంగమ్మత్తయ్య అదిరిపడింది. "అవును" అన్నట్టుగా ఒక్క మూలుగు మూలిగింది.

బామ్మ మళ్లీ అంది

"ఇగుగో, నీసంగతికూడా ఎటూ చెప్ప ఎటొస్తుందో ఇప్పటికి ఆందోళనగా వుందా . ఇటు వంటప్పుడయినా కాస్త మనస్సుకు శాంతివుండాలి కదా, ఎటువంటి కల్మషమూ లేకుండా "

రంగమ్మత్తయ్యకు భయమేసింది! ఎవరో తన్ను మంచంతో సహా గాలిలోకి ఈడ్చుకుపోతున్నట్టనిపించింది ఏమిటి? తను చనిపోతుందా? చనిపోతుందా? నిజమేనా? మరి తనింకా బతుకుతుందనుకుంటోందే? ఏమో ఏమో!

రంగమ్మత్తయ్య మాట్లాడలేకపోయింది.

బామ్మ "ఒప్పుకుంటున్నావు గదా! . ఇదిగో అమ్మాయ్! నీ విషయంలో ఒక్కటడుగుతున్నాను దానిమీద ఇదివరకు జరిగిందేదో జరిగిపోయింది ఇప్పుడైనా మనస్ఫూర్తిగా నిజంచెప్పు నేనుకూడా ఇంకో విధంగా అనుకోను" అంది.

"ఏవిఁటొదినా?"

"ఏంలేదు ద్వాదశి గ్లాసుసంగతి నిజం చెప్పమ్మాయి! ఈ సమయంలోనైనా నీ మనస్సుకు శాంతి కలుగుతుంది కాస్త" అంది బామ్మ

అంతే!

ఈసారి అగ్నిపర్వతాలు ప్రేలటమూ లేదు, సెగలు రేగటమూ లేదు.

రంగమ్మత్తయ్య తప్పు ఒప్పేసుకుంది "నన్ను క్షమించానను వొదినా! ఆరోజు నే చెప్పింది అబద్ధమే నీకు నా మీద ఆపేక్షవుంటే తిరిగి ఆగ్లాసు నీయింటికి చేర్చు! పాపిష్టిదాన్ని ఆ లోకంలో నరసాయమ్మొదిన ఎన్ని శాపనార్థాలు పెడుతోందో నామీద వొదినా, నన్ను క్షమించానని వొట్టువెయ్యి " మొదలే నీరసంగా వున్న రంగమ్మత్తయ్య కంఠం మరీ పూడుకుపోయింది.

బామ్మ పెదాలమీద చిరునవ్వూ, అభయముద్రా!

"పిచ్చిదానా! అలా బెంబేలు పడిపోతావేమిటే? నువ్వేం చేశావని క్షమించటానికి? కాకుంటె—నీమనస్సు ఎలాంటి కలతలేకుండా వుండాలనిగానీ, ఆ ముష్టి ద్వాదశిగ్లాసుకోసమటే యావనాకు? అది ఎవరింట్లో వుంటేనేం? అలాంటివేం పెట్టుకోక కాస్త నిమ్మళంగా పడుకో ఈ జ్వరమేం చేస్తుంది? రేపిపాటికి తగ్గిపోదూ! . వెర్రిబాగుల్దానా! నరసాయమ్మక్కయ్య ఎందుకు తిడుతుందే నిన్ను?—పాపం! నిజంగా దేవత! నీకు తెలీదూ, నిజంగా నువ్వంటే ఎంత ప్రేమగా వుండేదో . నిన్ను "రంగీ, రంగీ" అంటూ .."

తర్వాత మరో గంటసేపు అక్కడే కూచుని రంగమ్మత్తయ్యమీద ఈగవాలకుండా పరిచర్యలు చేసి ఇంటికొచ్చింది బామ్మ

నాలుగైదురోజుల్లో రంగమ్మత్తయ్య పూర్తిగా కోలుకుంది ఆస్పత్రినుంచీ యింటికి తీసుకొచ్చారు.


ఆరోజే బామ్మ చూచిరావడానికివెళ్లింది రంగమ్మత్తయ్యను కూచోబెట్టి, ఆ పూటకి తనే అక్కడ వంటచేసి ఆవిడకు పథ్యం పెట్టింది.

ఆ సాయంత్రం తిరిగివస్తూ, రంగమ్మత్తయ్యతో "ఏమేవ్! పథ్యం జాగర్త కూడనవీ కూడనివీ తిని మళ్లీ తిరగబెట్టేను - నువ్వసలే అస్తావిస్తప్పిల్లవి ఇదిగో, ద్వాదశిగ్లాసు తీసుకెళ్లుతున్నాను" అని చెప్పి, ద్వాదశి గ్లాసును ఇంటకి తీసుకు వచ్చేసింది బామ్మ

ఆరోజు బామ్మ తేలికగా, తృప్తిగా నిట్టూర్చింది. ★

చలచిత్ర కథలు

విక్రమార్కుడి మార్కు సింహాసనం



“దిగలేవా?.. ఒక కథ చెబుతానువిను ” అన్నాడు నరసన్న నవ్వుతూ.

.. ఇలాగే ఓసారి తంజావూరునించి చలనచిత్ర రాజధానికి ఒక రైలు పరిగెడుతోంది. అందులో ఒక ప్రముఖదర్శకుడు ఉన్నాడు. ఒక “మామూలు ముఖ” నటుడు కూడా ఉన్నాడు, చెప్పలేముగదా ఏ ముఖం వెనక ఎంతటి మహానటుడున్నాడో

“మరేండి ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండు అన్నాడు. వెనకటికొక మహా కవి” అన్నాడు రాజు తకీమని.

“భేష్. నువ్వు మామూలు డైలాగులే కాదు అడిషనల్ డైలాగులు కూడా రాయడానికి పనికొస్తావు నేచెప్పలే? నీకాశక్తి ఉన్నట్టుందని? ”

“థాంక్యూ సార్. చిన్నప్పట్నించీ డైలాగులంటే నాకు చాలాయిష్టం. అదే నాజీవిత లక్ష్యమండి. అవిలేంగే బతకలేనండి . ఓకోసారి అర్ధరాత్రి గబుక్కున డైలాగులు రాసేస్తానండి ఏమిటో మా వూళ్లో నాగయ్యగారు ఊహూ మెచ్చుకునేవారు. మీరు డైలాగులు రాయాలండీ అసలందుకే పుట్టారండీ అని” అన్నాడు రాజు వినమ్రత ఉట్టిపడేలా,

“ఎవరూ? నేనా” అన్నాడు నరసన్న తుళ్లిపడి.

“కాదు. నేనండి ”

“నాసెన్స్ నేనెందుకు పుట్టినట్టు, మరి?”

“మీరు అడిషనల్ డైలాగు రాస్తానన్నరుగా?”

“గ్రాండ్! నీది బలే చురుకైన బుద్ధి సుమా అసలు ఇవాళ సినేరియోలు రాసేవాళ్లెంతమందికి ఇంత దారుణమైన చురుకుతనం ఉంది?” అంటూ.

“ఒక్కడికిగూడా లేదుటండి. మా ఊళ్లో నాగయ్యగారు చెప్పారు. అందరూ ఉత్తి మప్పులుటండి. నువ్వొక్కడివే జీనియస్ వోయ్ అన్నారండి.”

“ఎవరు నేనా?” అన్నాడు నరసన్న మళ్ళీ తుళ్ళిపడి

“కాదు నేనండి” అన్నాడు రాజు వినయవేషం వేసుకుని

“మరి నే నెవణ్నోట?”

“మీరు అడిషనల్ డైలాగు రైటరన్నారుకదండీ ఇంకోటి. నాగయ్యగారు మీకు తెలీగుగా అందుకని ఆయనచెప్పేవి నన్ను గురించేండి.”

“ఐనాసరే నేనుకూడా జీనియస్ నే ”

“పోన్లెండి మనిద్దరం జీనియసులమే ”

“రైట్. అలా సర్దుకుపోవాలి గుత్త

ఎస్. పార్థసారధి

తీసుకుంటే ఎలా? మనిద్దరం జీనియసులమే చూట్టానికి వేరే వేరేగాఉన్నా అసలు జీనియసులమే ఇందాక డైలాగు చెప్పావు ఏమిటదీ ఉప్పుగురించి దాన్ని తిరగేస్తే మనం.”

“మరేండీ ”

“అన్నట్టు అ ఉప్పు డైలాగు మనకన్నా ముందరే ఎవడో రాశాడన్నావు ఎవడు వాడు?”

“వాడాండి వాడిపేరు పోతన్న అండి”

“ఐసీ ఇదివరకు ఎన్ని పిక్చర్లకి రాశాడు?” ఇదెందులో పెట్టాడు?” బావుంది లిరికల్ బ్యూటీవుంది. అందుకే అడిగాను రేపు నేను తెలుగు పిక్చర్ కిరాస్తే వాడుద్దామని ” అన్నాడు నరసన్న గంభీరంగా.

“ఆయన ఏ పిక్చరుకి రాసినట్టే లేదండి కాని, ఓ పిక్చర్ లో వేశాడు. దాని పేరు కూడా పోతన్నే అనుకుంటా.”

‘ఐసీ’ అన్నాడు నరసన్న.

ఈ సంగతి ఆయనకి నచ్చలేదనిరాజుకి అనుమానం వేసింది

“వేమన్న” అనుకుంటావండి వున్నాడు గబుక్కున ఉత్సాహంగా.

“వేమన్న కానీ ఇంకేమన్నా కానీ ఐవిల్ యూజ్ దిడైలాగ్. నేను దీనిని వాడుతాను. ఇది బాగుంది. నువ్వేమన్నా సరే”

“నేనేం అంటానండి నేను హీరో ఛాన్సు దొరక్కపోతే, డైలాగులు రాద్దామనుకున్నాను. ఈలోగా వాడనులెండి ”

“ అన్నట్టు ఛాన్సులగురించి కదు మాట్లాడుకున్నాం? వడివేలు కథ చెప్ప బోయాను

వడివేలు కథ

“ అదేఓరోజున రైలుపరుగెడుతోంది మెద్రాసుకి అందులో ఒక పెద్ద డైరక్టరు ఉన్నాడు. మన కథకి సదుపాయంగా ఉంటుందని సెకండు క్లాసులోనే ఎక్కాడు అందులోనే ఈ వడివేలూ ఎక్కాడు. అతడు రైలు గుమాస్తా ప్లాసులూ అవీ దొరుకుతాయి నాటకాల్లో దారుణంగా నటించేస్తూ ఉంటే చూసి అతని స్నేహితులంతా, మెద్రాసుపోయి సినిమాల్లో చేరిపోరా బాబూ అని పోరారు. అందుకని సెల్లాళ్లు సెలవు పెట్టి, పెళానికి నచ్చచెప్పి, ప్యాసు పుచ్చుకు రైలెక్కాడు

డైరెక్టరు అతన్ని చూసి అనుమానపడి ఇది సెకండుక్లాసు అన్నాడు

ఔను తెలుసు అని అరవంలో అని, కాస్తైటెక్కు నభినయించి ఎక్కిపోయాడు వడివేలు. సరే రైలు కదిలింది.

కదుల్తూ ఉండగా ఎవరో వచ్చి డైరెక్టర్ని పలకరించి ఈ పిక్చర్ ఐపోగానే మళ్లీరండి అని చెప్పి వెళ్లిపోయారు

మీరు డైరెక్టర్లా అన్నాడు వడివేలు హడలిపోయి

‘కాదు నేను ఒకణ్ణే డైరెక్టర్ని’ అన్నాడు డైరెక్టరు కొంచెం ఈసడింపుగా.

(53-వ పేజీ చూడండి

తప్పనిసరి

ఆకాశమంతా నల్లని కారుమబ్బులతో నిండిపోయింది అంతవరకూ మసకమసకగా కనుపించే చంద్రుని కాంతి పూర్తిగా మబ్బులవెనుక మాయమైపోయింది మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే ఆచల్లనిగాలి, నల్లని ఆకాశంమీద తళుక్కున మెరిసే ఎర్రని మెరుపులూ, భీకరారణ్యంలో ఆకలిగొన్న బెబ్బులి బొబ్బలలా, అనిశ్శబ్ద నిశీధిని వినిపించే వురుములూ, తప్పక వర్షంకురిసేవాతావరణాన్ని స్పష్టంచేసేయి వున్నట్లుండి 'ధన్'మని పెద్దచప్పుడు కావడంతో, మేము ప్రయాణం చేసే ఆబస్సుమీదనో, దాని ప్రక్కనో పిడుగుపడిందని అందరి గుండెలు గుభేలుమన్నాయి మరునిమిషంలో డ్రైవరు కారునాపి, క్రిందికిదిగి, టైరుబరస్ట్ అయిందని చెప్పగానే, ఎక్కడో పడిందనుకున్న పిడుగు మాగుండెల్లోనే పడింది రాజమండ్రి నుంచి అంగరవెళ్లే బస్సుల్లో అది ఆఖరి బస్సు. మండపేట దాటినతరువాత రోడ్డు గతుకులుగా వుంటుంది అక్కడనుంచి అంగరచేరుకునేవరకూ అన్నీ పల్లెటూళ్లే! కాస్త భోజనహోటలయినా వుండదు. దురదృష్టవశాత్తూ, మండపేటదాటి రెండు మైళ్లు ముందుకుపోయిన తరువాతనే ఈవిపరీతం ఎదురయింది ఆడవాళ్ల సీటులో కూర్చున్న మా శ్రీమతి బెదురు బెదురుగా నావైపు చూచింది నా జాలిచూపులు ఆమెకు సానుభూతిని తెలిపేయి. డ్రైవరు, కండక్టరు సహాయంతో టైరును తీయడానికి ప్రయత్నం చేస్తున్నాడు పైన ఆకాశం గడబిడలు చేస్తునేవుంది

మా అన్న కుమారుడు బాబ్జీ వివాహానికని రెండురోజులు ముందుగా బయలుదేరేం నేనూ మా శ్రీమతీని ముందుగా వెళ్ళడానికి మేం ఎంత ఆత్రుతపడ్డామో, అంత ఆలస్యం అయిపోయింది. "అయినా డాక్టరుపరీక్షు పాసైన బాబ్జీకి, శేకిలాంటి ఆపల్లెటూరిలో వివాహం చేయడమేమిటి?" అని నాలోనేనే మా పెద్దలమీద చీకాకుపడ్డాను. ఆబస్సులో ప్రయాణంచేసే మగప్రయాణీకులంతా అప్పటికే క్రిందికిదిగి ఏవేవో ప్రశ్నలువేసి డ్రైవరును విసిగిస్తున్నారు నెమ్మదిగా మా శ్రీమతికూడ క్రిందికి దిగి, దూరంగానుంచున్న నన్ను దగ్గరకు రమ్మన్నట్లు, ఎవరూ చూడకుండా కళ్లతో చక్కని సంజ్ఞచేసింది. నేను నెమ్మదిగా అక్కడకు వెళ్ళేను.

"ఏమి నిశ్చయం చేశారు?" అంది.

"బాబ్జి వివాహం"

"వూరుకుందురూ! ఇలాంటి సమయంలో కూడా మీ వేళాకోళం మానరు"

అప్పుడే తళుక్కున మెరిసిన మెరుపులో మా శ్రీమతి చిరుకోపం స్పష్టంగా కనిపించింది.

"ఏమిచేద్దాం చెప్పండి!"

"ఇంకేం చేయాలి అదుగో వాళ్ళేదో ఘనకార్యం చేస్తున్నారుగా, అది పూర్తి కాగానే బయలుదేరుదాం"

"పోనీ! ఇంత అవస్థపడి అర్ధరాత్రి వెళ్ళకపోతేనేం! ఈ రాత్రికి ఎక్కడైనా వుండి వుదయమే ఫస్టుబస్సులో వెళ్ళిపోతే మంచిదేమో!"

"సలహా అయితే బాగుందిగాని, దాన్ని ఆచరణలో పెట్టడమే కష్టం."

కావూరి నరసింహశెట్టి

"ఈ వూళ్ళో మీకు తెలిసినవారెవరూ లేరటండీ".

"వూఁహుం"

"అయితే ఏం చేద్దామంటారు చెప్పండి. నాకు భయంగావుంది అర్ధరాత్రిప్రయాణం, మెడలో వస్తువులు, పైగా వర్షంవచ్చే సూచనలూనూ" అంది మా శ్రీమతి అప్పటికిగాని ఆ విషయంగురించి నిశితంగా ఆలోచించాలనే బుద్ధి నాకు పుట్టలేదు ఇంకా వివాహం మూడురోజు లున్నప్పటికీ నేను ముందుగా వెళ్ళి చక్కబెట్టవలసినపను లుంటాయని, సెలవు దొరకినవెంటనే ఆఖరి బస్సు అని అయినా ఆలోచించకుండా బయలుదేరి త్రోవలో ఇలాంటి అవస్థలు పడవలసి వచ్చింది. ఆ ప్రక్కనున్న పల్లెటూరికివెళితే మాత్రం మాకు భద్రతఏదీ! నేను ఆలోచనలో పడ్డాను.

దూరంగా మినుకు మినుకుమనే దీపంవెలుతురూ, చిరుమువ్వల చప్పుడూ ఏదో బండి మండపేటవైపు వస్తున్నట్లుగా కనిపించింది. మా శ్రీమతిని అక్కడే వుండమని నేను త్వరగా అరఫర్లాంగుదూరం ముందుకు వెళ్లేను. నే ననుకున్నట్లుగానే అది ఒక ఖాళీ ఒంటెద్దుబండి మండపేటకే పోతుంది రెండుమైళ్లకూ ఒక రూపాయి ఇస్తానంటే బండివాడు ఆనందంతో వప్పుకున్నాడు. బస్సు చెడిపోయి ప్రయాణీకులు చిక్కుల్లో వున్నారని తెలిస్తే వాడు అంత తక్కువ కిరాయికి వప్పుకోడు బండి బస్సుదగ్గరికివస్తే, ప్రయాణీకుల అవసరాన్ని బట్టి రేట్లుపోటీగా వాళ్లే పెంచుతారు. ఇవన్నీ ఆలోచించే నేను బండికి ఎదురువెళ్ళి కిరాయి కుదుర్చుకుని అందులోకూర్చుని తిన్నగా బస్సువద్దకు వచ్చేను. అప్పటికే చిన్న చిన్న చినుకులు ప్రారంభమయ్యేయి. బస్సులోనున్న మా సామాన్లు బండిపైవేసుకుని నేనూ మా శ్రీమతీ అందులో కూర్చోవడమూ, అప్పుడే పెద్దచినుకులు ప్రారంభంకావడం, 'ఇక ఈ రాత్రికి లాభం లేదు. అందరం ఇక్కడ పడివుండవలసిందే' నని డ్రైవరు అనడమూ ఒకదానివెంట ఒకటిగా జరిగిపోయేయి

బండి కుదుర్చుకువచ్చిన నా తెలివికి మా శ్రీమతి నన్ను మెచ్చుకుంది. నాకు హుషారు నిచ్చిన ఆమె సమయస్ఫూర్తికి నేనామెను అభినందించేను. చిటపట చినుకుల్లో మా బండి నడక సాగించింది

"ఇప్పుడు ఎక్కడికి వెళదామండీ" నిశ్శబ్దాన్ని భం[illegible]స్తూ ప్రశ్నించింది మా శ్రీమతి

"వెనక్కి"

"వెనక్కి వెళుతున్నామని తెలుస్తూందిగా తెలిసినవారెవరూ లేరని చెప్పేరు. మరిఎక్కడుందామని?"

"జ్ఞాపకంవచ్చిందిలే వినాయకరావు అని నాస్నేహితు డొకడు హైస్కూల్లో మేస్టరుగిరీ వెలిగిస్తున్నాడు. పోయి వాడికొంపలో మకాం వేద్దాం" అన్నాను.

మా శ్రీమతి నవ్వింది.

"నవ్వుతున్నావేం"

"వూరికేనే"

"చెబుదూ! ఫరవాలేదు"

"లోకంలో అన్ని పేర్లుండగా మీస్నేహితునికి వినాయకరావనే పేరు పెట్టాలా?"

నాకూ నవ్వువచ్చింది

"వాడు పేరుకుమాత్రమే కాదు ఆకారంకూడ అంతే చిన్నబొజ్జ, చిన్నకళ్లు, పెద్ద

★ తప్పనిసరి ★

చెవులు." ఒక్క తొందరం మినహా అన్నీ వున్నాయి."

మరోసారి ఇద్దరమూ నవ్వుకున్నాం. వర్షం జోరు హెచ్చింది. ఎంత వర్షంవచ్చినా తనకు తప్పదన్నట్లు బండికి కట్టినఎద్దు నెమ్మదిగా నడుస్తూనేవుంది. బండిచక్రాలు గుంటలలోపడి బండి కుదుపుకు ఒక్కసారి నేను మా శ్రీమతిపై పడబోయేను.

"అన్నీ చిలిపిచేష్టలు" అంది శ్రీమతి.

మరుక్షణంలో మరోకుదుపుకు ఆమె నావడిలో నిజంగానే పడిపోయింది.

"దీనినేమనాలి?"

సిగ్గుతో శ్రీమతి మాట్లాడలేదు. చల్లని గాలికీ, చిటపట-చినుకులకూ మనసులో కమ్మని కోరికలు బయలుదేరేయి.

"మీ స్నేహితుడు మంచివాడేనా?"

"అంటే"

"అంటే మనల్ని మర్యాదచేసేవాడేనా అని?"

"ఓ! ఎంతమర్యాద చేస్తాడంటే—వాడు వండుకునే గదికూడ ఖాళీచేసి మనకు ఇస్తాడు."

"చాల్లెదురూ! బండవేళాకోళం-అన్నట్లు మీ స్నేహితునికి వివాహం అయ్యిందా?

"అయింది, దానికో గాధకూడ వుంది."

"ఏమిటది చెప్పండి."

"అయితే విను."

* * *

ఆరోజుల్లో నేను స్కూలుఫైనలు చదువుతున్నాను. ఇప్పడున్నట్టే అప్పుడు కూడా బక్కపలచగా, పొటిగా వుండేవాడిని. ఒకసారి నేనూ, వీడూ అంటే ఈ వినాయకరావూ చెరో సైకిలుమీద కాకినాడ వెళుతున్నాం. అది మంచి వేసవికాలం. మధ్యాహ్నంవేళ ప్రయాణం. ఈ చెవినుంచి ఆ చెవికి గాడ్పుకొడుతోంది. ముఖమంతా చెమటలుపట్టి, గాలికి ఎగిరివచ్చిన కంకర బూడిదతో మిళితమై, ఎర్రని చెమటబిందువుల ద్వారా చేతిరుమాలును పైతం ఎర్రగా మార్చివేసేయి.

మధ్యాహ్నం భోజనాలకు కాకినాడ చేరుకోవాలని మా తాపత్రయం. అందువల్ల

ఎండను లెక్క చేయకుండా ఇద్దరమూ జోరో సైకిలు త్రొక్కుకుపోతున్నాం. నా కంటే వినాయకరావు కొంచెం లావు, పొడుగు బలం కూడ కలవాడవడంవల్ల నాకంటే చాలా విసురుగా సైకిలు త్రొక్కుతూ తనతో సమానంగా సైకిలు త్రొక్కలేకపోతున్నందుకు నామీద తరచుకస్సుబుస్సులాడుతున్నాడు. అసలే ఆకలిగావుంది పైగా ఎండ బాధ, పిడికస్సుస్సులు నన్ను చాలా చికాకు పర్చివేసేయి. కాకినాడదగ్గరగా అంటే పది మైళ్లు ఇవతలగా ఏదో వూరుంది. మేము ఆ పల్లెటూరు చేరుకునేసరికి వన్నెండు దాటింది. మామూలుగా నాకంటె ముందుగాపోయి ఒక చెట్టునీడను విశ్రాంతి తీసుకుంటూ నేను రాగానే మళ్లీ బయలుదేరే వినాయకరావు ఈసారి అలాకాకుండా నేను దగ్గరకువచ్చినా బయలుదేరకుండా తెల్లముఖం వేయడం చూచి నేను తెల్లబోయేను.

"బయలుదేరవేమిరా?" అన్నాను.

"చక్రాలలో గాలిపోయింది" ఇంచుమించు ఏడుపుముఖం పెట్టేడు. నాకు నవ్వొచ్చింది. నేను నవ్వడంచూచి వాడికి కోపం వచ్చిది.

"ఎందుకురా వెధవ నవ్వు!" అన్నాడు.

నేను అసలే బక్కవాడిని. ఆపోతుగాడు కోపంలో నన్నేమైనా చేస్తాడేమోనని బలవంతంగా నవ్వును ఆపుజేసుకున్నాను.

"తీవ్రాలోచన అభినయిస్తూ" ఇప్పుడేం చేయాలి? అన్నాను.

"అదృష్టవశాత్తు వూరిదగ్గరలో నేవున్నాం. ఇంకొక ఫర్లాంగు నడచిపోయామంటే ఆవూళ్ళో పడతాం. ఎంత పల్లెటూరయినా సైకిలుషాపు, కంపుకొట్టే కాఫీ హోటలూ వుండకపోవు. సైకిలు బాగుచేయడానికి షాపులోఇచ్చి కాఫీ హోటల్లో కొంచెం కడుపునింపుకుని చల్లబడినతరువాత బయలుదేరిపోదాం" అన్నాడు.

"బాగానే వుంది ఆలోచన. కాని..."

"కానీ - ఏమిట్రా నీముఖం చెప్పేదేదో చెప్పు" కోపంగా అన్నాడు వినాయకరావు. నాకూ కోపం వచ్చింది. "ప్రతీదానికీ అంత కోపం ఎందుకురా వెధవ కోపం" అన్నాను నేనో శాంతమూర్తిలాగ.

"అది కాదురా. నీవు చెప్పేదేదో చెప్పరాదూ?"

"నీదగ్గర సొమ్ము లేమాత్రం వున్నాయి?" అన్నాను.

"నాదగ్గరేముందిరా! కానీలేదు. నీదగ్గర వుందిగా."

"నావద్ద ఒక్కరూపాయివుంది"

"చాలు! పావలా సైకిలురిపేరు. మిగిలినది మన ఆకలిరిపేరు"

"సరేలే కానీయ్"

ఇద్దరం ఆ పల్లెటూళ్ళో పడ్డాం. తిన్నగా కాఫీహోటలుకు పోదాంఅంటాడుమావాడు. కాని సైకిలు షాపుకువెళ్లి, సైకిలు రిపేరు చార్జీలుపోను మిగతా దానితో కాఫీ హోటలుకు పోదామని నేను. ఏలాగైతే నేం డబ్బు నాది గనుక నామాటకే విలువ ఇచ్చేడు. తిన్నగా సైకిలుషాపుకు చేరుకున్నాం. షాపువాడు ట్యూబులు బైటికితీసి పరీక్షించి 'రెండు జాయింట్లు కరిగిపోయేయి. ముప్పావలా అవుతుంది' అన్నాడు. నా గుండెలు జారిపోయేయి. ముప్పావలా వాడికి చెల్లించి మిగిలిన పావలాలో ఇద్దరం ఎలా కడుపు నింపుకోవడం? రావుగాడు నాకంటే బేజారైపోయేడు. మాగోడవలో మేమువుంటే ప్రక్కన స్టూలుమీద కూర్చుని, కమ్మని చుట్టనుకాలుస్తూ, వేడిగాలిని ఆరగిస్తూన్న పల్లెటూరి రైతుగారు మా యోగక్షేమాలు అడగడం మొదలుపెట్టేడు.

"ఏవూరు వెళతారు అబ్బాయిలూ"

"కాకినాడ" అన్నాను నేను రావుగాడు మాట్లాడేస్థితిలో లేడు. 'దప్పిచే నాలుక తడిపొడిలేక' అన్నట్లుంది వాడి అవస్థ.

"పాపం! ఇంకా చాలా దూరం వుందే"

"ఔను. ఎక్కడినుంచి వస్తున్నారు?"

మా వూరిపేరు చెప్పేను.

"అరే! ఆ వూళ్లో మా దూరపుబంధువులున్నారండీ. కాని చాలాకాలంనుంచి వారికీ మాకూ రాకపోకలు లేవు"

"ఎవరండీ"

"వెంకయ్యగారనీ—కొలువు అవతలవారి లోగిళ్లు"

నేను ఆశ్చర్యంగా ఆ ముసలాయనవైపు చూచేను. ఎందుకంటే తన బంధువు అంటున్నది మా నాన్నగారినే. రావుగాడు కంగారుగా లేచేడు.

"ఔనండి. వారు మా నాన్నగారే" అన్నాడు.

ఆ ముసలాయన ఆశ్చర్యంగా వాడివైపు చూచేడు. "ఏమిటేమిటీ! నీవు ఫలానా వెంకయ్యగారి కుమారుడవా? ఎన్నోవాడివి బాబూ?"

"ఆఖరివాడినండి"

"ఏం చదువుతున్నావు నాయనా"

"స్కూలు ఫైనలు"

"బాగుంది. పేరు?"

మావాడు కొంచెం తికమక పడ్డాడు. మా నాన్నగారిని తన నాన్నగారని చెప్పుకున్నాడు. సరి నా స్థానంలో వాడు ప్రవేశించి ఆఖరివాడినని చెప్పుకున్నాడు. తీరా పేరు అడిగేసరికి నా పేరు చెప్పడమూ లేక తన స్వంతపేరు చెప్పడమూ అనే సందిగ్ధంలో పడ్డాడు. ఆఖరికి తెగించి "వినాయకరావు" అన్నాడు.

"సరే నాయనా! తలవని తలంపుగా మా వూరు రానేవచ్చేరు. భోజన సమయం. మా ఇంట్లో భోజనంచేసి, విశ్రాంతి తీసుకుని



అమిత సౌందర్యము కొరకు
మీ చర్మమును యౌవనంగాను, ఉల్లాసితంగాను—
శుభ్రంగాను, మనోహరంగాను ఉంచుకొనుడు. మనోహర
మైన సహజ సౌందర్యమును రూఢిగా పొందుడు.
"'హేజ్‌లైన్' స్నో" మీ చర్మమును చల్లగాను,
కాంతివంతముగాను, సుందరముగా నొనర్చును.
"'HAZELINE' SNOW"
(TRADE MARK)
"'హేజ్‌లైన్' స్నో" (ట్రేడ్‌మార్కు)
బర్రోస్ వెల్‌కమ్ & కం.(ఇండియా) ప్రైవేట్ లి. పి.ఒ. బాక్స్ 290, బొంబాయి.

★ తప్పనిసరి ★

చల్లబడిన తరువాత వెళుదురు గాని —

"సాయిబూ! సైకిలు రిపేరుచేసి ఇక్కడే వుంచు. వీరు మా ఇంటిలో భోజనంచేసి తరువాత వస్తారు. జాగ్రత్త!" అని సైకిలు షాపువాడిని హెచ్చరించి "రండి! బాబూ! రండి" అని తాను ముందు నడుస్తున్నాడు.

మాకు ఆ పరిస్థితుల్లో భోజనానికి వెళ్ళడం ఎంతో ఆనందంగానే వుంది. నాకంటె రావుకు మరీ ఆనందంగా వుంది. అయినా కాస్త బెట్టుగా "ఎందుకు లెండి! సైకిలు బాగు చేయగానే వెళ్ళిపోతాం" అన్నాడు. "సరి సరి! ఇంకా నయం! మనం అంతా బంధువులం. అంత భిడియం ఎందుకు బాబూ! నేనేం పరాయివాడినా! ఇప్పుడు మా ఇంట్లో భోంచేసి వెళితే నేను మరో రోజున మీ ఇంటికి వస్తాను. దానితో దూరమైన మన బంధుత్వం మళ్ళీ దగ్గరవుతుంది. లెండి, లెండి" చేయి పట్టుకున్నాడు ముసలాయన "ఎల్లండిసార్! రామయ్యగారిలాంటి షాహుకారి రైతు సేతుల్ పట్టుకుంటే ఇంకా నూత్తారేం" సైకిలుషాపు సాయిబు హెచ్చరించేడు. తప్పనిసరి అన్నట్లు రావు లేచేడు. అతని వెనకాల నేనూ లేచేను. త్రోవలో ఆ ముసలాయన మా అన్నలగురించి ప్రశ్నించేడు. రావుకు అన్నీ తెలిసి వుండడంవల్ల, నా స్థానంలో వుండి నేను చెప్పవలసిన సంగతులన్నీ వాడే చెబుతున్నాడు. నేను మాట్లాడకుండా వారివెనుకనే నడుస్తున్నాను. అక్కడకు దగ్గరలోనే వున్న పెంకుటింటి ముందు ముసలాయన ఆగేడు. రెండు పెద్ద అరుగులూ, వాటిముందు కొబ్బరిచెట్లూ, చుట్టూ విశాలమైన ఖాళీ స్థలం, ఆ యింటికి హంగులు కూర్చేయి. అరుగులమీద నున్న కుర్చీలలో మమ్మల్ని కూర్చోబెట్టి ముసలాయన ఇంటిలోనికి వెళ్ళేడు.

అరుగులమీద కూర్చున్న మాకు, వట్టివేళ్ళ చాపల్లోనించి వచ్చిన గాలి హాయి కలిగించింది. నేను నెమ్మదిగా రావుతో అన్నాను.

"ఏమిట్రా! తెగకోసేశావు?"

"కాస్సేపు వూరుకోరా బాబూ! నీకు పుణ్యం వుంటుంది" బ్రతిమాలుతున్నట్లు చూచేడు. వాడిని చూస్తే నాకు జాలివేసింది. ఇంతలో ఓ కుర్రాడు రెండు తుండుగుడ్డలు తెచ్చి ఇద్దరినీ స్నానానికి లేవమన్నాడు. ఒక పనివాడు వచ్చి, ఇంటిముందున్న నూతిలోనుంచి నీళ్లుతోడి ప్రక్కనున్న పెద్ద గాబులలో పోసేడు. సబ్బు చేత్తో పట్టుకుని కుర్రవాడు మాకు త్రోవ చూపించేడు. ఎండ వేడికి వుడుకెత్తిపోయిన మా శరీరాలకు నూతిలోని చల్లని నీరు తగలగానే ప్రాణాలు లేచి వచ్చినట్లయింది. తృప్తితీరా స్నానంచేసి తిరిగి వచ్చి బట్టలు వేసుకున్నాం! ఇంతలో ముసలాయన వచ్చి భోజనాలకు లేవమన్నాడు. అప్పటికే భోజనాలవేళ మించి ఆకలి జోరుగా వేస్తుండడంవల్ల మాట్లాడకుండా ఆయన వెనకనే చావిట్లోకి వెళ్ళి, విస్తర్లలో వడ్డించిన భోజనాలముందు కూర్చున్నాం. ముసలాయన దగ్గరగా కూర్చుని, నేయి, కూరలు, పెరుగు, మామిడిపండ్లు బలవంతంగా వడ్డించేడు. ఆ వడ్డించడంలో రావును ఎక్కువ బలవంతంచేయడం, నేను పొందవలసిన ఆ గౌరవాన్ని వాడు పొందుతున్నందుకు నేను అసూయపడ్డాను. మేము భోజనాలు చేస్తున్న సమయంలో ప్రక్క గదుల్లోనుంచి మమ్మల్ని చూస్తున్న ఆడవాళ్ళ గాజుల గలగలలు వినిపించేయి. ప్రక్కలకు చూద్దుముగదా ఒకరిమీద మరొకరు పడి మావైపు వింతగా చూస్తూన్నారు. నాకేమో సిగ్గనిపించింది. రావుమాత్రం ఠీవిగా కూర్చుని వడ్డించే కుర్రాడితో ఏవేవో వేళాకోళాలు మొదలుపెట్టేడు. వాడి హాస్యాలకు మధ్య మధ్య గదులలోనుంచి సన్నని నవ్వులువినిపిస్తూ వుంటేవి. భోజనాలు పూర్తి చేసి మేము బయటికి వచ్చేసరికి అరుగుల మీద నులక మంచాలమీద ప్రక్కలు అమర్చబడి వున్నాయి. మమ్ములను పండుకోమని ముసలాయన ఎక్కడికో వెళ్ళిపోయేడు. మేము ఎక్కువ శ్రమ లేకుండానే హాయిగా నిద్రపోయాం. నేను లేచేసరికి నాలుగు గంటలయింది. రావుఇంకా మత్తుగానిద్రపోతూనే వున్నాడు. వాడిని లేపి కూర్చోబెట్టేను. ఇంతలో కుర్రవాడు సబ్బు, నీళ్లు తెచ్చి, ముందుపెట్టేడు. లేచి ముఖాలుకడుక్కునేసరికి మళ్ళీ ముసలాయన వచ్చి, కాఫీలకు లేవమన్నాడు. ఈ మర్యాదలకు రావూ, నేనూ వుక్కిరిబిక్కిరైపోయాము. వేడివేడి ఫలహారాలతో కాఫీకూడ ముగించి, ఆరోజు అక్కడ వుండిపొమ్మని ఆయన బ్రతిమాలినా వినకుండా బయలుదేరి కాకినాడ వెళ్లిపోయేము. వెళ్లేముందు మావాడు మర్యాదకు "ఒకసారి మాయింటికి దయచేయాలి మీరు" అన్నాడు, "అవశ్యం" అన్నాడాయన.

వెళ్ళిపోయే మమ్మల్ని ఆడవాళ్ళచూపులు వెన్నంటుతూనే వున్నాయి చాటునుంచి.

ఇంతవరకూ విని మా శ్రీమతి నవ్వింది.

"నవ్వుతున్నావేం?" అన్నాను.

"ఆఖరున చెబుతాలెండి" అంది.

"హేయ్! హేయ్!" అని బండివాడు ఎద్దును అదలిస్తున్నాడు. వర్షపుజల్లు తగ్గింది. ప్రక్కనున్న చెట్ల ఆకులనుండి గాలి విదుళుకు టబటబా బండి గూడుమీద చినుకులు పడుతున్నాయి.

"కానీయండి! మధ్యలో ప్రశ్నలు వేయవద్దని మీరూ, కథలు మధ్యలో ఆపకూడదని నేనూ మన వివాహమైన క్రొత్త రోజుల్లోనే నిర్ణయించుకున్నాంగా" కొంటెగా చూచింది శ్రీమతి.

"కాకినాడలో రెండు రోజులు రావుతో వాళ్ల ఇంటివద్దవుండి తిరిగి నేనొక్కడినీ మా యింటికి చేరుకున్నాను. వీధివైపు చావిడిలో మా అన్నలు ఇద్దరూ, ఇంకా అయిదారుగురు పెద్దలూ కూర్చుని వున్నారు. ఆ చావిట్లో ఎప్పుడూ ఎవరో కొంతమంది కూర్చుంటూనే వుంటారు. అందువల్ల నేనెవరినీ పరీక్షగా చూడకుండా ఎండలో వచ్చిన కారణంవల్ల స్నానం చేయాలనే తొందరవల్ల లోపలకు పోతున్నాను.

"అడుగో వాడూ వచ్చేడు." అన్న మా పెద్దన్నయ్యగారి స్వరం విని అలాచూచేను.

"వీరిని ఎరుగవురా" అంటూ ప్రక్కన వున్న ఆసామీని చూపించేరు. ఆయన మాకు విందుచేసిన ముసలాయన. నేను నమస్కారం చెప్పేను. తెల్లబోయి చూస్తూ మళ్ళీ నమస్కారం పెట్టేడు. నేను చెమటలు కక్కుతూండడంవల్ల "లోపలికి పోయి స్నానం చేయి" అన్నారు మా అన్న. నేను లోపలకి వెళ్లేను.

నన్ను మొట్టమొదట మా చిన్నవదిన చూచింది.

"అదిగో! పెండ్లికొడుకుకూడ వచ్చేసేడు" అని నవ్వింది. ఎవరనో అని వెనక్కు తిరిగి చూచేను. ఎవ్వరూ లేరు.

"నిన్నేనయ్యా! ఏమీ ఎరుగనట్లు నటించనక్కరలేదు."

"ఎవరువదినా! చంపక చెబుదూ [illegible]" గారంగునుస్తున్నట్లుగా అన్నాను. వదిన నవ్వింది.

"నీవే అంత గడుసువాడివనుకుంటున్నావు కాబోలు!

"నీ పెండ్లికి నీవే ప్రయత్నించాలటయ్యా! మీ అన్నలు లేరూ! ఇంకా నవ్వుతూనే అంది చిన్నవదిన. అంతలో పెద్దవదిన ఆవిడకు సహాయపడింది.

"మామగారిని ముందుపంపించి, నీవు నంగనాచిలా వెనకాల వచ్చేవన్నమాట."

"అబ్బ! అన్నదమ్ముల బుద్ధులు! ఎక్కడికిపోతాయి" అంది చిన్నవదిన.

"ఏమిటి అన్నదమ్ములందరినీ ఆశేస్తున్నావు" అంటూ మా చిన్నఅన్న లోపలికి వచ్చేరు.

"అదే! తెలియకుండా వెళ్లి పెండ్లికూతురును చూచుకోవడం" కొంటెగా జవాబిచ్చింది చిన్నవదిన.

★ తప్పనిసరి ★

"వాడినేం వెక్కిరిస్తావులే! రామయ్య గారు వెళ్ళిపోయేరు"

"మాటలు అయిపోయేయి కాబోలు ఎప్పుడా ముహూర్తం?"

"అబ్బే! వారి అమ్మాయి పీడిమీద బలంగా వుంటుందట. వరహీనంగా కనిపిస్తుందని వెళ్లిపోయేరు."

"అదేమిటట? ముందుగా పెండ్లికొడుకును చూచేవచ్చేనన్నారు గదాండి ఆయన?"

"ఔను కాని వీడినికాదు. వీడితో వెళ్లిన వినాయకరావును చూచి వాడినే వీడనుకున్నారట."

"అదేలా అనుకుంటారండీ?" ప్రశ్నించింది వదిన.

ఇంతలో రామయ్యగారిని సాగనంపి మా పెద్దఅన్నగారు కూడా అక్కడకు రావడంవల్ల చిన్నవదిన లోపలకు తప్పుకుంది

"అసలు జరిగిన సంగతేమిటట?" అని అడిగేరు పెద అన్నయ్య. నేను మొదటినుంచీ జరిగినదన్నీ చెప్పేను అంతా విని అందరూ గట్టిగా నవ్వేసేరు

"బాబూ! వూరిలోనికి వచ్చేసేం! ఎవరింటికి వెళ్లాలండి" అన్నాడు బండివాడు

"హైస్కూల్లో టీచరు వినాయకరావు గారి ఇంటికి"

"సరేనండి-హాయ్! హాయ్" అంటూ ఎద్దును హెచ్చరించేడు

"నేను అందుకే నవ్వేను," అంది శ్రీమతి

"ఎందుకు?"

"మీరు భోజనాలు చేసేటప్పుడు ఆడవాళ్లు ప్రక్కగదుల్లోనుంచి చూస్తున్నారని మీరు చెప్పినప్పుడే అనుకున్నాను వారింటిలో పెండ్లి ఈడుకు వచ్చిన అమ్మాయి వుండి వుంటుందని"

"నీవూ అసాధ్యరాలవే!" అన్నాను

"బాబూ! అయ్యగారింటికి వచ్చేసేమండి" అన్న బండివాడి హెచ్చరిక విని బండిలోనుంచి క్రిందికి వురికేను. ఆకాశం నిర్మలంగా వుంది టైము చూచుకున్నాను ఒంటిగంట అయింది.

సామాన్లు అరుగుమీదపెట్టించి బండివాడిచేతనే వినాయకరావును పిలిపించేను. కొంచెంసేపటికి వాడులేచి బైటికివచ్చేడు. కాని నన్ను వెంటనే పోల్చుకోలేకపోయేడు. బండివాడికి కిరాయి ఇచ్చి పంపించివేసేను. ఇంకా వినాయకరావు నన్ను వింతగా చూస్తూనే వున్నాడు

"ఇంకా నిద్రమత్తు వదల్లేదా యేంగా?" అన్నాను

"అరె నీవటరా! చీకటిలో గుర్తుకట్టలేకపోయేను," అంటూ హడావిడిగా సామాను గదిలో వేసి, మమ్మల్ని లోపలికి ఆహ్వానించేడు అక్కడవున్న ఒక కుర్చీలో నేను కూర్చున్నాను మా శ్రీమతి ప్రక్కనే నిలబడింది. రావు ప్రక్కగదిలోనికి వెళ్లేడు.

ఏదో విపరీతమైన శబ్దం మా చెవులు బద్దలుకొడుతోంది. కొంచెంసేపు పిల్లలు పోట్లాడుకుంటున్నారనుకున్నాను మళ్లీ అంతలోనే పాము బుసకొడుతోందనుకున్నాను మళ్లీ వురుములేమో అనుకున్నాను ప్రక్కగదిలోనుంచి మావాడు ఎంతకూ రాడు. అంతలోనే "వూం!" అని ఒక సింహగర్జనలా వినిపించింది శబ్దం ఆగిపోయింది ప్రక్కగదిలో గుసగుసలు వినిపించేయి తరువాత మా స్నేహితుడు బైటికివచ్చి నాతో మాటలు మొదలు పెట్టేడు. రెండు నిమిషాలువుండి "గంగా భవానీ! గంగాభవానీ!" అని రెండు కేకలు పెట్టేడు. అంతలోనే బరువైన శరీరాన్ని మోయలేక ఆయాసంతో వగర్చుకుంటూ ఒక పెద్ద గున్న ఏనుగులాంటి మనిషి మాముందు ప్రత్యక్షమయింది.

"చూడు గంగాభవానీ! వీడు నాస్నేహితుడు సుబ్బారావు. ఆవిడ.. ఎందుకో సందేహించేడు.

"మా శ్రీమతి" అని పూర్తిచేసేను. ఆవిడ నమస్కారం చేసింది. తిరిగి నమస్కారం చేసేను

"ఆవిడను లోపలకు తీసుకువెళు"

"రండి" అని ఆవిడ మా శ్రీమతిని లోపలకు తీసుకు వెళుతోంది.

"అన్నట్లు గంగా భవానీ" అని ఆగేరావు ఆవిడ వెనుదిరిగి చూచింది.

"ఈ సుబ్బారావు ఎవరో తెలుసా?"

తెలీదన్నట్లు చూచింది "సరేలే! వెళ్లు" ఆవిడ వెళ్లిపోయింది.

"మా ఆవిడ నీకు తెలుసునుగదురా?"

"ఎట్లా తెలుస్తుంది? మనం కలుసుకుని రమారమి పది సంవత్సరాలవుతుందనుకుంటాను"

"కావచ్చు, ఈమె రామయ్యగారి కూతురు"

"ఏ రామయ్యగారు?"

"నీకు మతి మరుపు ఎక్కువరా! ఒకసారి మనం కొకినాడ వెళుతూం ట"

"చాలు చాలు! ఇక చెప్పకు జ్ఞాపకం వచ్చింది'

కొంచెంసేపు నేను మాట్లాడలేకపోయేను

"ప్రాణం బుల్ రావుల్ దప్పెను. మూర్ఛ వచ్చె" అన్నంత పని అయిందినాకు ఆ మహా స్వరూపాన్ని మా వినాయకరావు గనుక భరిస్తున్నాడుగాని నాలాంటి బక్క వాడయితే ఏమి కావాలి?

"ఆ రామయ్యగారు మీ ఇంటికి వచ్చేరటగా! వచ్చి నిన్ను చూచినతర్వాత సంగతంతా తెలుసుకున్నారు. నీతోవున్న వాడిని నేనేనని మీ అన్నద్వారా తెలుసుకుని, నా అడ్రసు తీసుకుని మా ఇంటికివచ్చి మా వివాహం నిశ్చయించేరు నాకు తప్పనిసరి అయింది" "బాగానే వుందిగాని, అంత పెద్ద పేరుపెట్టుకు పిలవకపోతేనేం! ఏదైనా చిన్నపేరు పెట్టుకోకూడదటరా" అన్నాను మాకు వుండే స్నేహభావంతో. వినాయకరావు నవ్వేడు.

"చిన్నపేరుతో పిలిస్తే ఆమెకు నచ్చదురా! తన పూర్తిపేరుతోనే పిలవాలంటుంది"

ఈ మహాస్వరూపాన్ని వరహీనం అవుతుందనే కారణంగా నాకు అంటగట్టకుండా, ఆ గండంనుంచి నన్ను శాశ్వతంగా గట్టెక్కించిన ఆ రామయ్యగారికి నాలో నేనే ధన్యవాదాలు అర్పించుకున్నాను ఆమరునాడు వుదయమే మేము మా బావ్జీ వివాహానికి వెళ్లిపోయేము. ★


నాగేశ్వరరావు

తెరమీది నాగేశ్వరరావు



"తెనాలిరామకృష్ణ" (56 జనవరి)

ఒక చిత్రంలో ప్రేమికుడు; ఇంకో చిత్రంలో శ్రామికుడు. ఆ చిత్రంలో మహాభక్తుడు; ఈ చిత్రంలో మహారక్తుడు.


ఒకసారి లక్షాధికారి. ఇంకోసారి రిక్షాధికారి. ఒకచోట దొంగ; ఇంకోచోట దొర; ఆఖరికి దొంగల్లో దొర. ఒకప్పుడు శశిరేఖకు ప్రేమ దరఖాస్తు దాఖలుచేసుకున్న అభిమన్యుడు; ఇంకొకప్పుడు పల్నాటి యుద్ధభూమిలో అభిమన్యుడిలాంటి బాలచంద్రుడు.

ఒకదాంట్లో పాండురంగ మాహాత్మ్యం రాసిపారేసిన మహాకవి !

ఇంకోదాంట్లో అర్ధాంగి చెప్పిన అ ఆ లు దిద్దుకునే అర్భకుడు. ఒక్కోసారి స్వప్నసుందరిని, సువర్ణసుందరిని, తిలోత్తమను అమాంతం సొంతం చేసుకున్నా, ఇంకోసారి కేవలం మజ్నూ, దేవదాస్, సలీమ్! అనేక రకాల పాత్రధారుడు; నిర్మాతలకు బాక్సాఫీస్ సూత్రధారుడు; డిస్ట్రిబ్యూటర్లకు 'మాక్సిమమ్‌గ్యారంటీ.' లక్షలాది ప్రేక్షకులకు ఇలవేల్పులాంటి తెరవేల్పు.

అక్కినేని నాగేశ్వరరావులాగా క్రాపూ, మీసం పెంచాలని కొందరు కుర్రాళ్లు సరదా పడతారు. కొందరు అతనిలాగ అదోరకం ఊపుతో నడవడం నేర్చుకుంటారు. అతన్ని చూసి పంట్లాములు మానేసి లాల్చీ, పంచె కట్టే విద్యార్థులున్నారు. 'దేవదాసు' చూడగానే, పక్కింటి పార్వతిమీద బెంగ పెట్టుకుని, పేరెంట్సుచేత చివాట్లు పెట్టించుకుని, తాగేది కాఫీ అయినా విస్కీలాగ చప్పరిస్తూ, బజార్లలో భగ్నవీణలు వాయించుకుంటూ తిరిగే స్థానిక దేవదాసులు ఊరికొకరైనా కనిపిస్తారు.

పదహారేళ్ళ కిందట నాగేశ్వరరావు 'ధర్మపత్ని'లో మొదటిసారిగా నటించాడంటే 'అలాగా!' అంటారు చాలా మంది. ఎందుకంటే అప్పుడాయన్ని ఎవరూ గుర్తించినట్లులేదు. బహుశా చాలా చిన్న వేషమై ఉంటుంది. తరువాత మూడునాలుగేళ్లకి ప్రతిభావారి 'సీతారామజననం'లో నాగేశ్వరరావు మళ్లీ కనిపించినప్పుడు, ఆ చిత్రం



'నిరుపేదలు' (54 మార్చి)



'పరమానందయ్య శిష్యులు' (1950 అక్టోబర్)



'లైలామజ్నూ' (49 అక్టోబరు)

అభినందన

పదహారు సంవత్సరాలుగా చలనచిత్ర పరిశ్రమలో ఉత్తమశ్రేణి నటుడుగా నిలచి, ఆంధ్రుల గౌరవాభిమానాలు గడించుకొంటున్న శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, తాను పాల్గొన్న 60-వ చిత్రం పూర్తిఅయినసందర్భాన్ని పురస్కరించుకొని జూలై 28 వ తేదీ ఆదివారంనాడు చలనచిత్ర వజ్రోత్సవం జరుపుకొంటున్నారు.

ఈ ఉత్సవం ప్రధానలక్ష్యం కృతజ్ఞతా సమర్పణ.

తమకు తగు అవకాశాలిచ్చి ప్రోత్సహించిన ఈ 60 చిత్రాల నిర్మాతలకూ, ఒక్కొక్క చిత్రంలో తాను సత్ఫలితాలు సాధించడానికి సహకరించిన తోటి కళాకారులకూ, సాంకేతిక విషయజ్ఞులకూ ఆయన ఈ పండుగ రోజున కృతజ్ఞతాభివందనాలు అర్పిస్తున్నారు.

తమ ఈవిజయానికి పురోభివృద్ధికి ప్రధానకారకులు అయిన ఆంధ్ర ప్రజానీకానికి కృతజ్ఞతా సూచకంగా ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి బీద విద్యార్థుల సహాయార్థమై ఇరవై అయిదు వేల రూపాయలు విరాళం ఇస్తున్నారు.

ఒక నటుడు, ఇటువంటి సత్సంప్రదాయాన్ని నెలకొల్పుతున్నందుకు శ్రీ నాగేశ్వరరావును అభినందిస్తూ, ఈ ఉత్సవ సందర్భంలో ప్రత్యేక వ్యాసాలను, ఛాయా చిత్రావళిని పాఠక మహాశయులకు అందచేస్తున్నాము.



'ఇలవేలుపు' (56 జూన్)

చూసిన వారందరూ 'ఆహా' అని మూర్ఛపోకపోయినా ఆయన్ని మాత్రం గుర్తించారు. 'ఎవరా నాగేశ్వరరావు? ఏమా కథ' అని అంతా అడిగారు. ఆ తరవాత ఏడాదికొకటి చొప్పున మాయలోకం, ముగ్గురు మరాటీలు, పల్నాటియుద్ధం చిత్రాల్లో నటించాడు. "బాలరాజు" చిత్రంతో నాగేశ్వరరావులో నివురుగప్పిన ప్రతిభ గుప్పుమంది. బాలరాజుగా నాగేశ్వరరావు నటన అందర్నీ ఉర్రూతలూగించింది. అప్పటి ప్రేక్షకులకి "హీరో అంటే నాగేశ్వరరావురా, హీరో!" అనే నమ్మకం ఏర్పడిపోయింది: నాగేశ్వరరావుఅంటే జానపద చిత్రాల హీరో అనే పేరేర్పడింది. ఎందుకంటే చాలా ఏళ్లదాకా ఆయన జానపద చిత్రాల్లో రాజకుమారుడి వేషాలు వేస్తూ వచ్చాడు. ఆయన నటించిన మొత్తం 48 తెలుగు చిత్రాల్లోనూ 26 దాకా జానపద చిత్రాలే. 1952 లో భరణీవారి 'ప్రేమ'లో నటించిన దగ్గిర్నించీ ఆయన సాంఘిక చిత్రాల్లో కూడా అధికంగా నటించసాగాడు.



'సీతారామ జననం' (44 డిసెంబర్)

నాగేశ్వరరావు జానపద చిత్రాల్లో ఎంత విజయం పొందాడో సాంఘిక చిత్రాల్లోనూ అంతగా ప్రజాదర్శం పొందాడు. ఆయన నటించిన చిత్రాల్లో సాంఘిక చిత్రాలే ఎక్కువగా శతదినోత్సవాలు చేసుకున్నాయి.

నాగేశ్వరరావు నటన "దేవదాసు" లో పరాకాష్ఠ అందుకుంది. దేవదాసు కథకీ, లైలామజ్నూ కథకీ పోలికలున్నా లైలామజ్నూ నాటి నాగేశ్వరరావుకూ దేవదాసు నాటి నాగేశ్వరరావుకూ ఎక్కడా పోలికలులేవు. లైలామజ్నూ తరవాత నాలు




"పల్నాటియుద్ధం" (47 సెప్టెంబరు)



"రత్నమాల" (1948 జనవరి)



తిలోత్తమ (51 ఫిబ్రవరి)



“కన్నతల్లి” (తమిళంలో 'పెట్రతాయ్' 53 ఏప్రిల్)

తెరమీది నాగేశ్వరరావు


గళ్లలో నాగేశ్వరరావు నటన పరిణతి చెందింది. దేవదాసు పాత్రాభినయంలో ఆ పరిణతి పూర్తిగా కనిపించింది. ఇప్పటి తరం భారతీయనటుల్లో ఎవరూ దేవదాసు పాత్రను ఇంత అద్భుతంగా నటించలేరనే నమ్మకం ఆయన కలిగించాడు. దేవదాసు చిత్రాన్ని, ముఖ్యంగా నాగేశ్వరరావు పాత్రపోషణాన్ని ఆంధ్ర ప్రేక్షకులు ఎప్పటికీ మరిచిపోలేరు. ఆచిత్రంతో నాగేశ్వరరావు ప్రేక్షక హృదయాలలో స్థిరపడడమేకాక, తెలుగు సినిమారంగంలో కూడా మరో పదిమెట్లపైన స్థిరపడ్డాడు. 1952 లో ఆయనచిత్రం ఒక్కటే (ప్రేమ)



కీలుగుర్రం (1949 ఫిబ్రవరి)

తెలుగుదేశంలో విడుదలైంది. అంతకుముందు పదేళ్లలోనూ ఆయన నటించిన చిత్రాలన్నీ కలిపి పాతిక. 1958 లోనే 8 తెలుగు, తమిళ చిత్రాలు వెలువడ్డాయి.

'దేవదాసు'లో విషాదాంతమైన పాత్ర ధరించిన నాగేశ్వరరావు 'చక్రపాణి' లో ఎక్కడా విషాదానికి చోటివ్వని హాస్య పాత్ర ధరించి మళ్లీ ప్రేక్షక హృదయాలను చూరగొన్నాడు. 'విప్రనారాయణ' లో భక్తి పారవశ్యాన్ని విజయవంతంగా ప్రదర్శించాడు. 'అర్ధాంగి' లో కేవలం జడుడుగా నటించి ప్రేక్షకులకు జాలిగొలిపి,



'భలేరాముడు' (54 ఏప్రిల్)

'రోజులు మారాయి'లో పౌరుష ప్రధానమైన ఉడుకునెత్తురు పాత్రను ధరించి ప్రేక్షకులలో చైతన్యం రెచ్చగొట్టాడు. 'అనార్కలీ'లో సలీం పాత్రను దాదాపు దేవదాసంత ప్రతిభావంతంగాను నిర్వహించాడు. 'దొంగరాముడు'లో శ్రీ కె. వి. రెడ్డి దర్శకత్వాన మరింత పరిణతమైన నటన ప్రదర్శించాడు.

నాగేశ్వరరావు ట్రాజిక్ హీరోగా బావుంటాడా, కామిక్ హీరోగా బావుంటాడా అన్నది ఇప్పటికీ విద్యార్థి ప్రేక్షకులను రెండు పార్టీలుగా చేసేసమస్య. సాధారణంగా హాస్య చిత్రాలు అప్పటికప్పుడు ప్రేక్షకులను ఖుషామత్ చేసేసి వదిలి పెడతాయి. విషాదాంత చిత్రాలు చిరకాలం నిలిచిపోతాయి. అందుకే కావచ్చును, నాగేశ్వరరావు మజ్నూగా, దేవదాసుగా, సలీంగా ప్రజాహృదయాల్లో స్థిరావాసం ఏర్పరచుకున్నాడు. ట్రాజెడీలైనా, కామెడీలైనా నాగేశ్వరరావు ధరించే పాత్రలు సాధారణంగా అన్యాయాన్ని సహించలేనివి, ముక్కుకు సూటిగా పోయేవి, పౌరుష ప్రధానమైనవి, రాజకుమారుడి వేషాలైతే ఏవో అతిలోక సాహసకౌర్యాలు సాధించేవి అయివుండడం ఒక విశేషం. వీటన్నిటివల్ల నాగేశ్వరరావనగానే, మామూలు సినిమా నటుడు కాక, ఉదాత్త గంభీరుడైన వ్యక్తి స్ఫురిస్తాడు. ఈ వ్యక్తి తెరమీద ఎంత నిజమో, నిత్యజీవితంలో కూడా అంతే నిజమని వ్యక్తిగతంగా ఎరిగిన వారందరూ అభిప్రాయపడతారు.

నాగేశ్వరరావు నటన అరవై చిత్రాలలోనూ ఒకే స్థాయిలో ఉన్నదని ఎవ్వరూ అనరు. అలా అంటే నాగేశ్వరరావును అవమానించడమే. పేలవంగా నటించిన చిత్రాలూ ఉన్నాయి. ఉత్తమంగా నటించిన చిత్రాలూ ఉన్నాయి. కాని ఒక విశేషమేమంటే, గడచిన పదిపన్నెండేళ్ళలోనూ ఆయన నటనలో ఒక క్రమపరిణామం కనిపిస్తుంది. ఎప్పటికప్పుడు కొత్త విజయాలు సాధించాలనే పట్టుదల, తనను తాను కనుక్కోవాలనే తహతహ ఆయన చిత్రాల్లో కనిపిస్తుంది. అన్ని చిత్రాల్లోనూ ఒకే రకంగా నటించే వారిని గూర్చి చెప్పుకోవలసిందే ఉండదు. ఎప్పటికప్పుడు ఇంకా ఏవో సాధించాలనే కుతూహలంలోనే కళ జన్మిస్తుంది.

నాగేశ్వరరావు జరుపుకుంటున్న అరవై చిత్రాల వజ్రోత్సవం జయప్రదం కావాలనీ, ఆయన మరొక వజ్రోత్సవం కూడా జయప్రదంగా జరుపుకునే శుభసమయం రాగలదనీ ఆశించడం అతిశయోక్తి అనిపించుకోదు. ★



నాగేశ్వరరావు నటించిన 60 వ చిత్రం దొంగల్లో దొర”

నిన్నటికన్న మిన్నకావాలన్న నిరంతరకృషి

శ్రీ బి. ఎన్. రెడ్డి

సృజనాత్మకమైన కళ పరిణామశీలమైనది. అది అనుదినం ఎదుగుతూ ఉంటుంది. కొత్త భావాలను పొదుగుతూ ఉంటుంది. కొత్త దారులు తొక్కుతూ ఉంటుంది. కొత్తరూపాలు ధరిస్తూ ఉంటుంది.

నటుడుగా నాగేశ్వరరావు గమనాన్ని పరికిస్తే ఈ లక్షణాలు గోచరిస్తాయి. అడుగడుగునా మార్పు, ప్రవర్ధమాన ప్రతిభ, నిరంతర కృషి కనిపిస్తాయి.

నాగేశ్వరరావు వెండితెర నటుడుగా అనుభవం గడించినమీదట, క్రమంగా చలనచిత్ర నటనా శిల్పాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని తన నటనకు ఒక అర్థనిర్వచనం ● ర్ధారణ చేసుకుని రూపురేఖలు తీర్చిదిద్దాడు.

నాగేశ్వరరావు పురోగమనంలో, నటుడుగా అతడు ఒకొక్క చిత్రంలో ఒకొక్క అడుగు ముందుకు వేస్తూ వచ్చాడు. అతని చిత్రాలలో కొన్ని ఆశించినంతగా రాణించక పోయినా అతని ప్రయత్నలోపం ఎన్నడూ లేదు.

నిన్నటికన్న ఇవాళ మిన్నగా ఉండాలన్న ఆవేశం, పట్టుదల నాగేశ్వరరావు ప్రత్యేకత.

మన చలనచిత్ర పరిశ్రమలో నాకు సన్నిహితులు అయిన బహు కొద్దిమందిలో నాగేశ్వరరావు ఒకడు.

నటుడుగా నా చిత్రాలలో అతను పని చేయడం ఇంతవరకు తటస్థపడక పోయినా, వ్యక్తిగతంగా నాకు అత్యంత ఆత్మీయులు అయిన నటులలో అతనొకడు.


"బతుకు తెరువు" చిత్రంలో నాగేశ్వరరావు నటన మంచిస్థాయిని అందుకొంది. ఉత్తమ నటుడుగా రూపొంది, కీర్తి గడించడానికి అది నాంది అయింది. అందులో స్థైర్యం, సౌలభ్యం చక్కగా మేళవించాయి. ఆ తరవాత నాగేశ్వరరావు దేవదాసు, విప్రనారాయణ, తెనాలి రామకృష్ణ వంటి పాత్రలను పోషించి సర్వత్రా మన్ననలందుకున్నాడు.

ఈ రోజున 60 చిత్రాలు పూర్తి అయిన సందర్భంలో ఆ చిత్రాల నిర్మాతలకూ, తనను ఆదరించి, ప్రోత్సహించి, సహకరించిన తోటి కళాకారులకూ అతడు కృతజ్ఞతాభివందనలు అర్పిస్తున్నాడు. తనను అభిమానించి, మెచ్చి, గౌరవిస్తున్న ప్రజలకు కృతజ్ఞత తెలుపుకుంటున్నాడు.

చలనచిత్ర ప్రపంచంలో ఇలాంటి పండుగ జరగడానికి ఇదే తొలిసారి. ఇది మంచిపండుగ. నాగేశ్వరరావు ఇంకా ఒక వందచిత్రాలలో నటించి తన నటనాకౌశలంతో ప్రేక్షకులను ఆనందపరచాలని ఆశిస్తున్నాను.

అతనికి ఆయురారోగ్యైశ్వర్యాలు ప్రసాదించాలని సర్వేశ్వరుని మనసారా అర్థిస్తున్నాను. ★

పరిణతుడైన నటునివంక విస్ఫారిత కళ్లతో చూస్తున్న పదహారేళ్ల బాలుడు



అన్నదాత (54 డిసెంబరు)



మాయలోకం (45 అక్టోబరు)

'ధర్మపత్ని' మొదలు 'దొంగల్లో దొర' వరకు...



నాగేశ్వరరావు విగ్రహం.
శిల్పి: శ్రీ వి. ఆర్. కృష్ణన్

1941 వ సంవత్సరం జనవరి 10 వ తేదీన ఆంధ్రదేశంలో ఫేమస్ ఫిలింస్ వారి "ధర్మపత్ని" చిత్రం విడుదల అయింది.

అచిర కాలంలోనే అఖిలాంధ్ర ప్రజాభిమానాన్ని చూరగొంటూ చలనచిత్రసీమలో క్షేత్రయాత్ర చేయనున్న ఒక యువనటుడు అందులో ఒక చిన్న భూమిక నిర్వహించాడు. ఒక్కొక్క చిత్రంతో ఒకొక్క కొత్తమెట్టు ఎక్కుతూ, కొత్త అనుభవం గడించుకుంటూ పరిశ్రమతో పాటే పెరుగుతూ ముందుకు సాగిన ఆ నటుడు, నాగేశ్వరరావు.

జానపద కథానాయకుడుగా, ఆదర్శ యువకుడుగా, వీరుడుగా, విఫల ప్రేమికుడుగా, కవిగా, భక్తుడుగా నాగేశ్వరరావు నేటివరకు పాల్గొన్న 60 చలన చిత్రాలలోనూ ప్రజలకు చిరస్మరణీయములు, పాటి నటుల ఇతర కళాకారుల ప్రశంసల నందుకున్నవీ అనేకం వున్నాయి.

ప్రసిద్ధికెక్కిన విషాద గాథలలో ప్రధాన పాత్రలు "మజ్నూ", "సలీం", "దేవదాస్"లను అత్యుత్తమంగా పోషించాడనిపించుకున్నాడు.

అలాగే జానపదాలలో పల్నాటియుద్ధం, లక్ష్మమ్మ కథ వంటి చిత్రాలలోనూ, విప్రనారాయణ, తెనాలి రామకృష్ణ వంటి చిత్రాలలోనూ నాగేశ్వరరావు నటన సర్వులనూ రంజింపజేసింది. జానపదాలలో ఈ తరంవారు ఎప్పుడూ అభిమానంతో, ఆప్యాయతతో చెప్పుకునేది బాలరాజు పాత్ర. అందులో నాగేశ్వరరావునటనయీనాడున్న స్థాయిలో ఉండకపోవచ్చును. అయినా ఆనాడు నాగేశ్వరరావువిగ్రహం, అతనిమాట, తీరు తెన్నూ మనోహరంగా భాసించి ఆ అభిమానపాత్రము లయ్యాయి. ఆ పాత్ర, ఆచిత్రం ఒక శకానికి నాందివంటివి.

సాంఘికాలే ఎక్కువ


నాగేశ్వరరావు నేటివరకూ నటించిన 60 చిత్రాలలో ఎక్కువ సాంఘికాలే. వినా కొంతకాలంక్రితం జానపద కథానాయకుడనే అపప్రథ ఉండేది. అప్పటికి అవే ఎక్కువ అయినా, ఆ పేరిట ఒక ముద్ర వంటిది వేయబోయారు. క్రమంగా అతడు సర్వతోముఖ ప్రతిభావంతుడుగా పేరు తెచ్చుకున్నాడు. ఈ అరవైలోనూ సాంఘికాలు 28 కాగా, జానపదాలు 24, పౌరాణికాలు నాలుగు, చారిత్రక చిత్రాలు మూడు, భక్తిప్రధానచిత్రం (విప్రనారాయణ) ఒకటి.

ఆర్థిక విజయం

వీటిలో శతదినోత్సవాలు జరుపుకొన్న చిత్రాలు పాతిక ఉన్నవి. 25 వారాలు నడిచి రజతోత్సవాలుకూడా చేసుకున్నవి ఐదు ఉన్నాయి. (బాలరాజు, బ్రతుకు తెరువు, దేవదాసు, దేవదాసు (తమిళం), రోజులు మారాయి.)

రాష్ట్రపతి ప్రశంసాపత్రం అందుకున్న చిత్రాలు విప్రనారాయణ (1954), అర్ధాంగి (1955).

"తెనాలిరామకృష్ణ" అఖిల భారత ప్రశంసాపత్రాన్ని, ప్రాంతీయ స్థాయిలో రాష్ట్రపతి రజతపతకాన్ని అందుకుంది.



ఆంధ్రదేశాన్ని ఒకనాడు ఉర్రూతలూగించిన 'బాలరాజు'(48 ఫిబ్రవరి) నాగేశ్వరావు. ఆరోజుల్లో అంతా అతన్ని బాలరాజనే పిలిచేవారు.



'అనార్కలీ' (55 ఏప్రిల్)

చిత్రాల వివరాలు

తెలుగు

సాంఘికాలు: ధర్మపత్ని (జనవరి 1941) సంసారం (1950 డిశంబరు-ఇది శతదినోత్సవాలు జరుపుకొంది), ప్రేమ (52 మార్చి), పరదేశి (53 జనవరి), బ్రతుకుతెరువు (53 ఫిబ్రవరి-రజతోత్సవచిత్రం), కన్నతల్లి (53 ఏప్రిల్), దేవదాసు (53 జూన్-రజతోత్సవాలు జరుపుకొంది), నిరుపేదలు (54 మార్చి), చక్రపాణి (54 మార్చి), పరివర్తన (54 సెప్టెంబరు), అన్నదాత (54 డిశంబరు), మిస్సమ్మ (55 జనవరి-శతదినోత్సవాలు), అర్ధాంగి (55 జనవరి-శతదినోత్సవాలు, రాష్ట్రపతి ప్రశంసాపత్రం), రోజులు మారాయి (54 ఏప్రిల్-రజతోత్సవాలు), సంతానం (55 ఆగస్టు-శతదినోత్సవాలు), వదిన (55 సెప్టెంబరు), దొంగరాముడు (55 అక్టోబరు-శతదినోత్సవాలు), బలేరాముడు (56 ఏప్రిల్-శతదినోత్సవం), ఇలవేలుపు (56 జూన్ - శతదినోత్సవాలు), చరణదాసి (56 డిశంబరు), తోడికోడళ్ళు (57 జనవరి - శతదినోత్సవాలు), దొంగల్లో దొర (57 జూలై).

జానపదాలు: మాయలోకం (1945 అక్టోబరు. శతదినోత్సవాలు), ముగ్గురు మరాటీలు (46 జూన్ - శ. ది.) రత్నమాల (48 జనవరి-శ. ది), బాలరాజు, (48 ఫిబ్రవరి-రజతోత్సవం), కీలుగుర్రం (49 ఫిబ్రవరి శ. ది.), రక్షరేఖ (49 ఏప్రిల్), లైలామజ్నూ (49 అక్టోబర్-శ.ది.) లక్ష్మమ్మకథ (50 ఫిబ్రవరి), పల్లెటూరి పిల్ల (50 ఏప్రిల్-శ. ది.) పరమానందయ్య శిష్యులు (50 అక్టోబరు) స్వప్నసుందరి (50 నవంబరు) తిలోత్తమ (51 ఫిబ్రవరి) సౌదామిని (51 ఏప్రిల్), మాయలమారి (51 జూన్-శ. ది.) స్త్రీ సాహసం (51 ఆగస్టు), మంత్రదండం (51 సెప్టెంబరు), వయ్యారిభామ (53జూన్), అలాడీన్, అద్భుతదీపం (57 మార్చి), సువర్ణ సుందరి (57 మే).


పౌరాణికాలు: సీతారామ జననం (1944 డిసెంబరు), సావిత్రి (57 జనవరి- శ. ది.), మాయాబజార్ (57 మార్చి-శ. ది.)

చారిత్రకాలు: పల్నాటియుద్ధం (1947 సెప్టెంబరు) అనార్కలి (55 ఏప్రిల్ - శతదినోత్సవాలు), తెనాలి రామకృష్ణ (56 జనవరి-ఇది అఖిలభారతప్రశంసాపత్రం,రాష్ట్రపతి రజతపత్రం అందుకొంది).


భక్తిరస ప్రధానచిత్రం విప్రనారాయణ (54 డిశంబరు) రాష్ట్రపతి ప్రశంసాపత్రం అందుకొంది.

(56-వ పేజీచూడండి)

"శ్రీ లక్ష్మమ్మ కథ"(50 ఫిబ్రవరి)



నాగేశ్వరరావు —కథ



నిత్యనూతన నటులు
నాగేశ్వరరావు, అశోక్‌కుమార్

కుదరవల్లికి రానూపోనూ క్రోసెడు దూరం. పరిగెడితే గంట. నడిస్తే రెండు.

"ఏమైనాసరే వెళ్ళి తీరాలి; 'కనక తార'లో వేషంవేసి తీరాలి" అన్నాడు నాగేశ్వరరావు. నట్టింట దీపం పెద్దది చేస్తూ.

"వెళ్ళిరా బాబూ. నీ ఓపిక చూసుకో అంతే." అంది వాళ్లమ్మ పున్నమ్మగారు.

"కుర్రాడు. ఓపిక వాడి గ్గాకపోతే మనకి ఉంటుందా అమ్మా. ఆడుతూపాడుతూ వెళ్ళొస్తే అలుపూ సొలుపూ తెలీదు. వెళ్ళిరా అబ్బీ" అన్నారు వాళ్ళన్న రామబ్రహ్మంగారు.

* * *

తెల్లవారింది. నాగేశ్వరరావు నిద్రలేచి, సావిత్రి నాటకంలో నారదుడి పాట హుషారుగా పాడుకుంటూ, చకచక ఇంటి పనులు చక్కబెట్టేశాడు. గొడ్లసావిడి కెళ్ళి పాలుపితికి దాలిమీద పెట్టేశాడు. పచ్చడి చేసుకుని, చద్దెం తినేశాడు. అనక వేడన్నం వండి ఓ పక్కన పెట్టేశాడు.

'అమ్మా వెళ్తున్నా' అంటూ బడికి బయల్దేరాడు...అదో క్రోసెడు దూరం.

సాయంత్రం తిరిగి మళ్లీ పాలుతీసి, వంట చేసి, 'అమ్మ వెళ్ళిరానా మరి?' అన్నాడు.

'జాగర్త' బాబూ అంటూ ఆవిడ చెంగు ముడి విప్పి రెండు రూపాయలు తీసిచ్చింది.

నాగేశ్వరరావు కుదరవల్లికి పరుగులంకించుకున్నాడు.

అక్కడ జతగాళ్లె నాయకుడికి రెండు రూపాయలూ రుసుము చెల్లించివేశాడు. పెట్రొమాక్స్ లైటు కిరాయీ, కిరసనాయిలు డబ్బులూ వగైరా రిహార్సలు ఖర్చుల మొత్తంలో అతని వాటా అది. అది కడితే నె నాటకంలో 'తార' వేషం కట్టడం.

అస్వస్థతతో తీసుకొంటున్న తల్లి శ్రమ పడకుండా, వంటావార్పూ తనే చూచి, బడికి వెళ్ళి చదువూ సంధ్యల విషయంలో చివాట్లు పడకుండా జాగ్రత్త పడుతూ సాయంకాలం వేళ రెండు మైళ్ళు 'షికారు'గా కుదరవల్లి వెళ్లి అక్కడ రిహార్సల్సు వేసి ఇంటికి తిరిగి రావడం అతని దైనందినీయం. ఇంటి దగ్గర ఇంకా చిల్లరమల్లర పనులుండేవి.

"మా నాన్నగారు పోయిన కొంతకాలానికే మా అన్నదమ్ములంతా వేరు కాపురాలు పెట్టారు. నన్ను మా అమ్మదగ్గర ఉంచారన్నమాట" అన్నాడు నాగేశ్వరరావు ఆనాటి కథ చెబుతూ.



ఇద్దరు "దేవదాసులు"
దిలీప్‌కుమార్, నాగేశ్వరరావు

అక్కినేని నాగేశ్వరరావు 1924 సెప్టెంబర్ 20వ తేదీన, గుడివాడ తాలూకా వెంకటరాఘవపురంలో జన్మించారు. తల్లి పేరు పున్నమ్మగారు, తండ్రి వెంకటరత్నంగారు. నాగేశ్వరరావుకు నలుగురు అన్నలు. అక్కచెల్లెళ్లు లేరు. నాగేశ్వరరావు ఐదవ ఏటనే, తండ్రిని కోల్పోయాడు.

తల్లిచాటు బిడ్డడుగా పెరిగి, అన్నగారి సహాయంతో నాటక, చలనచిత్ర రంగాలలో ప్రవేశించి నిలదొక్కుకుని ప్రయోజకుడైన తరువాత, నాగేశ్వరరావు 1949లో వివాహం చేసుకున్నాడు. భార్య పేరు అన్నపూర్ణ.

నాగేశ్వరరావుకు ముగ్గురు బిడ్డలు సత్యవతి, వెంకటనారాయణరావు, సుశీల.

అందువల్ల ఇంటికి మొగదక్షత, ఆడపడుచూ కూడా అతగాడే అయ్యాడు. వాళ్లమ్మగారు యితన్ని కూతురులాగే చూసుకునేవారు.

ఇలా "వీరరాఘవపురం - కుదరపల్లి సర్వీసు" రెండు నెలలు నిర్విరామంగా సాగింది. వేషంవేసి ఒప్పించి, నెగ్గుకు రావాలన్న పట్టుదలే నాగేశ్వరరావుకు ఆశక్తి నిచ్చింది. అందుకు తగ్గట్టు వాళ్ళమ్మగారు, అన్నలూ ప్రోత్సహిస్తూ వచ్చారు.

నాటకం ప్రదర్శన రోజున, నాగేశ్వరరావు వేషం చూడటానికి, వాళ్ళ అమ్మగారు కూడా బయల్దేరి కుదరవల్లి వెళ్ళారు.

నాటం సగం అయేలోగానే నాగేశ్వరరావు పద్యాలకి రెండు వన్స్ మోర్ లు పడ్డాయి. అంతవరకూ ఉంటున్న 'జంకు' కాస్తా ఎగిరిపోయింది. నాటకం భేషుగ్గా సాగిపోయింది. అందరూ బాగుందని మెచ్చుకున్నారు.

"ఆ వేళ మా అమ్మ ఎంత సంబరపడిపోయిందో చెప్పలేను." అన్నాడు నాగేశ్వరరావు.


వాళ్ళన్నలు కూడా మెచ్చుకున్నారు.

"అప్పుడే వీడికీర్తి కొత్తెడు మందం పెరి

(54-వ పేజీ చూడండి)



నాగేశ్వరరావుకు తొలిసారిగా ముఖ్యభూమికనిచ్చి ప్రోత్సహించిన ప్రతిభా పిక్చర్స్ అధిపతి శ్రీ. శే. ఘంటసాల బలరామయ్య.



సంసారంతో నాగేశ్వరరావు.

"ఈ పాప పేరు సుశీల, అబ్బాయి వెంకటనారాయణ; అమ్మాయి పేరు సత్యవతి; వాళ్లమ్మ అన్నపూర్ణ."



'రోజులు మారాయి' (55 ఏప్రిల్)



"స్వప్న సుందరి"
ఊహాలోకాలను చూ

"ఇంతకన్న గొప్ప రచన చేయాలి అనుకు
ఇంతకన్న మధురంగా పాడాలి అనుకుం
ఇంతకన్న ఉత్తమమైన స్థాయిని అందు
ఇది నిరంతరయాత్ర, నిర్విరామకృషి, త
ఇదే నా భావికి సురుచిర స్వప్నం...."

★

'లైలా మజ్నూ' (48 అక్టోబరు)





(50 న వ ం బ రు).

స్తూ చూ పి స్తూ ....

ంటాడు కవి ....

టాడు గాయకుడు....

కోవాలి అనుకుంటాడు నటుడు....

పస్సు.....

— అక్కినేని నాగేశ్వరరావు.



"సతీసావిత్రి" (57 జనవరి)

★

'దే వ దా సు' (53 జూన్)



సామర్థ్యం, మంచితనం మేళవించుకొన్న

నటుడు నాగేశ్వరరావు

"అదీ కథ. ఎలాఉంది?" అన్నాడు దర్శకుడు.

"భేషుగ్గా ఉందండి" అన్నాడు నటుడు.

"నువ్వు ఏంవేషం వేస్తావు?"

నటుడు చెప్పాడు—

"నీకు నప్పుతుందా?" అన్నాడు దర్శకుడు.

"ఆహా" అన్నాడు నటుడు ధీమాగా, ఉత్సాహంగా.

"బాగా ఒప్పిస్తావా?"

"తప్పకుండా. నాకు నామీద నమ్మకం ఉంది"

"ఇతరపాత్ర లేవీ నచ్చలేదా? ఇంకోటేదేనా వెయ్యరాదా?" అన్నాడు దర్శకుడు కొంటెగా.

"ఈ వేషం వెయ్యాలని నాకు అభిలాష కలిగింది. వేసి ఒప్పించ గలనని నమ్మకం ఉంది. ఇదే వేస్తాను. ఇది కుదరదంటే, మీరు మళ్లీ ఫిలిం తీసినపుడు కలుసుకుందాం" అన్నాడు నటుడు హుందాగా.


"రైట్" అన్నాడు దర్శకుడు—కంట్రాక్టు పత్రం అందిస్తూ.

* * *

అదీ కథ. ఆ చిత్రం పేరు "అర్ధాంగి. నాగేశ్వరరావు ఆ రోజున అంత ధీమాగా మాట్లాడాడు. అంత గట్టిగా వాదించాడు. తన శక్తి మీద నమ్మకంతో ఆనాడతడు చేపట్టిన కొత్త యత్నం లవలేశం వమ్ము కాలేదన్న విషయం ఈనాడు సర్వులకూ విదితమే. అందులో మనస్ఫూర్తిగా, కాయ కలాక్షులా కృషిచేసి, అతడు తలపెట్టిన



"నటన పరిణతి చెందినచిత్రం..."
అర్ధాంగి (55 జనవరి)



తోడికోడళ్లు (1957 జనవరి)

ఫలితాలను సాధించి తీరాడు.

ఆత్మ వంచన క్రీనీడలు పడని ఆత్మ విశ్వాసం, పరవంచనకు పాల్పడనీయని చిత్త శుద్ధి అతని సొత్తు. వాటికి తగిన ప్రతిభ, దాన్ని చూపే సామర్థ్యం, వాటికి దీటైన మంచి మనసు అతనిలో నిలచాయి.

నాగేశ్వరరావు నేటికి 60 చిత్రాలు పూర్తిచేశాడు. మరిన్ని చిత్రాలలో నటించి అఖండ విజయం సాధిస్తాడనడానికి సందేహం లేదు.

శ్రీ పి. పుల్లయ్య

దీనికి ముఖ్య సాధకాలు రెండు ఒకటి సామర్థ్యం; మరొకటి మంచితనం.

హాలీవుడ్‌వంటి ఫిలిం కేంద్రంలో సామర్థ్యంవల్ల మంచిపేరు గడించినా, మంచి తనం లేక మూడోనాటికల్లా మరుగునపడిన నటులలో లూయీస్ (గుడ్ ఎర్త్") రెయినర్ ఒకర్తె. ఇవాళ ఆమె ఎక్కడుందో ఏం చేస్తోందో ఎవరికీ తెలీదు;


ఇన్‌గ్రిడ్ ("గాస్ లైట్", జోన్ ఆఫ్ ఆర్క్") బెర్గ్‌మన్ ప్రపంచ ఖ్యాతి గడించిన తార. పరిణతి చెందిన నటి. ఆమె ఏడెనిమిదేళ్లనాడు-ఉచ్ఛదశలో ఉండగానే ప్రముఖ ఇటాలియన్ దర్శకుడు రాబర్టో ("స్ట్రాంబోలీ") రాసెలినీని వివాహం చేసుకుందని కినిసి, 'హాలివుడ్' ఆమెను వెలివేసింది. ఇన్‌గ్రిడ్ ఇటలీ వెళ్లిపోయింది. కాని, ఏణ్ణర్థం క్రితం హాలీవుడ్ వాళ్లు "అనస్తేషియా" అనే చిత్రం తీయ

బోయారు. అందులో ప్రధాన భూమిక నిర్వహించడానికి ఇన్‌గ్రిడ్ బెర్గమన్‌ను పిలువక తప్పిందికాదు,ఆమె ప్రతిభపట్ల చలన చిత్రకారుల విశ్వాసం అంతటిది. ఆమె ఆ పాత్రను అద్వితీయంగాఒప్పించి, అకాడమీ అవార్డును కూడా అందుకొంది. ఆమెకు గల సామర్థ్యం అంతటిది.

ఈ దృష్ట్యా, ఒక కళాకారుడు పది కాలాలపాటు స్థిరంగా ప్రజల కళ్లబడుతూ నిలచి ఉజ్వలంగా వెలగాలంటే, సామర్థ్యం మంచితనం, కలుపుగోలుతనం, ఉపకార బుద్ధీ ఉండాలి.

ఈ గుణాలు నాగేశ్వరరావులో నిలచాయని అతని ఎరిగినవారంతా అంగీకరిస్తారు.

ఒక వ్యక్తి గుణవంతుడు కావడం ఒక ఎత్తు. ఆ సంగతి తను తెలుసుకోవడం, నోటివారికి తెలియచెప్పడం, చిత్తశుద్ధిగలకొద్దిమంది బుద్ధిమంతులకే చెల్లుతుంది. నటుడుగా తన విద్యుక్తధర్మాలను పూర్తిగా నెరవేర్చడానికై తగినవ్యవధి, స్వీకరించే బాధ్యతలకుఅవధి,ఉండాలన్న సంకల్పంతో నాగేశ్వరరావు ఏడాదికి ఆరు చిత్రాలకు మించి అంగీకరించరాదని మనస్ఫూర్తిగా నిశ్చయించుకొన్నాడు. ఆమితిదాటిన మీదట, అతని నడుగ వచ్చేవారు నొచ్చుకోని విధంగానే అయినా, స్పష్టంగా తన అభిమతం తెలియచెబుతాడు. నిజానికీ నాడు, నాగేశ్వరరావు ఏడాదికి మూడు చిత్రాలలో మాత్రమే పాల్గొన నిశ్చయించుకుని, ఒకొక్క చిత్రానికి మూడు చిత్రాల డబ్బు పుచ్చుచుంటానన్నా ఇచ్చి, అతన్ని ఆహ్వానించేవారు ఉన్నారు.



'చక్రపాణి' (54 మార్చి)

ఇందుకు కారణం అతను ఉత్తమనటుడు కావడమే.

ఈ 60 చిత్రాలయాత్రలో, నాగేశ్వరరావు కొంచెం అర్థంచేసుకుని నటించ ప్రయత్నించి సాధించిన పాత్ర బాలచంద్రుడిది (పల్నాటియుద్ధం) అనిపిస్తుంది.

"ఇతడీ పాత్రను అర్థంచేసుకుని నటించాడు" అన్న విశ్వాసం కలిగించింది "లైలామజ్నూ"లో.

నటనలో సంపూర్ణతను సాధించి, పరాకాష్ఠను అందుకొన్నది "దేవదాసు"లో

ఎటువంటి ప్రేమఘట్టంలోనైనా, కలత చెందకుండా కంగారు పడకుండా, సమర్థుడి స్థైర్యం ప్రదర్శించి, ఆ పాత్రలో, ఆ ఘట్టంలో జీవం నిలుపగల సమర్థుడు.

విషాదాంత కథానాయకులపాత్ర నిర్వహణలో నాగేశ్వరరావుకు మంచి ప్రజ్ఞ ఉందన్న పేరు ఉంది. ఇంతకన్న మంచి పొగడ్త, ప్రశంస ఏం కావాలి?

రసోద్వేగం విచ్ఛిన్నం కాకుండా నటించగల సమర్థుడికే ఈ ప్రశంస, ఈ పేరు లభిస్తాయి.

ఇక, నాగేశ్వరరావు పరిణతుడైన నటుడని ఋజువుచేసిన మరో, సందర్భం "అర్ధాంగి" చిత్రంలో పాత్రపోషణ.

పిచ్చివాడుగా—

"అయమ్మా, భయంగా ఉంది నీ దగ్గిరే పడుకుంటాను" అన్న మాటలు.

మంచివాడుగా—

"నేను నీ బిడ్డనమ్మా" అని మారుతల్లితో అన్నమాటలూ అతడు చెప్పిన విధం, ఆ ఘట్టాలలో నటన ఇందుకు నిదర్శనాలు.

నాగేశ్వరరావుకు మన దేశంలో ఒక్కకొత్త మిలిగింది.—హిందీ.

అదీ రేపోమాపో సాధిస్తాడన్న విశ్వాసం నాకుంది. ఇతడింకొకరికేం తీసిపోడు.

నాగేశ్వరరావు చిన్నవాడు. ముమ్ముందు ఇంకెన్నో విజయాలు సాధించి పెద్దవాడు కాగల అవకాశాలు ఎన్నో ఉన్నాయి. అవన్నీ అతడు సాధించగలడని నా విశ్వాసం; సాధించాలని ఆకాంక్ష. ★



"సంసారం" (50 డిసెంబరు)

చెట్టూ - మొక్కలూ

ఆ తోట కొన్నాళ్లుగా పాడుబడి ఉన్నా, ఈ మధ్య ప్రజలదృష్టి అటువైపు మళ్ళటంవల్ల - [ఎందుకు మళ్ళిందో సరిగ్గా తెలియదు; కాని అది 'వెనుకబడిన ప్రాంతం' కావటంవల్ల అని కొందరు 'రహదారీ రాజకీయవేత్తలు' ఊహాగానాలు చేస్తూన్నట్టు వినికిడి]-కొంత; కొంతేమిటి? చాలా వరకు బాగుపడిందనే చెప్పవచ్చు.

ఆ తోటలో, ముసలిచెట్టూ, సరికొత్త మొక్కలూ, ఉంటంవల్ల అనేకులు అనేక విధాలుగా అంటారు. ఏది ఎల్లాఉన్నా, ఆ ఎత్తయిన చెట్టూ, పొట్టిగా ఉన్న మొక్కలూ, రెండురకాల వయోవృత్తుల్ని సూచిస్తున్నట్టుగా చూట్టానికి అదోమాదిరి అందంగానే ఉన్నాయి మరి

వర్షాకాలపు రోజులేమో, ఒక రోజు ఠక్కని అందమైన చిన్న వర్షం కురిసింది. తోటంతా చల్లబడింది. మొక్కల సంతోషానికి హద్దూపద్దూ అంటూ ఏమీ లేకుండా, గట్లు తెగినట్లయిపోయింది ఓ మొక్క తనలోనే చిరునవ్వు - చిరునవ్వా అంటానికి వీల్లేదు దాన్ని - ఏదో గమ్మత్తయిన, అతిశయాన్ని సూచించే నవ్వు - నవ్వుకొంటూ:- 'ఈ వర్షం ఇల్లాగే ఉంటే ఎంతహాయిగా ఉంటుంది!' అని, చిన్నగా ఏం ఖర్మ?- పెద్దగానే అనేసింది.

ఆ పక్కనే అంతలా పెరిగిన చెట్టూ నవ్వింది. కాని మొక్క నవ్వుకీ, దీనికీ ఎక్కడా సాపత్యంలేదు తెలివి తక్కువదనాన్ని చూచి నవ్వినట్టుందీ చెట్టునవ్వు 'ఒరే అబ్బాయ్! నువ్వెందుకింతగా ఆనందిస్తున్నావో, నాకైతే అర్థం కావటంలేదు. కాని ఓ అరపూట పెద్దవాన కురిస్తే, ఏమవుతావో తెలుసా?' అంది

మొక్క కొంచెం అదిరిపడ్డట్టయి, చుట్టూ ఉన్న తన సావాసగాళ్లను చూచింది ధైర్యం తెచ్చుకుని చెట్టును చూస్తూ నిర్లక్ష్యంగా అంది —"ఏమవుతుంది? ఏ-మీ-కాదు."

చెట్టు కొంచెం గలగల్లాడింది -"ఏం కాదంటావేమిటి? చెబుతూంటే అర్థం కాదూ? తేలిగ్గా తలక్రిందులవుతావ్"

"ఏమీ కామంటూంటే. నువ్వు చెప్పేవన్నీ పాతమాటలు. చూడు, ఈ వర్షం ఎంత ఆనందకరంగా ఉందో! నువ్వు ముసలిదానివాయేమరి. కొంచెం పెద్దగా గాలివస్తే, 'పళ్లూ, ఆకులూ ఎక్కడరాలి పోతాయో!' అని నీ భయం. ఆ భయంతో ఈ ఆనందం అనుభవించలేక పోతున్నావ్. ఇలా భయంతో ఎంతకాలమని! బతికిన కొంచెం సేపయినా ఈ ఆనందాన్ననుభవించు!" మొక్క ఒక బోద్దలా మొగం పెట్టింది.

"అవును బాబూ! నేను ముసలినే. అయితేనేం? నా జీవితం ఏలాగో ఓలాగు గడించింది. కాని, నీ జీవితం ఇంకా ఎంతో ఉంది. పాపం శాంతించుగాక! పిడుగులూ, అవీ పడకుండా మీ రందరూ వెయ్యేళ్ళు బతకాలనే నా ఆశ" చెట్టుకంఠం గద్గదమయింది.

"చాలు చాలు, ఈ ఆనంద సమయంలో నీ విచారం చూడలేం."

"మారన"

"నాకు తెలుసు, నువ్విలా అంటావని. నీ వయస్సులో అల్లాగే అనిపిస్తుంది. కాని, అనుభవాలతో పండిన మా వంటివాళ్లన్నంతవరకే మీ మాటలన్నీ, మీ రూనాలు "థక్కా మొక్కలు" తిన్నప్పుడు కాని మా మాటలు గుర్తురావు.!

మొక్కకు కొంచెం కోపం వచ్చిందిలా ఉంది -"నీ ముసలిమాట లాపెయ్. మాకూ మాకూ సాపత్యం ఏమిటి? కాకపోతే మేమే చాలా అభ్యుదయంలో ఉన్నాం. చూడు, మా ఆకు లెంత నవనవ లాడుతున్నాయో!" మొక్క గర్వంగా తలెగరేసింది.

నీ మాటలు వింటుంటే నాకో నాటి సంఘటన గుర్తొస్తోంది" చెట్టు తన పూర్వ జీవితంలోకి చూస్తూ అంది. "ఓసారి వసంతం తోటంతా వ్యాపించింది. అప్పుడు నీలాంటి మొక్కలు కొన్ని తమలోతాము—సరిగ్గా నువ్విప్పుడున్నట్టే — నా ఆకులు నవనవలాడుతున్నాయంటే, నావని తెగపోట్లాడుకున్నాయి. కాని కొన్నిరోజులు గడిచి, ఋతువు మారి, ఆకులన్నీ పండిపోయినప్పుడు — పోట్లాటలేదు. నేనెక్కువ పండినానంటే నేనని అనలేదు. బిక్కమొగాలేసి చూసుకొన్నాయ్ ... ఎవరైనా ఏంచేస్తారులే...ఋతువే అల్లా అనిపిస్తుంది"

అప్పటికీ మొహాలు ముడుచుకున్నా, వెంటనే ముసలిచెట్టును పరిహాసంచేస్తున్నట్టు కిలారుమన్నయ్, మొక్కలు.

* * *

సుమిత్ర, ఆవిడ తాతగారు, రావుబహాద్దరు భుజంగరావుగారు మెల్లిగా వచ్చి చెట్టు క్రింద, మొక్కదగ్గరగా కూర్చున్నారు. ఇద్దరి మొహాలూ, ఏదో వాదించుకొన్నట్టుగా తీవ్రంగానే ఉన్నయ్ కొంచెంసేపు ఇద్దరూ, నేలమీద వ్రేలితో గీట్లుగీస్తూ, చిన్నగడ్డి పోచల్ని తుంచుతూ మౌనంగానే ఉన్నారు. ఎంతసేపలాఉండాలో ఇద్దరికీ అర్థంకాలేదు. చివరకి రావుబహాద్దరుగారే నేలమీద గట్టిగా గీస్తూ ఇలా అన్నారు: "అయితే అమ్మాయ్! నీమనసులోమాట, చివరిమాట చెప్పేసెయ్. ఆలస్యం దుర్భరంగాఉంది!"

సుమిత్ర తాతగారి తీవ్రమైన మొగం మీదికివాలే తెల్లని ముంగురుల్ని, నల్లని విచారరేఖల్ని చూస్తూ ... చూస్తూ, ఏదో అంటానికే పెదవులు కదిలించింది. కాని బహద్దరుగారు మళ్ళీ అందుకున్నారు: "చూడమ్మాయ్! నేనేంచెప్పినా నీమంచికోసమే అని గుర్తెట్టుకో. నా ఖర్మ, మీ నాన్న — నేను బతికుండగానే తాను పోతూపోతూ నిన్నప్పచెప్పాడు. ఇక ఎవరైనా నీవే అనుకొంటూ బతుకుతున్నాను. నిన్నో మంచి ఇంటిదాన్నిచేసి, సుఖపెట్టే

బాధ్యత నాపైనేఉంది." ఆయన కంఠం కొంచెం గంభీరమయింది. "మనం పెద్ద వాళ్ళం; గొప్ప గౌరవప్రతిష్ఠలు కలవాళ్ళం. మన ఉన్నతవంశం, మన ఆచార వ్యవహారాలూ, అన్నీ దృష్టిలో ఉంచుకుని..."

"అయితే అవన్నీ మంటకలుపుతున్నా నంటారా?" సుమిత్ర రుసరుసలాడింది.

". .కాకపోతే ఏమిటమ్మా! వాడెవడో...కులం, గోత్రం, మర్యాదా తెలియనివాణ్ణి, ఊరూ పేరూ లేనివాణ్ణి—కాలేజీలో నవ్వుతూ మాట్లాడినంతలో, ఆ ప్రకాశంగాణ్ని, పెళ్ళాడతానంటావా?" బహద్దరు గారు కొంచెం తమాయించుకొన్నాడు... "కాదమ్మా! నేచెప్పేది విను. ఆ సుబ్బారావున్నాడు చూడు, మన స్థితిగతులకూ, హోదాకూ, ఫాయాకూ, తగినవాడు. అతని నాన్న మనక నేకరకాలుగా అవసరపడే వాడు. కాబట్టి నామాటవిని అతన్ని..."

"ఛస్తే చేసుకోను" సుమిత్ర తెగేసి చెప్పింది. చేతిలో గరికపోచనుంచి విసిరివేస్తూ మళ్ళీ అంది: "మీ ముసలి మాటలూ, నిరర్థకాలైన ఆచారాలూ, వల్లమాలిన సంప్రదాయాలూ, నా నిశ్చయానికేవిధంగా అడ్డం రాలేవు. అతడెవడైతే నేం? ఎల్లాంటివాడైతేనేం? ప్రేమించినచోట ఇవేవీ అడ్డునిలవ్వు. ఇది నా నిశ్చయం."

బహద్దరు ఏదో అనబోయారు. పెదవులు కదలినయ్ కాని.....సుమిత్ర పదిగజాల దూరంలో వెళ్తూ కనిపించింది.

* * *

చెట్టుకు అటుప్రక్క కొంచెందూరంలో, ఒక సిమెంటు బెంచిమీద మిల్ మేనేజర్ రాజారావ్, సిగరెట్టు కాలుస్తూ కూర్చున్నాడు. ఆయన, తనమిల్లు (నిజానికి తన మిల్లు కాదనుకోండి) పనివాళ్లలో నాయకుడైన నరసింహంకోసం ఎదురుచూస్తున్నాడు. నరసింహం రానేవచ్చాడు. కాని రాజారావ్ అతన్ని కూర్చోమనలేదు. అతనల్లాగే నిలబడ్డాడు.

"నరసింహం!" పూర్తయిన సిగరెట్‌కి మరోటి అంటిస్తూ అన్నాడు.

"చూడు నరసింహం! ఈ విషయంలో నీకేవిధంగానూ సాయంచేయలేను. నీవనేదో నువ్వు చూసుకో, ఒకళ్ళజోలి నీకనవసరం. చూడు, ఇది నాసలహాగా పాటించు."

నరసింహం వినయం చూపిస్తూనే అన్నాడు: "మీసలహాకు నా ధన్యవాదాలు. కాని పాటించలేక పోతున్నందుకు విచారిస్తున్నాను. అయితే ఒకప్రార్థన—మీరు మమ్మల్ని కనికరించాలి. మిల్ యజమాని మీమాట కాదనలేడనేది మీకూ, మాకూ తెలుసు. ఏదోరకంగా మాకు బోనస్ వచ్చే ఏర్పాటు చేయించండి. చాలా కృతజ్ఞులమవుతాం."

"హుం. నరసింహం! నీనుండి నేనెంతో ఆశించాను. ఎన్నో ఊహించాను. కాని... దాన్నంతా నేలపాలు చేశావ్"...సిగరెట్ నుసిదులుపుతూ మళ్ళీ అన్నాడు, "చూడు నరసింహం! ఇల్లాంటి అల్లర్లు వచ్చినప్పుడు, నువ్వేదో నావాడుగా, తోడుగా ఉంటావనుకుని ఉద్యోగం ఇప్పించాను. ఏదో చదివినవాడివి, తెలివైనవాడివి, పైగా నావాడివి అనుకొంటే, ఇంటివాడు దొంగల్లో కలిసినట్టు చేస్తావా?...అయిందేదో అయిపోయింది. ఇప్పటికీ మించిందిలేదు. నీ భావిజీవితాన్ని సుఖమయం చేసుకో. ప్రమోషనిప్పిస్తా. ఇంకా—"

"క్షమించండి సార్! నావల్ల కాదని"

★ చెట్లూ - మొక్కలూ ★

మేనేజర్‌కు కఠినంగా వినిపించింది. మొగంలో కొంచెం కోపమూ ఒలికింది. "అయితే తిన్నయింటి వాసాలెక్కపెడతా వంటావ్.. అంతేగా.. " అన్నాడు.

"దీన్లో తిన్న ఇంటి వాసాలెక్కపెట్టడ మేమిటో నాకర్థం కావటంలేదు. మాకష్టాలు చెప్పుకుని - అధికారంలో ఉన్నారుకాబట్టి న్యాయం చేయమంటున్నాం. ప్రార్థిస్తున్నాం."

"హుం. న్యాయం ఏమిటోయ్ న్యాయం! ఇన్నేళ్లిబట్టీ వచ్చేన్యాయం ఇవాళ కొకపోయిందా? ఏమిటో వెధవ్వేషాలు వేయటం కాకపోతే "

"నిజంగా మీలో దయలేదా సార్! మీరింత కఠినంగా ఎల్లా ఉండగలుగుతున్నారో నాకర్థం కావటంలేదు "

"దయేమిటోయ్ దయ! అది ఉంటే నాకీనా డో మేడ, ఓ కారూ, ఓ 'బ్యాంక్ అక్కౌంట్' అంటూ ఉండేవా? నిజంగా చాలాగా నువ్వూ ఉంటే నిన్నూ నాలా చేస్తాను. నా మాట విను" బుగుగరించి పట్టన్నాడు మేనేజర్.

నరసింహం ఇక సహించలేకపోయాడు. "ఇదంతా అనవసరం." మండిపోతూ అన్నాడు: "మీరెల్లా బోనస్ ఇవ్వరో మేముచూస్తాం. మేం కొత్త మొక్కలం సార్ కొత్త మొక్కలం. మేమేమయినా చేయగలం. సమ్మెచేస్తాం, పికెటింగ్ చేస్తాం బోనస్ ఎలా ఇవ్వరో చూస్తాం "

మేనేజర్ తానువిడిచే పొగలోంచి నరసింహం గేటుదాటటం చూచి, గట్టిగా దమ్ముపీల్చి, సిగరెట్ దూరంగా విసిరి, లేచాడు.

* * *

అపక్కనే పచ్చికలో ఆరేళ్ళ సర్వీసుగల ఓ ఉపాధ్యాయుడు కూర్చుని ఏదోపుస్తకం చదవటానికి పూనుకున్నాడు కాని అదెల్లా సాగుతుంది? తలలో లక్ష ఆలోచనలు.

"ఏమిటీ వెధవ్వుద్యోగం .. డబ్బులేని వాళ్ళు చదివినా లాభంలేనట్టుంది డబ్బు లేక పెద్దచదువులు చదవలేకపోవటం నేరమా? . చదివిన ఈకొంచెం చదువైనా స్వతంత్రంగా బతకటం నేర్పదు. బడి పంతులో, క్లర్కో కావటంతప్ప మరేమీ చాతకాదు. ఛీ గడియారాల బతుకులు... మోటెద్దు బతుకులు...

అదీగాక.. పని చేసున్నా.. నాలుగైగు నెల్ల జీతాలూ రాకపోతే, వందలుతింటున్న ఆఫీసర్లేం చేస్తున్నట్టు?..! ఒక్కనాడు లేటుగావస్తే వీడితాడు తెంచుతారే? ఛీ... న్యాయంగా రావాల్సిన దానికూడా బిచ్చగాడికిమల్లే దేబిరించటంవా? పుణ్యాని కిచ్చిన టియ్యాటంవా? దానికి సిఫారసులు కూడానా?. వెధవది, ఇంక్రిమెంటు పాస్ చెయ్యడానికూడా నెలలూ సంవత్సరాలూనా? కుర్చీలకు అగస్త్య దాహాలూ, దర్వాజాలకు బకాసుర క్షుధలూన్నూ. ఆఫీసు మొగం చూస్తేనే అమావాస్య గుర్తొస్తుంది.

.. "జీతం ఎక్కించు బాబూ!" అన గూడదు. అంటే.

"నువ్వు తప్పుకో-మరోడొస్తా"డనిసమాధానమా? . అయినవాళ్ళకు నెలలోనే రెండేసి ప్రమోషన్లూ, కాని వారికి కలకాలం ఆకలే...ఈ తక్కువ జీతంలో స్కూలుకి శుభ్రంగా రావాలి. లేకపోతే ఇనస్పెక్టర్ కలంలోని ఎర్రసిరా పర్సనల్ ఫైలుమీద కక్కుతుంది. ఛీ. ఛీ.. ఎవరి నేంచేసినా పాపంలేదు.. ..."

కాఫీతాగుదామనిజేబుతడుముకున్నాడు. కిరాణాకొట్టువాడిచ్చిన బిల్లు తప్ప మరేమీ లేదు. నెలాఖరాయె మరి (జీతాలు రావటం పదిహేనుకి. అయిపోవటం పద్దెనిమిదికి) నిజాని కతడింకొప్పుడైతే విచారించేవాడుకాడు. ప్రస్తుతం ఊహల్లో...అతడు మరీ రెచ్చిపోయినాడు.

'...టీచర్‌కు అప్పుచేయని రోజుండకూడదు కాబోలు. ఉంటే గర్వంవస్తుందనా?.. ఆ ఉన్నాడనుకోబడే దేవుడూ ఇల్లానే అనుకొంటున్నాడా? .ఈ సందర్భంలో. గొప్పఆశలు విడిచినా, సామాన్య వాంఛలూ తీరని ఈ సమయంలో.. ... ఎవడుమాత్రం డబ్బుకోసం ఎందుకు తప్పుదారి తొక్కడు? ... ఎందుకు తొక్క కూడదు . ?'

మూక ఉమ్మడిగా ట్యూషన్లు చెప్పుకొనే కొందర్ని-బహు కుటుంబీకులైనా-తానిదివరకసహ్యించుకోవటం అన్యాయమని ఇప్పుడనిపిస్తోంది. అయితే హెచ్. ఎమ్ కి వాళ్లు కొంచెం కంటగింపయితే.. వెంటనే . పైకి రిపోర్టులు...

అతనింకుమింకు అల్లానే ఆలోచిస్తున్నాడు. స్కూలుకు రోజూ వెళ్తున్నాడు. గడియారం ఖచ్చితంగానే నడుస్తోంది. ప్యూన్ సరిగ్గానే గంటలు కొడుతున్నాడు. రోడ్లమీద కార్లూ జనం యధాప్రకారంగానే నడుస్తున్నారు. కాని.. 'యధాప్రకారంగా' 'రానివీ' 'లేనివీ' వాళ్ళజీతాలే... జీవితాలే ...

* * *

సగంకట్టిన 'ఫౌంటైన్' గట్టుమీద కూర్చుని, అప్పుడే వెల్గిన లైటువెల్గులో ఒక గుమాస్తా, కాడవిరిగిన కళ్లద్దాలజోడును అతిజాగ్రత్తగా తగిలించుకొని 'సెకండ్ హాండ్ పేపర్' చదవటం ప్రారంభించాడు.

'తృతీయ ప్రపంచయుద్ధం వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. లోపల్లోపల్నే మహా ప్రయత్నాలు బ్రహ్మాండంగా సాగుతున్నయ్. అగ్రరాజ్యాలు దీన్ని అరికట్టటానికి బదులు దోహదం చేస్తూండటం మ

★ చెట్లూ - మొక్కలూ ★

శోచనీయం. క్రొత్త క్రొత్త మారణాయుధాలు కనుగొనబడుతున్నయ్. వాటి పరీక్షలూ ఘనంగా జరుగుతున్నయ్. శాంతి కాముకులమని బహిరంగంగా రొమ్ములు విరుచుకు తిరిగే దేశాలే ఈ పనులుచేయటం మరీ ఘోరం. మన ప్రక్కదేశాలే యుద్ధానికి స్థానాలుకావటం మరీ ప్రమాదవిషయం...'

తలగోక్కొని ఆ గుమాస్తా మళ్ళీ ప్రారంభించాడు.

'ఈసారి ప్రపంచయుద్ధంవస్తే మానవత్వం సమూలంగా నాశనం అవుతుందనేది నిర్వివాదం. దీన్ని ఎల్లాగైనా ఆపవలసినబాధ్యత ప్రతి దేశంమీదనేగాక, ప్రతి వ్యక్తిమీదా ఉన్నట్టు భావించటం అత్యవసరం. లేకపోతే, పూజింపదగిన, గర్వింపదగిన, అభిమానింపదగిన అందరి మాతృదేశాలూ నాశం అవటం తథ్యం. ప్రతి మానవుడూ సోదర మానవునితో కలిసి నిజంగా ఈ యుద్ధ నిరోధక యత్నంచేస్తే- ఏ కొద్దో, బలవంతులైనా స్వార్థులైన అగ్రరాజ్యాలవారు ఏవిధంగానూ అడ్డు నిలువలేరు. యుద్ధానికి ముందంజవేసే రాజ్యంలోనే ఈ నిరోధకోద్యమం ప్రథమంగా జన్మించటం తక్షణం కావలిసింది...'

చదువుతూన్న పేపరుతోటే కొంచెంగా విసరుకొని, అద్దాలను సరిచేసికొంటూ ఆ గుమాస్తా మళ్ళీ ప్రారంభించాడు

'.. మనం మరణానికి భయపట్టంలేదు నిజానికెవరూ భయపడకూడదుకూడా. కాని మనం దేనికోసం మరణించాలనేదే ముఖ్యమయిన ప్రశ్న. యుద్ధంకొరకు కాదు, వినాశం కొరకు కాదు, మనం మరణించవలసింది. శాంతికొరకు...మానవత్వం స్థిరంగా ఉండటంకొరకు ... రాబోయే తరాలు సుఖంగా ఉండేందుకొరకు.. '

ఆ గుమాస్తా రోజూ పేపరు చదువుతూనే ఉన్నాడు. పత్రికలు అల్లాంటి విషయాలు వ్రాస్తూనే ఉన్నాయి. విమానాలెగురుతూనే ఉన్నాయి. సినీమాల్లో, 'న్యూస్‌రీల్లు' చూపుతూనే ఉన్నారు. సుహృద్భావ సంఘాలు పర్యటిస్తూనే ఉన్నాయి భూమి తిరుగుతూనే ఉందిమరి.

* * *

"ఈ మొక్కలు పిచ్చివి. తమ మంచి చెడ్డలు తమకు తెలియవుగదా, పైగా చెప్పినా తెలుసుకోలేవు. అంతేకాకుండా తమ పిచ్చి పిచ్చి ఆశలతో, కోరికలతో-చూడబోతే-మమ్మల్ని కూడా నాశనం చేసేట్టున్నయ్" అని చెట్లు విచారపడ్డయ్.

"సుమిత్ర మూర్ఖప్పట్టు పడుతోంది. మంచిచెప్పినా ఏమాత్రమూ అర్థంచేసుకోలేదు. తరాలుగా వచ్చే ఆచార, సంప్రదాయాల్ని నాశంచేసి, ఆ 'కోన్‌కిస్తా' గాణ్ణి పెళ్ళాడుతుందట.. హు...కుటుంబ గౌరవాన్నీ, వంశప్రతిష్ఠనీ, చివరకు నా పేరునూ బూడిద పాలు చేసేట్టుంది." రావు బహద్దరు గారిలో విచార కోపాలు తాండవించినయ్.

"వీడు . వీడి బతుక్కి వీడు . . నన్నే బెదిరిస్తాడా? లక్షమందిని చూచాను. వెధవ ఏమాత్రం ఇంగితజ్ఞానంఉన్నా ఇల్లా అనడు. ఛండాలపు వేషాలూ వీడూనూ...వీడి అంతేమిటో నేనూ చూస్తాను. సమ్మె చేస్తాట...సమ్మె - హు, మేనేజర్‌లో కోపంగట్టు తెంచుకొంది.

బ్రతకటం చేతకాని ప్రతి అణాకానీ వాడూ, బ్రతికే ఆఫీసర్ని, పాలిం ప్రభుత్వాన్నీ అనడమే. చాతయిచేతేమామాదిరి కారాదా?

ఊహు! అది చేతకాదు. అటువంటప్పుడేడుస్తూ మూలన కూర్చోవాలి. వాగడమెందుకు? పైనుంచే పెద్ద తలలు సీత్కారం చేశాయ్.

"కొంచెపు మనుషులూ, కొంచెపు మాటలూనూ, వీళ్ళే ప్రపంచాన్నంతా కిచాటు చేస్తున్నారు. యుద్ధమూ, దానివెంట శాంతీ, తరాలనుండి వచ్చే వరుస. వాటి నీరోజు వీళ్ళాపుతారట...హుం..." పురాతన రాజ్యనీతి ముక్కూ మూతీ విరిచింది.

* * *

"ఇంకా ఈ పాతచెట్లు ముసలిమాటలు వదలిపెట్టవు. ఈ ఋతువెంత ఆనందమైంది! ఆనందించటంచేతకాక — పైగా మనల్ని విచారించమంటున్నయ్. హుం. నిజానికి చెట్లే తోటకు దిష్టి బొమ్మల్లా ఉన్నయ్." మొక్కలు చెట్లను వెక్కిరించినయ్.

"తాతయ్య ఎప్పుడూ ఇల్లాగే అంటూంటాడు. ఇంకా ఎన్నాళ్ళని ఈ ముష్టి ఆచార సంప్రదాయ బంధాల్లో పడిఉంటం? ఛీ... ఛీ...వీటన్నిటినీ ఒక్కసారిగా తెంపేస్తాను. ప్రేమించిన ప్రకాశాన్నే పెళ్ళాడతాను... ఎవరడ్డొస్తారో చూస్తాను," సుమిత్ర దృఢంగా నిశ్చయించింది.

"ఈ మేనేజర్‌గాడెవడంటూ మాకడ్డు పడటానికి. వెధవని ముక్కూ మొగం పగలకొడితేసరి, దారికొస్తాడు.. అంతదూరం ఎందుగ్గాని, వారం రోజుల సమ్మెకు వాడూ, వాడి ఓనరూ ఏమిటి?...వాళ్ళతల్లో జేజమ్మ కూడా కాళ్ళబేరానికి రావలసిందే ..." నరసింహం ఉద్రిక్తుడైనాడు.

"పనిలేకుండా గుప్పిళ్ళకొద్దీ ఇళ్ళల్లో పడుతుంటే వాళ్ళల్లాగే అంటుంటారు .. వాళ్ళది ఒక బ్రతుకే? ..నలుర్ని ఏడ్పించే బ్రతుకు.. కొద్ది రోజుల్లోనే విశ్వబండారం బైట పెట్టిస్తాం" క్రింది చిన్న తలలు ఉరిమినయ్.

"ఈ పూర్వపు మాటలు మేం ఒప్పుకునేది లేదు. వాటన్నిట్నీ నాశంచేస్తాం. మాకు శాంతి కావాలి ... వాళ్ళూ శాంతినే కోరవచ్చు. కాని దుష్టపద్ధతిలో కోరటం జరిగింది. మా పద్ధతి సర్వసమ్మతం ... ఈ దారిలోనే శాంతి తెస్తాం" అధునాతన రాజనీతి ఉద్ఘోషించింది.

* * *

తోటలో—క్రింది భూమి నిశ్వసించింది, పై ఆకాశం కన్నీరు విడిచింది. రెండూ చూపులు కలుపుకున్నయ్. ఆ చూపులు "రైలు పట్టాల్లాగున్న వీళ్లు ఏనాటికైనా కలిసి, సమాధానపడి లోకం బాగుపడేట్టు చేయుశేరా?" అన్నట్టుగా ఉన్నాయి. ★

అసంప్రేక్ష్యకారిత్వము... పంచతంత్రము ...అయిదవ భాగము




... గేయరచన ...
నండూరి. రామమోహనరావు
బొమ్మలు.. బాపు
అందాల వాడలో
అద్దాల మేడలో
ముద్దులాడిని గూడి
ముద్దులాడుదురు
కొన్నాళ్ళకే మాకు
చిన్నారి జన్మించు
తప్పటడుగుల వాడు
తడబడుచు నడుచు
మేడ మీద దాక వాడు
మేఘదూతము చదువ
కాను ముండ నా భార్య
చను దెంచి అనును
అష్టమాసము మీకు
పుస్తకాలే గాని
పాపాయి సంగతే
పట్టించుకోరు
అని పాప నలు దించి
చనుచుండ. కోపించి
పుస్తకము తో నామె
మస్తకము నిట్లు
చితుక గొట్టెద నంచు
చితుక గొట్టను వాడు
నువ్వులుంచిన కుండ
నూరు ముక్కలుగ
చెదరి పోయెను తిలలు
చెదరి పోయెను కలలు
నవ్వులన్నీ తుదకు
నువ్వులై పోయె
ఆశ యను పాశమును
బాప నిక్కము! తొల్లి
చంద్రుడను భూపాల
చంద్రుడే మాయె!
ఎవరా చంద్రుడు
ఏమా కథ?

ఆకాశ చిత్రాలు

ఆర్. యం. చిదంబరం

[తెల్లటిబట్టమీద మసి అంటుకున్నట్టు నిర్మలాకాశంలో అక్కడక్కడా మబ్బులు కమ్ముకున్నాయి. ఉరుములతో వర్షంపడే సూచనలు కనిపించాయి.]

'ఎవర్రా ఆ టక్కులాడి?'

ఏదో నవల చదువుతున్న రమణ వులిక్కిపడి తిరిగిచూశాడు. కళ్ళల్లో నిప్పురవ్వలు చెరగుతూ కాళికామ్మవారిలా కమల దర్శనమిచ్చింది. అతనుకూడా కొద్దిగా కంగారుపడ్డాడు.

'చంపేశావ్ అక్కా!.. మా కాలేజీలో అందరూ 'మిస్ ఇండియా'అని నామకరణం చేసి ముక్కువగా పిలుస్తుంటే నువ్వేమో టక్కులాడి అంటున్నావ్? పాపము శమించుగాక! పోతే ఆమెగురించి వివరాలు-బి. ఏ. మొదటి సంవత్సరం చదువుతూంది మెకానిక్స్ పోర్షన్ బావగారే బోధిస్తున్నారుకనక ఏదైనా సందేహానివృత్తికోసం గురు దర్శనార్థం శిష్యురాలు వచ్చి వుండవచ్చు'అని వ్యాఖ్యానించాడు రమణ.

అతని మాటలు అగ్గిలో ఆజ్యంలా పనిచేశాయి

'ఓహో! . అదాసంగతి' అంటూ వురిమింది

'అమ్మాయ్!. అన్నం మాత్రం వడ్డించి వెళ్ళిపోయావ్!' అంటూ మామగారు వంటింటోంచి కేక వెయ్యగానే లోపలికి పరుగెత్తింది కమల.

కమల యంత్రంలా తనపని తను చేసుకుపోతున్నా ఆమె మనసుమాత్రం గంట క్రితం జరిగిన సంఘటన మీదే వుండిపోయింది 'ప్రకాశం గారున్నారా?' అంటూ ఆ అమ్మాయి అరుగుమీదున్న కమలను ప్రశ్నించింది. ఆ అమ్మాయి సౌందర్యాన్ని రెప్పవాల్చకుండా గమనిస్తున్న కమల వెంటనే సమాధానం యివ్వలేకపోయింది ఆ మధుర స్వరం యేడమెట్లు ఎగ్రబాకి వెళ్ళి ప్రకాశం చెవుల్లో గిలిగింతలు పెట్టింది గామోలు! . అతను చకచకా దిగివచ్చాడు.

'ఓ!. సుశీలా? నువ్విట్లా హఠాత్తుగా దిగుతావని నేను కలలోకూడా అనుకోలేదు. రా! మేడమీదికిపోదాం' అంటూ ప్రకాశం వుత్సాహంతో సుశీలను మేడమీదికి తీసుకుపోయాడు, కమల ఏవీ అర్థం కాక అయోమయంగా చూస్తూ చివరి మెట్టుదగ్గర నిలబడింది. మేడమీది సంభాషణ స్పష్టంగా ఆమె చెవుల్లో పడింది.

'సుశీలా!.. నువ్విట్లా వచ్చుకుంటే చివరికి కథ అడ్డం తిరుగుతుంది. నువ్వివేళ మా యింటికొచ్చేట్టు సూచనగానైనా చెప్పివుంటే, వద్దని ఖచ్చితంగా చెప్పేవాడిని. నాన్నగారు ఏమనుకుంటారు? అంతవరకెందుకు? కమల నన్ను బతకనిస్తుందా? మనం వేసుకున్న కార్యక్రమం సవ్యంగా జరగటానికి ఇది మార్గంకాదు. ఒక్కొక్క మెట్టు ఎక్కాలికాని ఒకేసారి ఎగిరిగంతితే క్రింద పడతాం- అంతే.'

'క్షమించండి ఇంకెప్పుడూ మీ అనుమతి లేనిదే రాను'

కమలకు తనకాళ్లకింద భూమి కదలుతున్నటనిపించింది ఇంక అక్కడ నిలబడలేకపోయింది ఆమెలో చిత్రవిచిత్రాలైన భావాలు మొలకెత్తాయి. నిజంగా ప్రకాశమే ఇట్లా మాట్లాడాడా? ఆమె నమ్మలేకపోయింది. పెళ్ళై సరిగ్గా సంవత్సరంకూడా పూర్తికాలేదు ఇంతలో తనంటే అసహ్యం కలిగిందా? సుశీల కళ్ళముందు మెదిలింది—గుండ్రటిమొహం— కాటుకకళ్ళ చిలిపినవ్వు—యౌవన శోభను ప్రదర్శించేట్టు ఆమె ధరించిన దుస్తులు—కమలహృదయం అసూయతో నిండిపోయింది—పానకంలో పుడకలా ఈ సుశీల ఎక్కడ దాపరించింది? మామగారు భోజనం ముగించుకుని పడకకుపక్రమించారు.

కాలేజికి వెళ్ళిన ప్రకాశం తిరిగివచ్చాడు.

'మరేం లేదు కమలా!.. ఇవేళ సాయంత్రం మనం సినిమాకు వెడదామని ప్రోగ్రాం వేసుకున్నాం కదూ! ఇవేళ సాయంత్రం కాలేజిలో చిన్న ఎంగేజిమెంటు వుంది. దానికి వెళ్ళక తప్పదు పాపం! నువ్వేమో నాకోసం కాచుక్కూచుంటావ్ ఎంత ఆశాభంగం కలుగుతుందో ఆలోచించు! అది చెప్పిపోదామనే తిరిగివచ్చాను కోపం రాలేదు కదా?' అంటూ అటూ యిటూ చూసి (నాన్నగాని, రమణకాని చూస్తారేమోనన భయం) మెల్లిగా బుగ్గగిల్లి 'టా! టా!' అంటూ తిరిగి వెళ్లిపోయాడు

కమల చలనంలేని రాయిలా నిలబడిపోయింది. అతనికి తన మీదున్న అనురాగడి

. అంతరాంతరాల్లోంచి రావటంలేదనే సందేహం ఆమెలో మొలకెత్తినప్పుడు అతని మాటల్నీ, చేష్టల్నీ ఎలా విశ్వసించగలదు? ఎలా సహించగలదు?

మొదట్లో ప్రకాశాన్ని చేసుకోటానికే భయపడింది. అతను కాలేజీలో లెక్చరరని, సగానికిసగంమంది వయసొచ్చిన ఆడపిల్లలే అతని దగ్గర చదువుకుంటున్నారని విని హడలిపోయింది అంతే కాకుండా నూటికి అరవైమంది 'ఆడ పేషర్లు.' ఏ క్షణం ఎలా వుంటుందోనని భయపడుతూనే వచ్చింది.

చివరకు తుఫాను మొదలైందన్నమాట!

* * *

[ఆకాశమంతటా మబ్బులు కమ్ముకున్నాయి చిన్నగాలివిసురు కూడా మొదలైంది. భీకరంగా గగనం గర్జింపసాగింది.]

గడియారం ఏడు గంటలు చూపెడుతోంది.

భర్తకు అత్యంతప్రియమైన ఆకుపచ్చ చీర కట్టుకుని గులాబీరంగు వెల్వెట్ చోళీ తొడుక్కుని-కళ్లకు కాటుక పెట్టుకుని అతని రాక కోసం ఎదురుచూస్తూ నిలబడింది కమల. ఆమెకు జ్ఞాపకం వున్నంతవరకూ ఒక్కనాడు కూడా భర్త ఇంటికి రావటానికి ఇంత ఆలస్యం చేయలేదు. పరిస్థితులన్నీ ఆమెకు ప్రతికూలంలా కనిపించాయి. ఒక్క సంవత్సరంపాటు కష్టపడి పునాదులువేసి నిర్మించిన ఆశాసౌధాలన్నీ అథఃపాతాళానికి క్రుంగిపోతున్నట్టనిపించాయి.

గోడగడియారం ఎనిమిది కొట్టింది.

కాని ప్రకాశం రాలేదు. సినిమాకు వెళ్ళటం వీలుపడకపోయినా కనీసం షికారన్నా వెడదామనుకుంది. ఒకవంక ఉడుకుమోత్తనం—మరోవంక ఆశాభంగం మూలంగా పెల్లుబుకుతున్న దుఃఖం.

చివరకు రవణే తిరిగొచ్చాడు.

'ఒరేయ్ రవణా!.. నీకు ఇంటిసంగతి జ్ఞప్తివుందా?.. అచ్చోసిన ఆంబోతులా వూరంతా తిరుగుతున్నావే?' అంటూ తన కోపాన్నంతా అతనిమీద వెళ్ళగక్కింది.

'అదేవి టక్కా!...ఒకవేళ నాకు జ్ఞాపకం లేకపోయినా ఆత్మారాముడు వూరుకుంటాడూ!. అసలు జరిగినసంగతిది... పాపం! నువ్వీ వార్త విని ఇంకా బాధపడతావని నాకు తెలుసు-అయినా ఏం చెయ్యను? చెప్పకతప్పదు. అది నా విధి. కాలేజీ విడిచిపెట్టాక తిన్నగా గాంధీపార్కుకు వెళ్లాను. ఏదో స్పెషల్ రేడియో ప్రోగ్రాం వుందని. అందుచేతే ఆలస్యమైంది... అన్నట్టు అక్కడ బావగారిని చూశాను.'

'ఓహో!..ఇదేగా మోలు ఎంగేజిమెంటు!' అంటూ బుసకొట్టింది కమల.

'అంతా పూర్తిగా విను మరి.. బావగారితోపాటు మిస్ ఇండియా కూడా వుంది.'

'ఏవిటి?' కమల కంఠంలో వణుకు వినిపించింది.

'అదే!. నా క్ష్మీకరించి చెబితే బావగారూ, సుశీల కలిసి గాంధీపార్కులో చలటి పిల్లగాలుల సౌరభాన్ని గ్రోలుతున్నారు' అంటూ తన వ్యాఖ్యానాన్ని ముగించి ఇంట్లోకిపోయాడు.

వెయ్యి పిడుగులు నెత్తిమీదపడ్డట్టు కమల అక్కడే కూలబడిపోయింది. పోనీ, మామగారితో చెబితేనో!.. ప్రకాశానికి తన తండ్రంటే అపరిమితమైన భయమన్న సంగతి కమలకు బాగా తెలుసు. కాని ఇంతటి స్వల్పవిషయానికి ఫిర్యాదుచేస్తే బాగుంటుందా? అదీకాక చివరకు తన సందేహాలు నిరాధార సందేహాలవుతాయేమో!...చివరకు కంగారు పడకూడదని నిర్ణయించుకుంది.

ప్రకాశం తొమ్మిదిగంటలకు ఇల్లు చేరుకున్నాడు.

రోజూ సరదాగా కబుర్లు చెబుతూ వడించే కమల మౌనంగా వున్నప్పటికి అతను మాత్రం వుత్సాహంగా చెప్పుకుపోయాడు.

"ఇంటికి రావటం ఆలస్యమైనందుకు నీకు కోపంగావుంది కదూ!.. ఇవేళే నాకు ఓ ప్రైవేటు దొరికింది. లక్ష్మీవస్త్రంతే, మోకాలు అడ్డం పెట్టట మెందుకని ఒప్పుకున్నాను. అందుకే ఆలస్యమైంది - ఇంక ప్రతిరోజూ ఇంతే ననుకో!.. అన్నట్టు పొద్దున్న ఓ అమ్మాయి వచ్చింది చూశావా! అప్పుడే చెబుదామనుకుని మర్చిపోయాను. ఆ అమ్మాయి నాస్టూడెంటు-ఆమెగుణగణాలు ఉత్తమోత్తమమైనవి. వృథాగా అపోహలు పడతావని నా భయం.'

'ఇన్నాళ్లూ మీ మాటలు విశ్వసించాను. ఇకముందు నా జాగ్రత్తలో నేను ఉండకపోతే మొదటికే మోసం వస్తుంది' అని కమల తీక్షణ వీక్షణాల హెచ్చరికను అతను గమనించనే లేదు.

* * *

[ఉరుములు ఎక్కువయ్యాయి ఎక్కడో రెండుమూడు పిడుగులు పడేవుండవచ్చు. కళ్లు చెదరేటట్టు మెరుపులు—'ఇంక ఏ క్షణంలోనైనా బ్రహ్మాండమైన వర్షం పడవచ్చు' అన్నట్లుగా వుంది ప్రకృతి.]



★ ఆకాశ చిత్రాలు ★

మధ్య రవణకే తచ్చిపడింది చిక్కంతా.

తనకు ప్రకాశంమీద కలుగుతున్న సందేహాల నివృత్తికోసం కమల అతన్ని వుపయోగించుకోసాగింది.

'ఒకేయ్ రవణా! నాకేమో అనుమానముగా వుంది. ఆయన తత్వం తీరు—అంతా మారిపోయింది. ఆయన ఎక్కడ యెవరికి ప్రైవేటు చెప్పేదీ నువ్వ కనుక్కు రావాలి' అంది కాలేజీకి బయలుదేరుతున్న తమ్ముడితో.

'బాగుంది!...ఈ అపరాధ పరిశోధన నావల్లకాదు. అంటూ ఖచ్చితంగా చెప్పేసినా అతని మనసుకూడా కీకుక్కు తింటోనే వుంది.

సాయంత్రం కాలేజీ అయిపోగానే బావగారికి తెలియకుండా ఆయన్ని వెంబడించాడు. మధ్యలో ప్రకాశం కాఫీ హోటల్లో దూరి అరగంటయ్యేవరకూ బయటకు రాకపోవటం వలన రవణ ఏడుస్తూ రోడ్డువార తపస్సు చేయాల్సివచ్చింది.

సందుగొందులన్నీ దాటి ప్రకాశం ఓ చిన్న ఇంటోకి మాయమవటంతో ఇల్లు గుర్తుపెట్టుకుని రవణ వెనక్కి తిరిగాడు.

నాలుగడుగులు వేయకముందే అతని మిత్రుడొకడు భుజంమీద గట్టిగా చరచి 'ఎవరూ!...రవణేనా ఇలా షికార్లు తిరుగుతున్నది! అయితే ఇవేళ పిడుగుల్తో వర్షం పడాల్సిందే!' అని ఎత్తిపొడిచాడు.

'వేళాకోళాలు కట్టిపెట్టు...అదుగో కనపడుతూంది చూశావా? ఆ పెంకుటింట్లో మన కాలేజీలో చదివే విద్యార్థు లెవరైనా వున్నారా!'

రవణ తనవాక్యం పూర్తిచేయకుండానే మిత్రుడు భూగోళం బ్రద్ధలైనట్టు నిమిషంపాటు నవ్వాడు.

'భలే!...భలే!.. నీ కథ చాలాదూరం వరకూ వెళ్ళిందన్నమాట! ఆ యింట్లోనే మిస్ ఇండియా వుంటోంది. మీ బావగారు ఆమెకు ప్రైవేటు కూడా చెబుతున్నారు. మధ్య నీ పోటీ ఏమిటి? పలాయన మంత్రం పఠించు' అంటూ మళ్ళీ నవ్వడం మొదలెట్టాడు. పొంగివస్తున్న కోపాన్ని ఏలాగో అరికట్టాడు రవణ!...

ఛీ!.. చదువుకుంటే మాత్రం ఏంలాభం? సంస్కారం వుండక్కర్లేదూ! చివరకు మానాభిమానాలు గాలిలో కలిసిపోతాయి గామోలు!.. బావగారిమీద మొదటిసారిగా అతనికి అసహ్యం కలిగింది. ఇంటికి తిరిగొచ్చి పూసగుచ్చినట్టు కమలకు వివరించాడు. కమల కూడా 'అటో-ఇటో తేల్చేయాలనుకుంది.

* * *

[పెద్ద గాలిదుమారం రేగటంతో మబ్బులన్నీ చెదిరిపోయాయి. ఆకాశం తిరిగి తెల్లటి బట్టలా స్పష్టంగా తయారైంది. ఒక్క వాన చినుకుకూడా పడలేదు.]

మామూలుగా ప్రకాశం తొమ్మిదిగంటలకు వచ్చాడు.

'ఏమిరా ప్రకాశం!... మీ పెదనాన్న కూతురు—పెద్దమ్మ ఈవూళ్ళోనే వుంటున్నారట!.. నిజమేనా?' అని తండ్రి అడిగేసరికి ప్రకాశం హంతకుడిలా మొహంపెట్టి 'నాకు తెలియదే!' అన్నాడు.

'నీ కలాంటివన్నీ ఎక్కడ తెలుస్తాయిష్? పాపం! అన్నయ్య చనిపోయాక వాళ్ళకుటుంబస్థితి బాగా దిగజారిపోయిందట!...ప్రస్తుతం ఎంత బాధపడుతున్నారో! ఆఅమ్మాయి కాలేజీలో చదువుతూందట!.. జరిగినదంతా మర్చిపోదాం. వాళ్ళను రేపే మనింటికి తీసుకురావాలి – అందరూ కలిసివుండటమే మేలు! రేపు త్వరగా ఇంటికి వచ్చేయి.

ప్రకాశం తన చెవుల్ని తను నమ్మలేకపోయాడు.

'నిజంగానా నాన్నా!' అని అరిచాడు.

'నేను వేళాకోళానికైనా అబద్ధమాడను'

కమల కీ 'నాటక' మేమీ బోధపడలేదు.

'ఏమిటం డిది?' అ నడిగింది.

'చెప్పడం మర్చిపోయాను. నాన్నకూ పెదనాన్నకూ తీవ్రమైన మనస్పర్థ లుండటం వలన రెండు కుటుంబాలమధ్య రాకపోకలుండేవి కావు ఆవేళ వచ్చిందికదూ సుశీల! జ్ఞాపకంవుందా?.. ఆమే మా పెద్దమ్మ కూతురు—! 'సుశీల మీ చెల్లెలా!...నాతో ఒక్క ముక్కైనా చెప్పలేదే! నేను విపరీతార్థాలు సృష్టించుకుని మనసు పాడుచేసుకున్నాను'

కమలకళ్లు ఆనందబాష్పాలతో నిండిపోయాయి.

'సరే!...ఆడదానినోట ఆవగింజయినా దాగదట!...

నీతో ముందే చెబితే అది కాస్తా నువ్వు నాన్నకు అందజేస్తావు.

ఇంతకీ మధ్య నీబాధేమిటి?'

కమల అంతా వివరించింది.

అంతావిని ప్రకాశం పకపక నవ్వాడు. రవణ, కమల కూడా అతన్తో కలిశారు. ★

సోషల్ స్టడీస్

మా హైస్కూలులోని యస్. యస్. యల్. సి. విద్యార్థులమంతా పబ్లిక్ పరీక్షలకు బందరు వెళ్లవలసిన ఖర్మం పట్టింది. నేనొకరోజు ముందుగానే బయలేరి రామానాయుడుపేటలో ఎరుగున్న వెంకాయమ్మ బామ్మగారింటికెళ్లాను. ఆవిడ నన్ను చూడగానే ఎంతో ఆప్యాయంగా లోపలకు తీసుకెళ్ళింది. సుమారు అరవైయ్యేళ్లుంటాయి. అయినా ఆవిడ బాగాబలంగానే వుంది. నెత్తిమీదున్న ఆ ముసుగును చూచిన వాళ్లకి విధవ అని వేరేచెప్పక్కరేదు. క్షేమ సమాచారాలన్నీ అయ్యాయి. వీధిగది ఖాళీగానే వుంది. దాంట్లో చదువుకోవచ్చును. మరేం సిగ్గుపడమాకేంబాబూ అందినవ్వుతూ.

మొదటిరోజున ఇంగ్లీషు రెండు పేపర్లూ అయిపోయాయి. అవాళ రాత్రి సోషల్ స్టడీస్ చదువుదామని పుస్తకం తీశాను. బామ్మగారు కూడా గదిగుమ్మానికెదురుగుండా మంచంమీద కూర్చున్నారు. ఇక నేను "తుండము నేకదంతమును" అని ప్రార్థన మొదలెట్టాను. ఏంనాయనా నీకు భగవద్భక్తి కూడా వుందా అని అడిగిందావిడ నవ్వుతూ "అయ్యో, పరీక్షల్లోనే దేవుడిమీద ఎక్కువభక్తి వుండాలండీ బామ్మగారూ" అనేశాను గబుక్కున. ఆవిడ నవ్వి ఊరుకొంది.

ఇక నేను గట్టిగా చదవటం మొదలెట్టాను. "కందుకూరి వీరేశలింగం పంతులుగారు వీరు 1848 వ సంవత్సరములో జన్మించిరి. శ్రీ పంతులుగారు సంఘ సంస్కరణమునకును, విద్యాభివృద్ధికిని చేసిన సేవ వర్ణింప నలవికాదు. వీరు 1910 వ సంవత్సరములో నిర్యాణ మొందిరి". చదువుతున్న పాఠాన్ని ఆపి ఒకసారి బామ్మగారివంక చూశాను. ఆవిడ కళ్లవెంట నీళ్ళు కారుతున్నాయి.

"ఏమండీ బామ్మగారూ కళ్లల్లోఏమన్నా పడిందా" అని అడిగాను.

"అబ్బే వూరికే కారుతున్నా" యంది కళ్ళు తుడుచుకుంటూ. కానీ యీసారి బాగా కారుతున్నాయి. ఈసారావిణ్ణి మళ్ళీ అడిగాను. ఆవిడకు అసలు విషయం చెప్పక తప్పిందికాదు. సరిగా 1910 వ సంవత్సరంలో ఆవిడపెళ్లింతో ముచ్చటగా జరిగిందట, తల్చుకుంటుంటే యిప్పు డేడుపొస్తోందిట. అయినా 'ఎన్నేళ్లైతేమో శుభమా అంటూ పెళ్ళి జరుగుతే యీవిడగారు యిప్పుడేడుస్తుందేవిట్రా దేవుడా' అనుకున్నాను.

నేను మళ్లీ పాఠంలోకి దిగాను. "గాంధీ మహాత్ముని నాయకత్వమున దౌర్జన్యరహిత సహాయ నిరాకరణోద్యమము ప్రారంభమయ్యెను. ఇది అపూర్వవిధానము. అన్ని మతములవారు కలసి బ్రిటిషుప్రభుత్వ శాసనములను ధిక్కరించి జైలుశిక్ష ననుభవించిరి" మళ్లీ ఏం కొంపమునిగిందోనని బామ్మగారి వంక చూసేసరికి నిజంగానే అనుకున్నంత పనీ అయింది. కళ్లు రెండు జ్యోతుల్లా వున్నాయి. కళ్లవెంట జలపాతాల్లా నీళ్లు కారుతున్నాయి. నాకు వంటినిండా చెమట్లు పోసేశాయి. ఎట్లాగో ధైర్యంచేసి బామ్మగారూ మళ్లీ ఏం గుర్తుకొచ్చిందీ. పెద్దవారు కదా మీరుకూడా జరిగిపోయినవాటిని గూర్చి అట్లా ఏడుస్తే ఎట్లా చెప్పండి" అన్నాను వచ్చేకోపాన్నీ, నవ్వునూ ఆపుకుంటూ.

గురజాడ వేణు

"ఎట్లా మర్చిపోను నాయనా, సరిగా నీవిప్పుడు చదివింది జరిగినప్పుడే మీ తాతగారు కూడా ఆ తాతగారి వెంట వెళ్లేసరికి వడుం మీద లాఠీవడ్డించేశారా ఎఱ్ఱటోపీ వాళ్లు. తల్చుకుంటే ఆ దెబ్బలు యిప్పుడు కూడా కళ్లముందు కన్పిస్తున్నాయి." అని కాస్సేపు ఏడ్చి ఒకసారి మొఖము కళ్ళూ తుడిచేసుకొంది. ఆవిడ జ్ఞాపకశక్తికి నాకాశ్చర్యమేసింది.

నాకు గట్టిగా చదువుతేగాని అర్థమై చావదు. ఇంకెక్కడైనా చదువుకుందామా అనుకుంటే దగ్గర్లో నన్నెరుగున్నవాళ్లెవరూ లేరు. ఇట్లా కొంచెంసేపాలోచించి బామ్మగారివంక చూసేసరికి అట్లాగే కూచునివుంది మట్టిబొమ్మలా మంచంమీద. మధ్య పేజీలేవీ చదవకుండానే చివర పేజీ తీసేశాను. ఇక అయిపోవచ్చింది కదా అని యింకా గట్టిగా చదవటం మొదలెట్టాను. కానీ యీసారి చదివేది పెళ్ళిళ్ళు, దెబ్బలు గుర్తుతెచ్చేదికాదు. మంచిదే తీశాను. ఆ పాఠంపేరు "స్వరాజ్యసిద్ధి." "ఇంగ్లీషువారు 1947 వ సంవత్సరములో ఇండియన్ ఇండిపెండెన్సుయాక్టు చేసి 15-8-1947 న ఇండియాకు స్వాతంత్ర్యము నిచ్చిరి." అని ముగింపబోయేంతలో బామ్మగారు మంచంమీదనుంచిలేచి "ఓరి దేముడో, ఓరిదేముడో, నా ప్రాణనాథుడినేంచేశావురో, నన్నెందుకుంచావురో" అని శోకాలు పెడుతూ గొంతు లెయ్యడం మొదలెట్టింది. చుట్టుప్రక్కలవున్న వాళ్లంతా పరుగెత్తుకొచ్చే సరికి నాకు గుండె ఆగిపోయినంత పనైంది. వాళ్లంతా బామ్మగార్ని ఓదార్చి అసలు సంగతి అడిగితే ఆవిడిలా చెప్పింది: సరిగా 1947 వ సంవత్సరం ఆగష్టు 15 వ తేదీన ఆవిడగారి భర్త చనిపోయాట్ట. అదీ అసలు విషయం. నేను శుభమా అని "స్వరాజ్యసిద్ధి" అనే పాఠం చదువుతే యీ ముసలాడకి చావు సంగతి గుర్తుకొచ్చింది. ఇంక నేనా యింట్లో వుండదలచుకోలేదు. తెల్లవారిన తర్వాత నామకాం హోటల్లోకి మార్చేశాను. వెంకాయమ్మగారి జ్ఞాపకశక్తిని చూస్తే నాకిప్పటికీ ఆశ్చర్యంగానే వుంది. ఇంతకూ యిదంతా ఆ "సోషల్ స్టడీస్" మూలంగా వచ్చిందని అప్పుడప్పుడు నాలో నేనే నవ్వుకుంటూంటాను. మరచానండోయ్ నేను మాత్రం సోషల్ స్టడీస్ పరీక్ష బాగానే వ్రాశాను. ★

చెమట దుర్గంధమునకు, సామాన్య చర్మ వ్యాధులకు
వైజ్ఞానికంగా సరి క్రొత్తగా కనిపెట్టబడినది

ఎక్టమర్

ఇప్పుడు భారతదేశమందు, సౌందర్యమునిచ్చు సబ్బులో నున్నది

చర్మ క్రిములను చంపునట్టి ఔషధములు. మంచివి. పెద్దవి చాలా కాలమునుండియు తెలిసియున్నవే క్రొత్తదేమిటనగా, చాలా కాలము నిలవుండునట్టి గుణము గలది అట్టి కనిపెట్టబడినది. మాన్‌సెన్‌టో వారి 'ఎక్టమర్' (ట్రైత్యోవాల్) ఈవాడు. మీరు భారతదేశమందు 'ఎక్టమర్'తోగూడిన టాయిలెట్ సబ్బును కొనగలరు: అది బ్రీజ్: ఆలోచించండి — మీరు ప్రతి రోజూ ఉపయోగించుచూ బ్రీజ్‌ను 3 బిళ్లలవరకూ మాత్రమే వాడిన తరువాత మీ చర్మము దాదాపుగా క్రిమిరహితమైన దగును మీరు క్రిమిరహితమైన చర్మమువల్ల ఏమి లాభమును పొందెదరో దిగువ వివరింపబడినది.

* చెమట దుర్గంధము తొలగింపబడును — చర్మ క్రిములు దానిని కలిగించును
* చర్మ వ్యాధులనుండి రక్షణ — ఈ క్రిములు సామాన్యమైనట్టి అనేక చర్మ వ్యాధులను గలిగించును.

మీరు బ్రీజ్‌ను ఇష్టపడెదరు — దీని విషయంలో కొంత ఎక్కువ ప్రత్యేకత గలదు. ఇది పరిమళమైనట్టి, శమనకరమైన. సౌందర్యమునిచ్చు సబ్బు. ఇది చర్మమును కాపాడునట్టి 'ఎక్టమర్'ను గలిగియున్నది. బ్రీజ్ ఇతర సబ్బులకంటె కొంచెమే ఎక్కువ ఖరీదుండును. మీరు దీనిని చాలా కాలము వరకూ ఉపయోగించుకొనవచ్చును.

నేడే బ్రీజ్‌ను కొనుడు



బ్రీజ్
టాయిలెట్ సబ్బు
'ఎక్టమర్'ను గలిగియున్నది

ఇరాస్మిక్ కంపెనీ లిమిటెడ్: లండన్. వారి తరఫున భారతదేశంలో తయారుచేయబడినది BZ. 4-X62 TB.

వనితా లోకం

★ పాము నాలుకలు ★

"ఏమండీ పిన్నిగారూ! కోడలు వచ్చిందా? ఊరునుంచి? కులాసాగావున్నాడు కదూ పాప?" అన్నాను "ఆవిడ" గారితో ఊసుపోక! వెంటనే ఓ గ్రాంథోను రికార్డులా చెప్పేసింది! "ఆ! వచ్చిందమ్మా! వస్తేనేం, పోతేనేం? నాకేం సుఖమా—బండలా? ధావుచాకిరీ నే చెయ్యాల్సిందేగా ఎప్పుడైనా! ఆవిడో మహారాణి అయిపాయె! ఏందోలే చెప్పుకుంటే సిగ్గుచేటు!"

ఇక కోవ చెప్పటానికి ఇష్టం లేనట్టుగా మొహం పెట్టేసిందావిడ. నాకు నిజంగా పట్టరాని ఆశ్చర్యం వేసింది—ఏమిటా ఈవిడగారి మనస్తత్వం అని కాస్సేపు మనస్సులో విస్తుపోయా! సరిగ్గా సంవత్సరం క్రిందట వాళ్ళకోడలు కాపురాని కొచ్చిన కొత్తలో ఈవిడగారి నోటివెంటే ఈ క్రింది మాటలు విన్నాను. "నిజంగా అమ్మాయ్ నువ్వు నమ్ము, నమ్మకపో మా కోడలు బంగారు తల్లి అమ్మా! నా అదృష్టంకొద్దీ దొరికింది! ఇంటెడు చాకిరీ నా చెయ్యి తగలకుండా సర్దుకు పోతుంది పిచ్చికళ్లాలు ఇంతకూ మావాడిపూజలు బాగున్నయ్!" అని

మరి ఈ సంవత్సరం లోపల వాళ్ల కోడలు (బంగారు తల్లి) కాస్తా అలా ఘోరదుర్మార్గురాలుగా (ఆవిడ దృష్టిలో) మారిపోవడానికి కారణం ఏమిటా? అని కాస్సేపు ఆలోచిస్తే—ఆవిడ నాలుక మినహా నాకేమీ అంతు చిక్కలేదు ఓ 10 రోజుల క్రిందట రైల్లో నేనూ వాళ్ళకోడలూ కలుసుకున్నాం మునుపు ఎలా చనువుగా, అలా జాలంగా వుందో ఇప్పుడూ అల్లాగే వుంది ఆ అమ్మాయి పద్ధతిలోగాని, ప్రవర్తనలోగాని ఏమాత్రం భేదం నాక్కనిపించలేదు! మరి వాళ్ళత్తగారి నాలుకమీదపడి ఆవిడో రాణి అయిపోయింది పాపం!

ఇలాటివాళ్లు ఒక్క ఆడవాళ్ళల్లోనే కాదు—మొగవాళ్ళల్లో కూడా వున్నారు. మొదట్లో ఓమనిషినిగాని వస్తువునుగాని పొగడ్తతో ఎదుటి వాళ్ళ చెవులు చిలుము పట్టేలా మాట్లాడ్తారు తీరా కొత్త పాతబడేసరికి మళ్ళీ ఆ పొగడ్త కాస్తా కోపం రూపంగానో, తిట్టరూపంగానో ఎదుటివాళ్ల చెవులకు పట్టిన ఆ మునుపటి తుప్పు వదిలేలా చెప్తారు చాడీలు ఇలాంటివాళ్ళ మాటలు అసలు "మాటలు"గా లెఖ్క వేసుకున్నంతబాధ ఇంకోటి లేదు ఎందుచేతంటే వాళ్ల నాలుకలు ఏగాలికి ఆచాప ఎత్తుతాయి మా వాళ్లావిడకూడా ఒకామెవుంది అల్లాగే ఎదుటకూచున్నంతసేపూ వాళ్లను ఇంద్రుడు-చంద్రుడంటూ పొగడేస్తుంది తీరా వాళ్లు లేచి పోయాక "చూచవూ వుతిపనికిమాలిన వాళ్లు" అంటూ ఓ సర్టిఫికేటు పారేస్తుంది! మరి ఇలాంటివాళ్ళ మాటలతో మన లెఖ్క వేసుకుంటే ఏమన్నా ప్రయోజనం వుంటుంది?

పవని నిర్మల ప్రభావతి

అసలదేమిటో అలాటి వాళ్లది అదోరకం మనస్తత్వం. బహుశా వాళ్లకు మతి స్థిరంగా వుండదేమో అనే ఆలోచన కూడా వస్తుంటుంది అప్పుడప్పుడూ నాకు లేకపోతే మొదట చూడగానే ఎదుటివాళ్లల్లో లేని పోని ఆదర్శగుణాలు ఎలా కనిపిస్తాయ్? తీరా పాతబడేసరికి ఆగుణాలే మా చెడ్డగుణాలలాగా ఎలా తారుమారుఅవుతాయ్. ఇందులో ఏదో కీలకముండాలి ఆ కీలకమంతా వాళ్ళ ఆనరంలేని నాలుకవుంది చూచారూ? దాన్లోనే వుంటుంది.

అందరికీ నరంలేని నాలుకే అనుకోండి .. కాని మనం దాన్ని ఎటంటే అటువూర్తిగా వంగిపోకుండా అదుపులో వుంచుకుంటాము. కొన్ని వాళ్లు అలా వుంచుకోలేరు-వుంచుకోరుగూడా! ఒక్కొక్కప్పుడు పాము నాలుకలా చీలి రెండు రకాలూ ఒకేసారి మాటలాడుతుంటారు మరి అప్పుడు మరీ తమాషాగా వుంటుంది వాళ్లధోరణి నిజంగా అది ఓకళేనేమో!

ఇప్పుడు ఈ నిముషాన సకల సద్గుణ సంపన్నమైనదని ఓవస్తువునుగాని—మనిషినిగాని మెచ్చుకుని-మరునిముషంలో దాన్ని పరమ పాపిష్టి - పాపభూయిష్ఠమైనదంటూ సరైన వ్యతిరేకపు తర్జుమా చెయ్యాలంటే మరి ఎంతేనా నేర్పు వుండొద్దూ! కాని ఇలాటి నేర్పు వుండేవాళ్ళకు వచ్చిన చిక్కేమిటంటే ఒకసారి, రెండుమార్లు వినే వాళ్లు వాళ్ళమాటలను ఓపికలో ఓర్పుతో వింటారుగాని-మూడోసారి నుంచి-"ఇదేమిటని" మొహాన అడగటమో, "వెధవఫీడ" లెమ్మని తప్పుకుపోవటమో జరుగుతుందే కానీ-మనస్సుంచి వాళ్ళమాటలు ఎవ్వరూ వినరు—లెక్క పెట్టుకోరు సరిగదా-అసలటు వేపే పోరు.

ఎలా అయినా ఈ పామునాల్కుకల వాళ్లంటే చాలా కష్టమే! అయితే మనం ఏం చెయ్యగలం? ఒకవేళ ఎవరైనా ఉండబట్టలేక ఘట్టిగా అంటే వాళ్ల భావప్రకారం ఆ అన్నవాళ్లు మెడమీద తలకాయ లేకుండా తలక్రిందుగా వుండేవాళ్లన్నమాటే! వెంటనే ఆ అన్న వాళ్లమీద ఓ రిమార్కు తయారుచేస్తారు చేసేస్తారు ఏంచేస్తాం అసలలాటి వాళ్లనూ - వాళ్ళమాటలనూ సాధ్యమైనంత వరకూ లెక్క పెట్టుకోకుండా వుంటే అసలు చిక్కువుండదు వాళ్లనో పిచ్చివాళ్లు అనుకునేది. అంతే!

అందరి నాలుకలూ నరంలేనివే అయినా ముఖ్యంగా పైన నే చెప్పిన పామునాలుకల్లా మాట్లాడరు అందరూ! మనం ఎవరన్నా ఓ వ్యక్తినిగాని, వస్తువునుగాని ఓసారి చూచినా, 10 మార్లు చూచినా, ఒకేవిధమైన అభిప్రాయంతోటే వుంటాం-నిజంగా ఆ వ్యక్తిలోగాని, వస్తువులోగాని మార్పు వచ్చినా కూడా అంతగా పట్టించుకోము

(49-వ పేజీ చూడండి)



లేడి యోకవర్ డిజైను — ఇ. నిర్మల.

★ వానాకాలం వచ్చింది ★

ఎండాకాలం పోయి వర్షాకాలం వచ్చింది.

ఎండాకాలంలో ఎండిపోయిన ఆకులు రాల్చిన చెట్లన్నీ మళ్ళీ చిగురిస్తాయి వచ్చే రెండుమూడు నెలలు వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. గనుక పెరట్లో ఏ చెట్లు వేసినా చక్కగా పెరుగుతాయి. ఆభరణాలు లేని స్త్రీ, మొక్కలు లేని ఇల్లూ ఒక్కలా, కళావిహీనంగా కనబడునని పెద్ద లంటారు. ఇంట్లో పెద్ద పెరడున్నవారు మొక్కలు రకరకాలుగా పెంచుకోవచ్చు. పూలమొక్కలు ఒక ప్రక్క, క్రోటన్సులు ఓ ప్రక్క, కాయగూరలు ఓ ప్రక్క అనేక రకములుగా పెంచుకోవచ్చు. చిన్న పెరడున్న వారు దానిని శుభ్రం చేసుకొని వున్నదానిలో చక్కగా మొక్కలు వేసుకుంటే ముచ్చటగా వుంటుంది. ఇంకపోతే పెరడు లేని వారు గోలెములలో మొక్కలు వేసుకొని పెంచుకోవచ్చు. స్త్రీలు, పిల్లలు, పురుషులు అందరూ తోటపని చేయవచ్చు. రోజూ సాయంకాలపు వేళ ఓ అర్ధగంట తోటపనిచేస్తే వంటికి మంచిది. ఇల్లు శుభ్రంగా పచ్చటిమొక్కలతో కళకళలాడుతూ వుంటుంది.

జి. రంగనాయకి

పూల మొక్కలు అనగా చేమంతి, కనకాంబరం, మల్లి, గులాబి మొదలగునవి ఇప్పుడే వేస్తారు. చేమంతి అంట్లు కట్టి వేస్తారు. మొక్కలు బజారులో కూడ అమ్ముతారు. చేమంతిలో అనేకరకములున్నాయి. తెల్ల చేమంతి ఎఱ్ఱచేమంతి మొదలగునవి. కనకాంబరం విత్తనాలు చల్లుతారు. ఈ విత్తనాలు చల్లి వాటిమీద మన్ను పలుచగా జల్లి

పనిలేని మంగలి

క్షాలాన్ని సక్రమంగా వినియోగించకపోతే దుష్ఫలితాలు అంకురిస్తాయి గ్రామాల్లో మగవాళ్ళ తీరిక సమయం కొన్ని విధాల వృధాచేస్తే స్త్రీలు వేరొకవిధంగా తమ కాలాన్ని వ్యర్థపరుస్తున్నారు.

మా అక్క విషయం. ఏదైనా మాట్లాడటం భయం రోజంతా ఆ విషయాన్ని సాగదీస్తుంది. రోజులు, వారాలు, నెలవరకు ఆ విషయాన్ని విడువదు అంటే నమ్మండి

తమ్ముడు పదిరూపాయల పెన్ను పారేశాడు ఇంట్లో అందరికీ తెలిసిపోయింది. కాని రోజూ ఎవరిదగ్గరకో ఒకరిదగ్గరకు వచ్చి సోది మొదలెడుతుంది.

"అబ్బ! ఎంతమంచిపెన్నో. పదిరూపాయలు గంగలో పోశాడు. సంపాయించి తీసుకొస్తే అబ్బాయి గాడికి నిర్లక్ష్యంగా ఉంది"

ఈ పెన్ను కథను అనేక రకాలుగాఅల్లి కనీసం పదిరోజులైనా నెత్తిన నోరుపెట్టుకుని వచ్చినవారికీ. దారినిపోయినవారికీ చెప్పిందంటే అతిశయోక్తి లేదు

అపరాధాలకుకూడా అతిశయోక్తి తగదు

సమాజంలో జరుగు అనేక చెడుపనులను కూడా—ముఖ్యంగా వ్యక్తుల అపరాధములనుకూడా— గోరంత కొండంతలుచేసి చెప్పుకోవడం భావ్యం కాదేమొ

ఒక అబద్ధాన్ని పదిసార్లు పలికితే నిజమౌతుందన్న గోబెల్సు ప్రచారంవలె అబద్ధాలు కూడ నిజం కావచ్చు. వీటినే పుకార్లు అంటాము. తప్పులుచేయడం సహజమే మంచిని ప్రచారంచేస్తే మంచిచేసినవారిని ఆదర్శప్రాయంగా తీసికొని మిగతావారుకూడా మంచిపనులను చేస్తారు. 20 మైళ్ళ దూరములోని మా బంధువుల గ్రామంలో ఒక అమ్మాయి ఎవరితోనో లేచిపోయిందట. ఆ మాట అంత అవసరమైనది కాదు. ఐనా

చంద్రభారతి

ఒకసారి చెప్పుకుంటే సరిపోతుందేమో. కాని మా అక్క, పక్కింటి పిన్నిగారు హాజరైన పదహారుమంది సమావేశంలో— మా అక్కగారు ఆ అమ్మాయి చరిత్రను అనర్గళంగా, అద్భుతంగా, అమోఘంగా, ఉన్నవికొన్నీ, లేనివికొన్నీ అల్లి చమత్కారంగా ఉపన్యసిస్తుంది. ఆ సభ్యులంతా పాపం, రోజూరోజూ యిలాంటి క్రొత్త వార్తలకోసం మా అక్క మొహం చూస్తుంటారు ఇది నేటి స్త్రీ లోకం

మంచి గురించేనా ·

మంచిని చెప్పుకోనుటకైనా హద్దుండాలి. చేసేపనిని మర్చిపోయి గంటలతరబడి

బాగుకూ ఉంటే మనం అభ్యాసం తిని ఆచరణలో చూపించగలే దప్పుడు మాటలు కోటలు దాటి కాలుగడప దాటకపోతే ప్రయోజన మేముంది.

"వెంకటరత్నం కుమారి క్షణం వృధాపోనివ్వదు మిషన్ కుడుతుంది బట్టలు ఇస్త్రీ చేస్తుంది హార్మోనియం వాయించుతుంది. బట్టలపై అతిగా ఖర్చుపెట్టకనిరాడంబరంగా ఉంటుంది వాళ్ళ అక్క చేయించుకున్న నెక్లెస్ కూడ చాల బాగుంటుందే నాకు" అంటుంది మా అక్క

అయితే పై హితవచనములను ఆవగింజంత అయినా ఆచరణలో పెట్టుటకు ప్రయత్నిస్తుందా? లేదు. పైగా రోజూ పదిమందిలో సోది చెబుతుంది "నేను మాగుతి నెక్లెస్ లాంటిది చేయించుకుంటాను" అని కావలసినంత డబ్బు పైగా పిల్లాజెల్లా లేరాయెను. నిజమేకదా అనుకుంటారు అమ్మలక్కలు. కానిదానికి ప్రాణం ఒప్పితేనా! కొనడమే జరిగితే దానికి పైప్రాణం పైనపోదే కొన్ని సంవత్సరాలు గడిచాయి నేటికీ 'నెక్లెస్' కొంటాను అంటుందిగాని నెక్లెస్ ఏది? ఎలావస్తుంది?

కొందరు భవిష్యత్తునుగూర్చి గాలిలో మేడలు కడతారు కొందరు గతాన్ని స్మరిస్తూ గోరంత కొండంతలుగా చెప్పుకుంటారు. వర్తమానం వీళ్ళకంటికి బొత్తుగా ఆనదు

ప్రపంచానికి వీరి అవసరంకూడా జనాభా లెక్కకు మాత్రమే ఈ లక్షణాలన్నీ మూర్తీభవించినవారిలో మొదటి వనిత మా అక్క.

8 గంటలకు పెత్తనాలకు బయలుదేరితే,— 10 గంటలకు భోజనానికి మాత్రం తంబుగువు సమస్యలతో ఇంటికివస్తుంది. అమ్మలక్కల సమావేశం సాయంత్రం గావున, యీలోగా ఎవరో-ఒకరో, ఇద్దరో మాయింటికే వస్తారు కాబట్టి యింట్లోనే కాలక్షేపం అమ్మకు చెప్పినమాట నాన్నకు, నాన్నకు చెప్పినమాట అన్నయ్యకు, అన్నయ్యకు చెప్పిన మాట నాకు చెప్పకుండా అనేకమైన చిత్రవిచిత్రములైన ఊళ్ళో సంగతులుచెప్పి తన తలబరువు దించేసుకొంటుంది ఆనోటికి విశ్రాంతి ఎప్పుడయా అంటే రాత్రి ఏ పదిగంటల తరువాతనో తనకు తెలియకుండా నిద్రాదేవత నాట్యం చేసినపుడు మాత్రమే ఇలాంటి వ్యవహారం నాకు చాలా చిరాకుగానే ఉంటుంది కాని పాపం ఆమెది మాత్రం తప్పు ఏముంది కాలం, ఖర్మం కలసి వస్తోంది అభూతకల్పనలతో మంగళహారతులు పాడినా వాటిని వినేవారు సిద్ధంగా ఉంటే చెప్పడానికేముంది! మా ఊళ్లో ఆమెకు చాల పలుకుబడికూడాను. మాటకారి, చాల తెలివికలది అని పేరు. ★

రోజూ నీరు చిలకరిస్తే మొక్కలు వారం రోజులకల్లా పుడతాయి పూల విత్తనాలు గాని కాయగూరల విత్తనాలు గాని మనకి దొరకని పక్షంలో కొందరు అమ్మతారు కూడాను. మొక్కలు మొలచిన తరువాత రెండు మూడు మొక్కలు కలిపి ఒక చోట పాతవలెను మొక్కలు వేసి వాటికి రోజూ నీరు పొయ్యడంతో సరిపోదు వాటికి గొంగళీ పురుగులుగాని, చీడగాని పట్టకుండా చూడాలి. గొంగళీ పురుగులు పట్టిన ఆకులు తీసి వేయాలి చీడపట్టన ఎడల ఒక చెంబు నీళ్లలో కొంత పసుపు గుండవేసి మొక్కల మీద ఆకుల మీద చల్లిన పోవును పూలు పూసి మనం పెట్టుకునే రోజుని ఎంతి ఆనందంగా వుంటుందో పెట్టుకున్న వారికే తెలియాలి బజార్లో దొరికినా ఇంట్లో పూసిన పూలు పెట్టుకుంటే తృప్తిగా వుంటుంది

కూరకు పనికి వచ్చేవి అనేక రకములున్నాయి. తోటకూర, గోంగూర, బీరపాదు, గుమ్మడిపాదు మొదలయినవి ఇండ్లలోనే వేసుకోవచ్చు ఇవేగాక క్యాబేజీ టోమాటో, ముల్లంగి, చిక్కుడు మొదలయినవి కూడా ఇండ్లలోనే వేసుకోవచ్చు. ఇంట్లో కూరలకు తడుముకోనవసరం లేకుండా చేయవచ్చు. మధ్యతరగతి కుటుంబీకులకు దక్కటి ఆధారముగూడాను పురుషులు తెచ్చిన జీతాన్ని మిగతా కర్చులకు వాడి ఇంట్లో కూరలు వండుకుంటే ఏదో వేడి నీళ్లకుతోడు చలనీళ్ళున్నట్లుంటుంది. స్త్రీలు పూరికినే కూచొని కబుర్లు చెప్పేబదులు ఇలాంటిపనులు చేసిన మానసికంగాను, ఆర్థికంగాను ఎంతో హాయి అనిపిస్తుంది. కేవలం పూలమొక్కలు, కాయగూరలేగాక పండ్ల మొక్కలు వేసుకోవచ్చు కొబ్బరి, మామిడి జామి, దానిమ్మ మొదలగునవి వేసుకోవచ్చు దేనికయినా శ్రద్ధతో ఓపికతో పనిచేయాలి. ఇంట్లో చెట్లుంటే మంచిగాలి వీస్తుంది చెట్లతో నిండిన ఇల్లు పచ్చగా కళకళలాడుతూ వుంటుంది. ★

దొంగలున్నారు జాగ్రత్త!

దొంగలు అనేసరికి పంచప్రాణాలు జల్లుమంటాయనటం సందేహం లేదు

దొంగల్లో రకరకాలవారు వున్నారు కొందరు స్త్రీలను నానాహింసలూ పెట్టేవారూ వున్నారు మరికొందరు ధనం వస్తువులు మొదలైనవి ఎత్తుకు పోతారు బందిపోటు దొంగలు సరేసరి వారిప్పుడు ఎక్కడావున్నట్టు తోచదు వీరుగాక యింకో రకం దొంగలు కూడావున్నారు మా నౌకరు రామన్న క్రొత్త వూరగాయపెట్టుకున్నాట్ట వారంరోజులు పోయాక ఆ కుండ ఒక రాత్రి రాత్రి మాయమైంది అక్కడ వున్న బింది, చెంబూ, గిన్నివగైరా ఏమీ చెక్కుచెదర్లేదు కేవలం ఆ దొంగ ఆవకాయ కుండకోసం వచ్చినట్లు, ఆ కుండపెంకులు పొలిమేర్లో వున్నవట ఏడాది పచ్చడి పోయిందని వాడు ఒకటే గోల!

మేము తుంగభద్ర డాము ప్రాంతంలో వుండగా అఫీసులో ఒక పదిహేనేళ్లి దిక్కులేని పిల్లాడు పనిచేస్తుండే వాడు వాడు ప్రొద్దుటే జొన్నరొట్టెచేసి కొంత తిని కొంత మధ్యాహ్నానికి దాచుకునేవాడు ఒంటిగంటకు వెళ్ళిచూస్తే గిన్నె కాళీ వాడి గిన్నె గ్లాసు తువ్వాలు ఎక్కడివి అక్కడే వుండేవి కానీ - రొట్టె మాయం అయ్యేది కుక్కమోఅంటే-? వేసిన గొళ్ళెం వేసినట్టు వుంటే ఎలా వస్తుంది?

పిల్లేమోనంటే - దానికి తిన్న గిన్ని కడిగి పక్కకు పెట్టిపోవటం ఎలావస్తుంది? ఒక్కోరోజు వాడు ఏడ్చేవాడు పాపం

మా చప్రాసి ఇల్లు కాలిపోయిందని చలికి పెళ్ళాం పిల్లలూ బాధపడుతున్నారని పాత బట్టలు యిమ్మన్నాడు పోనీ పాపం అని చిరగకపోయినా ఒక ప్రింటింగు చీరా నేత చీరా పిల్లలకూ బట్టలు ఇచ్చాను ప్రింటింగ్ చీర కొత్తడాబుగానే వుంది. ఆ మూడో రోజు సంక్రాంతిపండుగని పిల్లలూ తల్లి నేనిచ్చినవి కట్టుకుని చూపించటానికివచ్చారు వారి ఆనందం చూస్తే నిజంగా మనం ఏసిల్కు బట్టలు కట్టుకున్నా అంత ఆనందపడం అనుకుంటాను ఆ రోజంతా వూళ్లో తిరిగి ఆ వెనుకరోజే ఏడుపుముఖాలతో సిద్ధమయ్యారు. ఏమిటి సంగతి? అంటే—??

సంక్రాంతినాడు వూరంతా తిరిగి ఆ రాత్రి బొబ్బట్లు ఒండుకుతిని, పడుకున్నారట

తెల్లారేసరికి చిన్నపాత్రటంకు చిల్లుల చెంబు అన్నం గిన్నె మాయమైపోయాయి ఎక్కడమాసిపోతాయోనని నేనిచ్చినబట్టలు విప్పి ట్రంకులోనే పెట్టారట మేమే దరిద్రులమంటే మాకంటే దరిద్రుడా దొంగఅని కళ్లనీరు పెట్టుకున్నాడు నేను పిల్లలకు వాడిన "లాక్టోజన్" పాల డబ్బాలు (2-సేర్లు పట్టేవి) కారం, పప్పు, జొన్నపిండి మొదలగు వాటితో సహా తీసుకు వెళ్లాడట ఆ దొంగ ఇది ఎందుకు చెప్తున్నానంటే దొంగల్లోకూడా రక రకాలు తరగతులుంటారన్నమాట

* * *

పైన చెప్పినవారంతా ఒక రకమైనవారనే చెప్పాలి.

ఎస్. వి. దేవి

ఇప్పుడిప్పుడే ఘరానా దొంగలు బయలుదేరారు వారిని దొంగలు అనలేం మొన్న మా విజయ్ బెజవాడ వెళ్తున్నాడు. ట్రయిన్లో యిద్దరు స్టూడెంట్సు పరిచయమై మావాడికి పంచప్రాణాలు యిచ్చి కాజీపేటలో ఒక కప్పు చా యిప్పించారు వారు బెజవాడే వెళ్తున్నారు

టైంబాగానే గడిచిపోతోందని మావాడు సంతోషించాడు వాళ్లిద్దరూ మావాడి పక్కలోనే యిరికారు. నిద్రపోయారు ముగ్గురూ. బెజవాడ దగ్గరకు వచ్చేసరికి వాడికి మెలుకువ వచ్చింది మిత్రులు పక్కలో లేరు. రెష్టువాచి వుంగరం మాయమైనది

* * *

సినిమా చూద్దామని ఓసారి రాజమండ్రి వెళ్తున్నాం. డీసెలు కొవ్వూర్లో ఆగింది. చాల రష్ గా వుంది జనం క్రిక్కిరిసి వున్నారు అయినా యింకా ప్లాటుఫారం మీదనుండి తోసుకుంటూనే వున్నారు ఇంతలో ఒక పెద్దమనిషి చేతిని రెండో పెద్దమనిషి పైకెత్తి పట్టుకుని నానాతిట్లు తిట్టి గోబదరగొట్టాడు రెండోవాని చేతిలో పదిరూపాయలనోటు వుంది. మొదటాయనంటారూ ఈ దౌర్భాగ్యుడు నాలాల్చీ జేబులో చెయ్యిపెట్టి పదిరూపాయిలనోటు తీశాడు చూడండి అన్నాడు. రెండోవాడు తను తీయలేదని రష్ గా వుంది కనుక తోసుకోవటంలో తనచెయ్యి పొరపాటున దూరిందని సంజాయిషీ యిచ్చాడు కానీ—పొరపాటున చెయ్యిపడితే పదిరూపాయలునోటు బయటకు ఎందుకు లాగావన్నాడు మొదటాయన

"అది అలవాటయిన పొరపాటు" అన్నా దొక గొంతు రెండోవారి ముఖం వెలవెలపోయింది


ఇంతకూ అతను చూటానికి చాలా పెద్దమనిషిలా కనపడ్డాడు చేతికి బంగారు గొలుసుతో వాచీ మెళ్లో సన్న చైను నాలుగువేళ్ళకూ వుంగరాలూ, జరీఅంచు పంచికండువా మోతుబారిలా కనుపిస్తాడు.

* * *

ఒక పత్రికకు "ఒక కథ పంపాను మరుచటనెల ఆపత్రిక కొనిచూచాను నాకళ్లెంట నీరు తిరిగింది (అప్పటికి చిన్నదాన్ని కనుక నాకథ ఇంకొకరు దొంగిలించారని) అదే కథ గేయరూపంలో ఆ పత్రిక అసోసియేట్ ఎడిటరుపేర ప్రచురితమయినది. ఇది ఒక రకమైన దొంగతనమనే చెప్పాలి

* * *

నేనొక పత్రికలో ఒకకథవ్రాశాను అదే కథను కాపీచేసి పోటీకి పంపి బహుమతి పొందినవారున్నారు గొప్ప రచయితలమని బుజా లెగరవేస్తూ ఇలాంటి నీచమైనపనులు చేయటం ఎంత శోచనీయమో ఆలోచించండి ఖర్మవశాత్తు ఆ కథ నాకే చదవమని యిచ్చారు నాపేరు తెలియదు గనుక. నేనే ఆ రచయితనని తెలిస్తే కాపికొట్టిన రచయిత ఏమయ్యేవారో—? కానీ— నేను చెప్పలేదు నలుగురిలో అవమానించటం నాకు యిష్టంలేదు కనుకనే నేను వెలిబుచ్చలేదు. వీరూ ఒకమాదిరి దొంగల్లోనే చేర్తారు అలాగని నాకేమాత్రం ద్వేషం లేదు కానీ—జాలేస్తుంది రచయితలు ఇలా అసహ్యకరమైన (కాపి కథ)లు వ్రాయక సొంత రచనలకు కృషిచేయమనే నా కోరిక పై చెప్పిన రకాల్లో దొంగలు కొన్ని సమయాల్లో పట్టుపడ్డా తప్పించుకోగలరు. కాని రచన దొంగలుమాత్రం వెంటనే దొరికిపోతుంటారు. ★



ధన్యవాదాలు

పి. జి. సరోజనిగారు వ్రాసిన 'ఆడపిల్లల పెంపకం' అనే వ్యాసంలో రాసినదంతా అక్షరాలా నిజమనే చెప్పాలి ఆవిడ స్వానుభవంతో రాశారో లేక లోకం పోకడను బాగా అర్థం చేసుకొని రాశారో తెలియదుగాని వున్నమాటను ధైర్యంగా రాసినందుకు ఆమెకు నా హృదయ పూర్వక ధన్యవాదాలు

ఆడపిల్లల పెళ్ళిళ్ళ విషయంలో కేవలం మన అమ్మమ్మల్నీ, బామ్మల్నే అనుకోనక్కర్లేదు ఎందుకంటే, నేటి కాలమాన పరిస్థితులను బాగా తెలుసున్నవారు, నవీన పద్ధతుల్లో (బాహ్య విషయాలలోనే) నడుచుకొనేవారు, తాము చాలా 'ఫార్వర్డు' గా వున్నామనుకునే ఎంతో మంది స్త్రీ, పురుషులు కూడా తమ ఆడపిల్లల విషయంలో పాత విధంగానే ప్రవర్తిస్తున్నారనడానికి ఎంతమాత్రమూ సందేహం లేదు సంఘ నియమాలనీ, లోకంతీరు ఆ విధమనీ చెపుతూ ఆడపిల్లల్ని అగచాట్లు పాలు చేస్తున్నారు

ఒక అమ్మాయుంది పాపం! తనకి రెండు మూడేళ్ళనుంచి పెళ్లి చేద్దామనుకుంటున్నారు కాని ఏదో కారణంగా అది జరగడంలేదు ఆమె తలితండ్రులు ఏదో మధ్యతరగతి కుటుంబీకులు కట్నం సరిగా ఇవ్వలేరు తగిన కట్నం ఇస్తేకాని మన పెళ్ళి కొడుకుల మార్కెట్టులో కాస్త చదువుకొన్న వాడుగానీ, సరైన వాడుగానీ దొరకడాయనుమరి పెళ్లి చదువుగా ధర్మఘోరం వచ్చే వచ్చిన ఆమె చదువు అంతటితో నిలిపివేయబడింది ప్రస్తుతం చదూవూ లేదు, పెళ్లీ లేదు పై పెచ్చు ఇంట్లో వల్లమాలిన చాకిరి పోనీ చాకిరీకి తగిన మెప్పు మెహర్బానీ ఏమైనా వుందా అంటే అదీ లేదు పైగా దానికి ప్రతిఫలంగా ఇదంతా నీ దురదృష్టం, నీకింక పెళ్లి కానేకాదు, నీ మూలంగా మా వంశానికి అప్రతిష్ఠ కల్గుతూంది అనే తిట్లు పాపం ఆ అమ్మాయి పెళ్ళి చేసుకోనూ అంటేకదా ఆ విధంగా అనడానికి వాళ్ళు తగిన కట్నం ఇవ్వలేరూ పెళ్లికొడుకుని తేలేరు పిల్లకి తిట్లూ తప్పవు

ఇక, తలితండ్రులు మాటలనేటప్పుడు తమ బిడ్డల మనస్సు ఎలా బాధపడుతుందో అనయినా లేకుండా నోటికి వచ్చినట్లనేస్తారు కొందరు ఆ విధంగా అనడంవలన పరిస్థితులు ఏ విధంగా మారుతాయో వారు ఒక్కసారయినా యోచించరు ఏమన్నా అంటే మిమ్మల్ని కని పెంచి పెద్ద వాళ్లను చేసినందుకు ఓ మాటంటేమాత్రం తప్పేమిటి అనడం పెళ్లి చేయడానికి వయసొచ్చిందనీ, చాకిరీ చెయ్యడానికి ఏళ్ళు వచ్చాయనీ అనేవాళ్ళు వయసొచ్చిన తమ పిల్లల్ని ఆ విధంగా నీచంగా అవమాన భరితంగా మాట్లాడితే వాళ్ళ మనస్సెంత నొచ్చుకుంటుందో అనే భావం కొంచమైనా వుండొద్దూ?

ఇన్ని రోజులకి పెళ్ళి చేసుకోకపోయినా స్వతంత్రంగా జీవించి హాయిగా కష్టార్జితం మీద బ్రతుకగలరు అనేమాట సరోజినీగారి వ్యాసంలో తాను చదివాననీ ఆమె ఒక్కర్తె ఐనా నిరుత్సాహ పరచకుండా ఆ విధంగా ధైర్యంవచ్చేలా వ్రాసినందులకు తన తరఫున కూడా ధన్యవాదాలు తెలుపమని స్నేహితురాలు రాయమంది ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే పెళ్లివద్దనుకుని బంధిఖానాలో జీవించే మా స్నేహితురాలు, తాను చెప్పిందంతా నిజమని వాదించే నాలాటి వారికి, పెళ్లికాక, పెళ్లి వద్దనుకుని పుట్టింట్లో అనేక మాటలు పడుతూ, అవమానాలను భరించే ఆడపిల్లల హృదయాలకు ఈ వ్యాసం ఒక విధమైన పూరటను కలిగించి కొంతవరకు మనశ్శాంతిని లభింపచేస్తుందని నా అభిప్రాయం

పి. సుశీలారాణి-నెల్లూరు.
(నెల్లూరు సౌత్)

* * *

ఊహ మంచిదే

10-7-57 పత్రికలో పి. జి. సరోజనిగారు వ్రాసిన "ఆడపిల్లల పెంపకం" వ్యాసం చదివాను. ఆమె ఊహాలు, స్త్రీకి ఉన్నట్టి అవకాశాల సద్వినియోగం, వాటిని ఆచరణలో పెట్టవలసిన విధానాలు అన్నీ బాగానే వున్నాయి కాని స్త్రీ కొద్ది జ్ఞానం రాగానే సర్వస్వతంత్రంగా వుండి, పెళ్లీ గిళ్లీ జాన్తానై అని సమాజాన్ని ధిక్కరించి యే పనిచేసినా, యెట్లాటి ఉద్యోగం చేసినప్పటికీ చివరి కొకనాడు జీవితంలో యేదో అనర్థంపాలుగాక తప్పదు సరోజినిగారు వ్రాసిన విధానం కొంతవరకు పాశ్చాత్యులకు వర్తించవచ్చు ఎందుకంటే వారు మనకంటే కొంచెం యీ విషయంలో ముందంజ వేశారు కొబట్టీ, వాళ్ళలో స్త్రీలు అవివాహితలుగావున్నా తరచి తరచి అడిగి, బుగ్గలు నొక్కుకునే మన దేశంలోని స్త్రీలలాగున ఉండరు కొబట్టేని

కుమారిగా వున్న స్త్రీ ఉద్యోగం చేస్తున్నంతకాలం తోటి పురుష గుమాస్తాలు ఆమెనదో భావంతో చూడవచ్చు త్రోవలో కాసుకుని ప్రేమ గీతాలు పాడవచ్చు ఆమె వున్న బస్తీలోని స్త్రీలే గుసగుసలు సాగించవచ్చు ఏ సోదరుడితో మాటాడినా అభాండాలు రుద్దవచ్చు. ఇటువంటి అవకాశాలకోసం, ముఖ్యంగా స్త్రీలు తోటి సోదరీమణులమీద కచ్చె కట్టుకు కూర్చుంటారు ఇవన్నీ కొక ఆసోదరిగూడ ఆడదే కొబట్టి, ఆమెకే ఒకప్పుడు యే మగాడిపై నయినా కోరిక కలుగవచ్చు ఇది ప్రకృతి సిద్ధమయిందికూడా అటువంటప్పుడు అతడితో ప్రేమ కలాపాలు సాగిస్తుంది యిష్టమైతే రిజష్టరు మేరేజి—ఆ తరవాత మనసు విరిగితే విడాకులు! ఇట్టి యిన్ని అవకతవకలు లేకుండా యిష్టమైన భర్తనే ఆ పెద్దవాళ్ళ నేవాళ్ళ సమక్షంలోనే కట్టుకుని, తరువాత యే గొడవా లేకుండా ఉద్యోగంచేస్తేమాత్రం భర్త వద్దంటాడా? అతను మూర్ఖుడయితే తప్ప! కొన యేనాటికైనా, మన దేశ వాతావరణాన్ననుసరించి, పరిస్థితుల ననుసరించి, భర్త వున్న స్త్రీకి వున్నంతగౌరవం, నలభై పైబడ్డ కుమారికి వుండదు కాదంటే-చాలామంది పాశ్చాత్య స్త్రీల లాగున ఓ పదిసార్లు విడాకులిచ్చి జీవితాన్ని ధ్వంసం చేసుకోవాల్సి వస్తుంది!

'మంచుకొండ నర్సింహారావు,
(సికింద్రాబాద్)

* * *

చివరకు మిగిలేది!

మా బంధువుల అమ్మాయికి స్కూలు ఫైనల్ చదువుతున్నప్పటినుండి సంబంధ

★ వనితా వాణి ★

ములు చూస్తూనేయున్నారు సంబంధము కుదరక చదువుకొనసాగించి బియ్యేకూడ పూర్తిచేసింది కాని ఆ అమ్మాయికి సంబంధం మాత్రం యిప్పటివరకు కుదరలేదు కారణం? ముఖ్యముగా వరకట్నాలబాధ ఊరకనే ఉంచుట దేనికని పెద్ద చదువు చదివిస్తే కనీసం ఆ అమ్మాయికి గ్రాడ్యుయేట్ అయిన వరుడు దొరకాలి ఆ గ్రాడ్యుయేట్ గారికి దమ్మిడీ ఆస్తిలేకపోయినప్పటికీ వేలు కట్నం మాత్రం కావాలి సరే వేలకు యిష్టపడి సంబంధం కుదుర్చుకునేటప్పటికి, "ఇంత చదువు చదివినపిల్ల పనిపాట లేమి చేస్తుంద"ని కొందరి విమర్శలు ఈ లోపల ఆ అమ్మాయికి యిరవై ఎనిమిదేళ్ళు రానే వచ్చేస్తాయి. యిపుడు తీరా పిల్లకంటె వయస్సులో పెద్దవాడు దొరకుట కష్టమైపోతోంది అథవా దొరికినప్పటికీ ఏ ద్వితీయ వివాహపు వరుడో దొరుకుతున్నాడు అతనయినా కట్నం అడుగుట మాత్రము మానుటలేదు. ఈమధ్య సరిగా ఆ అమ్మాయి వయస్సే ఉన్న ఒక యువకుడు (డాక్టరు) ఆ అమ్మాయికి కుదిరాడు. స్థిరాస్తి సహితము తెగనమ్మి వారడిగిన కట్నము యిచ్చుటకు ఒప్పుకున్నప్పటికీ "మావాడు ఎక్కడా నౌకరీ చేయుటకు యిష్టపడుటలేదు. తాను పెట్టుకొనబోయే డిస్పెన్సరీ వగైరాలకయే ఖర్చులు మీరే భరించుకోవాలి" అది అడిగేటప్పటికి ఆడపిల్ల తరఫువారు తెల్లబోయారు. పిల్లకంటె పిల్లవాడు పొట్టి అయినప్పటికీ సమాన వయస్కుడయినప్పటికీ వారు మొదట అడిగిన కట్నము యిస్తామని ఒప్పుకొన్నప్పటికీ, వారియొక్క హిరణ్యాతురములకు వీరు భయపడి సంబంధము వదులుకొనవలసి వచ్చినది పాపం! ఆ అమ్మాయి అంత చదువు చదివినప్పటికీ చివరకు వారి కుటుంబముగాని ఆ అమ్మాయిగాని బయట తల ఎత్తుకొని తిరగలేక పోతున్నారు.

అన్నీ తెలిసిన ఈ ప్రపంచమే "ఆ! ఆ పిల్లలో ఏ లోటులేకపోతే యిన్నాళ్ళనుండీ పెళ్ళెందుకవదు?" అని కోడైకూస్తుంది ఈ సమస్యలకు మరి మార్గమే లేదా? చివరకి మిగిలేది ఇదా??

కొత్తపల్లి రాజ్యలక్ష్మి, చిన్నగంజాం.

* * *

పామునాలుక

(43-వ పేజీ తరువాయి)

గదా? మరి తమాషా ఏమిటంటే ఈ పాము నాలుకల మనుషులకు వాళ్ళ మనసులు మారిపోతున్నందువల్ల ఎదుటివాళ్ళల్లోగూడా లేనిపోని మార్పులు వచ్చాయనుకుంటుంటారు - అనుకోడమేమిటి అనేస్తారుకూడా! అయితే దానికేమాత్రం విలువవుండదు లెండి ఏది ఎలా అయినా అలాటివాళ్లు తమ మనస్సును మార్చుకుంటారని - మార్చుకోవాలని మనం అనుకోనూ వద్దు - ఆశించనూ వద్దు కానీ - పాములను చూచి ఎంత ధైర్యంగా వుండే వాళ్లయినా ఏదో కొంత భయపడ్డట్టుగానే - ఈ పాము నాలికలవాళ్లను చూచిగూడా సాధ్యమైనంతవరకు తప్పుకు తిరగడం మంచిదేమో ననిపిస్తుంది నాకు - మరి అందరి వుద్దేశ్యాలెలావుంటాయో? ★

చిత్రసమీక్ష:

'దొంగల్లో దొర'

బలం, జవంగల గుర్రంలా పరుగెత్తే కథ, కథనం, సమర్థులైన కళాకారులు చూపిన మంచి నటన కలిసిన సత్ఫలితం 'దొంగల్లో దొర' (చందమామ ఫిలింస్) నవదర్శకుడు శ్రీ పి చెంగయ్య ఈ ఫలితం సాధించినందుకు అభినందనీయుడు

ఎ. నాగేశ్వరరావు, గుమ్మడి, రేలంగి, ఆర్ నాగేశ్వరరావు, రాజనాల, బాలకృష్ణ, జమున, జి వరలక్ష్మి, సూర్యకాంతం, నర్తకి ఇ వి. సరోజ, హెలెన్, మాస్టర్ మురళి, బేబీ శశికళ ఇందులో పాల్గొన్నారు సంభాషణలు ఆత్రేయ వ్రాశారు మల్లాది రామకృష్ణశాస్త్రి, సముద్రాల సీనియర్, జూనియర్, నారపరెడ్డి, పాటలు వ్రాశారు. సంగీతదర్శకుడు ఎం సుబ్రహ్మణ్యంరాజు ఛాయాగ్రహణం ప్రసాద్

కల్లుకుండ చూసి, అది కల్లు అనుకోకుండానే నోటిదగ్గిర పెట్టుకున్న పసివాడిని, తాగుబోతుగా తయారుచేయబోయి ఓడిపోయిన 'విధి' కథను ఇందులో చిత్రించారు ఆ కుర్రవాడిపేరు ఆనంద్ అతని తండ్రి ఒక పోలీసు అధికారి పసితనంలో అల్లరిగా తిరుగుతూ, ఆనంద్ ప్రమాదవశాత్తు ఒక ప్రాణంతీస్తాడు అందుకని అతనిని బాల నేరస్థుల సంస్కరణకేంద్రానికి పంపుతారు. అక్కడతడు 20 ఏళ్ళు పెరిగి, కొన్నాళ్ళకి తిరిగి ఇంటికి బయల్దేరుతాడు

దారిలో అధర్మదేవత ఒక దొంగారామ్ వేషంలో షికారుచేస్తూ, ఆనంద్ నుచూసి మోజుపడుతుంది ఎక్కడో చెక్కేసిన ఒక నగను ఆ గంగారామ్ ఇతగాడి జేబులో పడేస్తాడు పోలీసులు పట్టుకుంటారు. ఇన్నేళ్ళుగా, తనగురించి క్షోభపడుతూ, ఇప్పుడు తను బాగుపడినందుకు సంతోషపడుతూ తనకై ఎదురుచూస్తున్న తండ్రి ఇది వింటే, ఎంత బాధపడుతాడోనని, ఆనంద్ పోలీసులకు టోకరాయిచ్చి పారిపోయి ఇంటికొస్తాడు

ఆరోజున తొలిసారిగా పఠించిన పలాయనమంత్రాన్ని అతడు ఆ తరువాత ప్రతిరోజూ 'జపిస్తూ' నే ఉండవలసివస్తుంది.

అటు ధర్మదేవత దూతలనుండి తప్పించుకోవడం ఇటు తనచుట్టూ ఉచ్చులుపన్ని, తనను దొంగగా వాడుకొంటున్న కామిని అనే భామిని ముఠానుండి తప్పించుకోవడం ఇలా బ్రతుకంతా తప్పించుకోవడం, పారిపోవడంగానే సాగుతుంది బుద్ధి మంచిదారినే ఉన్నా, చేష్టలు చెడుదారిని పడడం తప్పనిసరి అవుతుంది. ఇందుకు ప్రత్యక్షు బాధ్యత సంఘానిది కాదు. వాళ్ళ నాన్నది కాదు. తెలిస్తే అతనేమన్నా చేసేవాడు దొంగలు కొంతవరకూ బాధ్యులేకాని వాళ్ళని కొప్పడి లాభంలేదు "ఊహూ మంచిదేకాని మావృత్తే ఇదిగదా" అంటారు—వాళ్ళకి సందేశం ఇస్తేగిస్తే

అందుకని కథానాయకుడే స్వయంగా ప్రయత్నంచేసి తన చుట్టూఉన్న బంధాలను తెంచుకు బయటపడాలి అతను కొంత ప్రయత్నించినా సాధ్యంకాదు అందుకని అలా అవస్థపడుతూనే తప్పనిసరి దొంగతనాలుమటుకు చేస్తూ ఉంటాడు

చివరికి కామినికి, ప్రాణం విసుగెత్తి, పోతున్న వేళ, ఆమె తప్పు ఒప్పుకుంటూ వాఙ్మూలం ఇస్తుంది అక్కడితో కథ సుఖాంతంగా ముగుస్తుంది.

దర్శకుడు చెంగయ్య ఈకథను ఎక్కడా విసుగనిపించని విధంగా తెరమీద చిత్రించారు పాటలూ, నృత్యాలూ మొదలైనవాటిని కథకు అడ్డురాని సందర్భాలలోనే చొప్పించి ఒప్పించారు.

ఆనంద్ గా నాగేశ్వరరావు ఇటీవల అనేక చిత్రాలలోకన్న ఉత్తమస్థాయి నటనను ప్రదర్శించాడు తండ్రి మనసు క్షోభపెడుతున్నానన్న బాధ, తప్పు చేస్తున్నానన్న ఆవేదన, చేయిస్తున్న వారిమీద ద్వేషం, 'అభాండం పడితేచాలు, అధోగతికి తోసి వేయా'లన్న సంఘంమీదకోపం, చూపే సన్నివేశాలలో ఉన్న కొన్ని సంభాషణలూ కూడా అనవసరం అనిపించేలా నాగేశ్వరరావు నటించాడు.


ఆనంద్ తండ్రిగా నటించిన గుమ్మడి వెంకటేశ్వరరావు కూడా భాషకు అతీతమైన భావాలను ప్రదర్శించడంలో మంచి ఫలితాలను సాధించాడు ఉద్వేగం ప్రధానమైన సన్నివేశాలు హాస్యాస్పదం అయిపోయే ప్రమాదంవాటిల్లడం బహుసులభం ఎక్కడా మితిమీరకుండా ఈ నటుడు ఆ స్థాయిని నిలబెట్టగలిగాడు.

ఖురాసా దొంగలముఠా నాయకురాలు కామిని భూమిక విలక్షణంగా కనబడుతుంది. జి వరలక్ష్మి అందుకు తగిన ఫక్కీలోనే ఆ పాత్రను నటించింది

కథానాయిక ఇందుగా జమున నటన యథోచితంగా సాగింది ఆమె భూమిక రూపకల్పన, 'యథాప్రకారంగామూసపోసిన తరహాది "సినీమాటిక్" గా ప్రేమించడం, బెంగెట్టుకోవడం తోటలో డ్యూయెట్ పాడడం మొదలైనవన్నీ మామూలు ప్రకారం ఏర్పాటుఅయి ఉన్నాయి సదరు ఘట్టాలలో నటన కూడా సదరు విధంగానే ఉంటుంది పతాకసన్నివేశంలో ఆమె మంచి నటన ప్రదర్శించింది ఈ చిత్రంలో పాటలన్ని వినడానికి హాయిగా ఉన్నాయి. ★



"దొంగల్లో దొర" (1957 జూలై) ఇదే నాగేశ్వరరావు నటించిన అరవయో చిత్రం.



పండ్లమహాసభ

కొత్తపల్లి
సుబ్రహ్మణ్యశర్మ

రకరకముల పండ్లన్నియు
తమనాయకు నెన్నుకొనగ
పోటీపడి చివరకొక్క-
రాజీసభ చేసుకొనెను.

వాటివాటి స్థలములలో
సుఖముగ కూర్చున్నప్పుడు
అలజడి యారంభమయ్యె
నెంతో కడువింతగాను.

దిగులు మోము వాలవేసి,
ఒడలంతయు మాడిపోయే,
నేనే రేడౌదునంచు
విర్రవీగు నేరేడుకు.

మేనంతయు విచ్చిపోయె
చిన్న చిన్న గింజలుగా,
ఉన్నరూపు ఊడిపోయె,
అందగత్తె దానిమ్మకు.

అభిమానము ఆవహింప
మహిని బ్రతుకు వలదటంచు
నెత్తిమీద కొయ్య దించె
పౌరుషాల పనసఫలము.

హృదయ మెల్ల ద్రవియింపగ
భీతిచేత నిలువలేక
చెట్టు చివర కెక్కిపోయె
'అబ్బో' అని ఆ కొబ్బరి.

ఏమిటంచు ఎంచిచూడ
పసిడిమేను మెరసిపోవ
వయ్యారంగా "మామిడి"
అగ్రాసన మాక్రమించె.

తిరిగివచ్చిన తమ్ముడు

శెట్టి కృష్ణమూర్తి

పూర్వం ఒకపెద్దమనిషికి యిద్దరు కుమారులున్నారు. ఒక రోజున చిన్నకుమారుడు తన వాటాకువచ్చిన ఆస్తిని పంచి యివ్వమని తండ్రినికోరాడు. అందువలన తండ్రి చిన్నవాని వాటాను వానికి యిచ్చివేశాడు.

కొన్నిరోజుల తర్వాత చిన్నవాడు తన వాటాకు వచ్చిన భూమి పుట్రా అమ్మకొని, డబ్బుచేసుకొని ఎచ్చటికో దూరదేశానికి బయలుదేరాడు. అక్కడ అతడు తనదగ్గర వున్న డబ్బంతా దుబారాగా ఖర్చుచేస్తూ విలాసములతో కులుకుతూ గడిపినాడు.

కొన్నాళ్లు అలాగడపిన తర్వాత అతని దగ్గిర డబ్బంతా కర్పూరంలా కరిగిపోయింది. విలాసజీవితం గడపేందుకు వీలు లేకపోయింది. 'గోటిచుట్టుపై రోకలిపోటు' అన్నట్లు ఆ దేశంలో పెద్దకాటకము ప్రబలింది. దేశంలో పలుచోట్లకు కూలినాలి చేసుకొనేందుకు ఏవైనా పనిపాటలు దొరుకుతవేమో అని కాళ్లు అరిగేవరకు తిరిగాడు.

తిరగ్గా తిరగ్గా ఎలాగైతేనేం ఒక వ్యవసాయదారునివద్ద కూలివానిగా పని దొరకింది. యజమాని అతణ్ణి రోజూ పశువుల మేపుకువచ్చేందుకు పొలానికి పంపించేవాడు. ఆరోజుల్లో మనుష్యులకేగాక జంతువులకు కూడా మేత దొరకటం కటువుగానే వుంది. తగినంత ధాన్యముగాని, మేతగాని దేశంలో లేవు. ఏది దొరికితే దాన్నే పరమాన్నంగా తినేందుకు సిద్ధంగావున్నాడు పోకిరివాడైన చిన్నకుమారుడు ఆ నోరులేని పశువులు తినేమేతైనా అతనికి దొరకటం లేదు. చివరకు పశువులుతినే తవుడు కూడా తినేందుకు అతనికిపెట్టేందుకు ఎవరూలేరు. అది అంత కటువు కాటకమన్నమాట!

కష్టములలో వున్నవానికి దేవుడు గుర్తుకువచ్చినట్లు అతనికి అప్పుడు తండ్రి గుర్తుకువచ్చాడు. తండ్రి, అన్నలనుంచి వేరుపడిపోయి ఆ విధంగా విచ్చలవిడిగా జీవించటం మతిలేనిపని అని అప్పుడు తెలుసుకొన్నాడు. కడుపులోని మంట హృదయ కల్మశమును కడిగివేసినది. ఆకలికి పాపము నశించి మాడిపోయినది. సత్యమును తెలుసుకొన్నాడు తండ్రి దగ్గిర పనిచేసే పాలేళ్ళను, జీతగాళ్ళనుగురించి ఆలోచించాడు. ఆ పాలేళ్లు కష్టపడి పనిచేసి హాయిగా తింటారు తమకు యిచ్చినజీతంలో కొంతమిగుల్చుకోగలరుకూడా! వారిపనేహాయిగావుందని అనుకున్నాడు.

ఆ ఆలోచనలు అతనిని ముందుకు త్రోసినవి. తండ్రివద్దకు తిరిగి వెళ్ళేందుకు పురికొల్పినవి. తనలో అనుకున్నాడు. "నేను దేవునికి కనిపెంచిన తండ్రికీ తీరని అపచారం చేశాను. నాతండ్రితో ఆ మాటే చెప్తాను. నేను నీ కుమారుణ్ణి అని పిలువబడేందుకు కూడా అనర్హుణ్ణి. అందుకని నన్ను నీ పాలేళ్లకువలె చూడు" అని తండ్రితో చెపుదామనుకున్నాడు.

అనుకొన్నపని వెంటనే చేశాడు తండ్రిని కలుసుకునేందుకు ఎంతో తొందరగా ప్రయాణమై నడకనాగించాడు. కుమారుడు యింటికి ఎంతోదూరంగా వుండగనే తండ్రి చూసి అతణ్ణి సాదరపూర్వకముగా ఆహ్వానించాడు కుమారునియందు దయతలచాడు. పితృప్రేమతో ఎదురేగి అతణ్ణికౌగలించుకొన్నాడు. పోగొట్టుకొన్న తనకుమారుని తిరిగి పొందటమనేది ఆ తండ్రికి ఎంతో ఆనందము చేకూర్చినది.

బెదురుతూ వచ్చిన కుమారునికి నెమ్మదిగా ధైర్యం వచ్చినది. తండ్రితో "నాన్నా! దేవునికి పాపం చేశానని నీముందు ఒప్పుకొంటున్నాను. నీ కుమారుణ్ణి అని యైనా పిలువబడేందుకు అనర్హుణ్ణి!" అని దీనవదనంతో చెప్పాడు.

ఆ మాటలకు సంతోషంతో ఊగిసలాడుతున్న తండ్రి విన్నాడో లేదో? వెంటనే సేవకులను పిలిపించి మంచిబట్టలను తెచ్చి కుమారునికి కట్టబెట్టమని చెప్పాడు. ఒక బంగరు ఉంగరమును తెచ్చి అతని

★ తిరిగి వచ్చిన తమ్ముడు ★

చేతికి పెట్టమని చెప్పాడు ఆవిధంగా తండ్రి కుమారుని ప్రేమాదరములతో స్వీకరించాడు. గౌరవించాడు.

అంతటితోనే ఆగలేదు. కుమారుడు తిరిగి వచ్చినందుకు ఆ సందర్భంలో సంతోష సూచకముగా పెద్ద విందును ఏర్పాటు చేసేందుకు పూనుకొన్నాడు పిండివంటలను, భక్ష్యభోజ్యములను తయారుచేయమని సేవకులకు చెప్పినాడు. "మీరందరుకూడా ఆ విందుకు తప్పక రావాలి సుమా!" అని సేవకబృందమును కూడా ఆహ్వానించాడు.

తండ్రి సేవకులతో యింకా యిలా చెప్పాడు: "నేనీ విందును గొప్పగా చేయాలని అనుకొంటున్నాను. ఎందుకంటారేమో? నేను చనిపోయాడని తలంచిన నాపుత్రుడు తిరిగివచ్చాడు. పరిశుద్ధుడైనాడు. అంటే మరల బ్రతికి వచ్చాడన్న మాట. అతణ్ణి నేను పోగొట్టుకొన్నాను, తిరిగి పొందగలుగుతున్నాను."

అందరూ సంతోషంగా ఉత్సాహంతో విందు నేర్పాటుచేయటములో నిమగ్నులైనారు.

పెద్దకుమారుడు పొలంలో పని చేసుకునేందుకు వెళ్ళాడు. ఇంటికి తిరిగివస్తూనే యింటిలో జరిగే సంగీతాన్ని, నాట్యాన్ని, సంతోష సంరంభాన్ని అంతా విన్నాడు, చూశాడు. కాని అంత హంగామా జరిగేందుకు కారణం మాత్రం అతని తల బ్రద్దలుకొట్టుకొన్నా తట్టలేదు. ఒక సేవకుని పిలిచి, "అసలు సంగతేమిటిరా? ఇంత సంతోషంగా పండగ జరుపుతున్నారెందుకు?" అని ఆశ్చర్యంతో అడిగినాడు.

ఆ సేవకుడు ఉన్న సంగతిని అంతా చెప్పినాడు "మీ తమ్ముడుగారు తిరిగివచ్చారు! ఆ సందర్భములో గొప్పవిందును తండ్రిగారు ఏర్పాటు చేస్తున్నారు. అంతా సిద్ధంగావుంది. చాలా ఖర్చుచేసి విందును గొప్పగా చేస్తున్నారు. ఆయనగారిని తండ్రిగారు ఎంతో ప్రేమాదరములతో ఆహ్వానించారు."

ఆమాటలను వినగనే పెద్దవాని కోపానికి అంతు లేకపోయింది. చీదరించుకొన్నాడు. అసహ్యించుకొన్నాడు. అటువంటి ఇంటిలోనికే వెళ్ళగూడదని నిర్ణయించుకొని బైటనే కూర్చున్నాడు

కాని, పెద్దకుమారుడు యింటి వెలుపలే వుండటం తండ్రిచూశాడు. కుమారుని లోనికి రమ్మని ఆహ్వానించేందుకు బయటకువచ్చి, "లోనికి వచ్చి విందులో పాల్గొను నాయనా!" అని ఆప్యాయంగా పిల్చాడు. పెద్దవాడు ఉద్రోషం పట్టలేకపోతున్నాడు. అతని శరీరంలోని వేగమైన నాడీస్పందనం అతని మాటలను అచ్చటచ్చట అడ్డుకొన్నది. "నేను నిన్ను నమ్మి ఎంతోకాలం నుంచి వుంటున్నాను.. విశ్వాసంగా మెలిగాను. నీమాట నేనెప్పుడూ జవదాటలేదు." అంత వరకు మాట్లాడేసరికి అతని కళ్ళవెంట నీళ్ళు గిర్రున తిరిగాయ్. కోపం నీళ్ళరూపంలో వేడిగా జారిపోయింది.

"నాకు మామూలు భోజనమైనా పిండివంటలతో పెట్టావా? పెట్టలేదు. నాస్నేహితులతో కబుర్లు కులాసాగా చెప్పుకొంటూ విందులో పాలొనే అవకాశమును నాకెప్పుడైనా యిచ్చావా?.. ఇవ్వలేదు. కాని నీవు చెప్పినమాటలను పెడచెవిని బెట్టి తనకు వచ్చిన ఆస్తిని అమ్ముకొని వెళ్ళి దుబారాచేసి వచ్చిన పోకిరి' యింత గౌరవం చేస్తున్నావుకి ఇదంతా అతని దుష్ప్రవర్తనకన్న మాట!" అని ముగించాడు.

"నిజమే నాయనా! చెడ్డవానికి 'శాంతి' చేస్తున్నామన్నమాట! నీవన్నమాటలో తప్పేమీలేదు." అని అంటూ కొడుకును అనునయించుతూ "నీవు ఎప్పుడూ నాతోనే నాకు తోడునీడై మెలగావు. అందుకని నాకేమైతే వుందో అదంతా నీదేగా! నీది, నాది అన్న భేదమే లేదు. నీ తమ్ముడు చనిపోయిన వానితో సమానం. తిరిగి జీవించి వచ్చాడంటే అది నాకూ నీకూ సంతోషంకాదా? చెడ్డనడత కలవాటుపడినవాడు మంచి మార్గంలోకి వచ్చాడంటే చనిపోయిన వాడు బ్రతికివచ్చినట్లుకాదా? అది మనకు సంతోషదాయకం. అందుకని విందును జరిపిస్తున్నాను. గడపిన జీవితంపై విరక్తి అసహ్యము తమ్మునికి కలిగినవి. జరిగినదానికి విచారించి పశ్చాత్తాపమును పొంది తిరిగి సన్మార్గమనే పునర్జన్మ ఎత్తినాడు అందుకే యీ సంతోషం నాయనా!" అని తండ్రి కుమారునితో చెప్పాడు.

ఆమాటలను గ్రహించాడు. విందుకు హాజరైనాడు. అందరూ సంతోషించినారు. అన్నదమ్ములిద్దరూ నాటినుంచీ ఒడుదుడుకులు లేకుండా జీవితం సాగిస్తున్నారు. పశ్చాత్తాప గుణము హృదయ మాలిన్యమును కడిగివేసి పావనం చేస్తుంది. (బైబిల్ కథ) ★

"నాగేశ్వరరావ్ చాలాబాగుందయ్యా. మాకంపెనీ నాటకాలలో వేషం వేస్తావా." అన్నారు ఆయన.

అలా స్థిరంగా కొలువుకు కుదిరితే చదువెలాగ?

"ఇదీ ఒక విద్యే. బడిచదువుకోసం ఉన్న కాస్త ఆస్తి ఎక్కడ ధారపోస్తాం ఇదే వాణ్ణి పోషిస్తుంది" అని నిశ్చయించారు పెద్దలు.

నాగేశ్వరరావు అంగీకరించాడు.

"అసలప్పటివరకూ నాకు నిజంగా నటన మీద ఇష్టంఉందో లేదో నాకే గట్టిగా తెలీదు కాని నాటకాలు వేస్తూవచ్చాను. నటనమీద స్పష్టమైన అభిప్రాయాలూ లేవు. పాడడం, డైలాగులు ఒప్పచెప్పడం చేతులు గరెయ్యడం అంతే నా ఊహ మరి, నా నటన చూచినవారు ఎందుకు బాగుందన్నారు అంటే—ఏంచెప్పను? నాకు నటనగురించిన సిద్ధాంతాలు తెలీకపోయినా, నటించడం తెలిసిం దనిపించింది" అన్నాడు నాగేశ్వరరావు ఆనాటి అవస్థ ప్రస్తావిస్తే.

మధుసూదనరావుగారి కంపెనీలో చేరాక 'ఆశాజ్యోతి' అనే నాటకం బాగా సాధన చేశారు. అక్కడ అందరూ సలహాలు ఇచ్చే వారే విమర్శించేవారే.

"ఒకప్పుడు ప్రాణం విసుగెత్తి, నా స్వేచ్ఛ పోతోందని భయపడి, మావూరు వెళ్లిపోదా మనుకునేవాణ్ణి అనుకున్నాను. అంతపని ఎన్నడూ చేయలేకపోయేవాణ్ణి" అన్నాడు. నాగేశ్వరరావు అప్పటి ప్రవృత్తిని వివరిస్తూ.

* * *

మూడేళ్ల తరువాత మద్రాసు బయల్దేరేటప్పుడు, విమర్శ అంటే ఏమిటో, దాని మహిమ ఏమిటో తెలిసివచ్చింది. ఆనాడు విమర్శించి లోపాలు చూపిన దర్శకులు, తదితరులూ నిజంగా ఎంతమేలు చేశారో బోధపడింది.

* * *

ఈసారి మద్రాసు బయల్దేరడం అక్కడ స్థిరపడడానికి, ప్రతిభావంతుడైన నటుడుగా కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించడానికేనని ఆస్థితిలో ఆక్షణంలో ఎవరికీ తెలియదు.

ప్రతిభా పిక్చర్స్ అధిపతి కీ. శే ఘంటసాల బలరామయ్యగారు ఒకరోజు సాయంత్రం బెజవాడ ప్లాటుఫారంమీద నాగేశ్వరరావును చూచారు

"టేక్ త్రీ: ఓ. ఖే."

రాముడివేషం వేద్దుగాని మద్రాసు రమ్మన్నారు" బలరామయ్యగారు.

అయాచితంగా వచ్చిన ఈ అవకాశం ఆనందం కలిగించినా, మూడేళ్లుగా తాను అలవాటు కలిపిన నటవర్గాన్ని, తన శ్రేయోభిలాషులనూ వదలి వెళ్లాలన్న ఆలోచన మనసును కలతపెట్టింది.

తను ఇన్నాళ్ళూ వేస్తున్నవి ఆడవేషాలు. సాధన చేసి చేసి, ఆడవాళ్ళ సొగసూ హొయలూ తళుకు బెళుకూ బాగా వంటపట్టాయి. అలవాటయిపోయాయి. ఇపుడు తను, నిఖిలాంధ్ర ప్రజలూ ఆరాధించే శ్రీరాముడి పాత్రను ధరించబోవడం దుస్సాహసమన్న అనుమానం, భయం తత్ఫలితంగా దిగులు కలిగాయి

వచ్చిన అవకాశాన్ని వద్దంటే, మళ్ళీ దొరకదన్న బెంగ;

వచ్చిందికదా అని పరుగులు పెడితే, ఉన్న ఉపాధిని (నాటక రంగం) కోల్పోయి రెంటికీ చెడ్డరేవడి నవుతానన్న అనుమానం.

ఆ క్షణాన అతని ఆస్తి మొండిపట్టుదల దల మాత్రమే. ఎందుకు సాధించలేనూ అనుకున్నాడు.

"తప్పకుండా సాధించ గలవు. విళ్లు వాయనా. వృద్ధిలోకి వస్తావు" అని ధైర్యం చెప్పి ఆశీర్వదించారు. కీ. శే. మంగయ్యగారు అపుడాయన నాటకం కంపెనీలోనే మేకప్‌మాన్‌గా ఉండేవారు.

రైలో అనుకుని రైలెక్కాడు అక్కినేని నాగేశ్వరరావు.

1944 మే 8వ తేదీన ఆయన మద్రాసులో కాలుమోపాడు.

బలరామయ్యగారి చిత్రం సీతారామ జననంలో రాముడివేషం వేసి కెమెరాముందు నిలబడ్డాడు.

"భేష్" అన్నారు తొలి టేక్ కాగానే దర్శకుడు.

"అది భలే టానిక్కులా పనిచేసింది. ముచ్చెమటలుపోసి కంగారుపడుతున్న ఈ ప్రాణికి" అంటాడు నాగేశ్వరరావు నవ్వుతూ.

తరువాయి కథ తెరమీద చూచినదే.

ఈ కొత్త జీవితంలో ఈ కొత్త ప్రపంచంలో నాగేశ్వరరావు అనేక కొత్తపాఠాలు నేర్చుకున్నాడు

నట జీవితాన్నేగాక, 'జీవిత నటన' కూడా సాగించవలసి వచ్చింది కోపంవస్తే దిగమింగడం, బాధ కలిగితే దాచుకోవడం, వేష భావల దగ్గర్నించి, కొత్త పద్ధతులు తొక్కడం నేర్చుకోనక తప్పిందికాదు

కీ శే ఘంటసాల బలరామయ్య, గూడవల్లి రామబ్రహ్మంగారలు, నాగేశ్వరరావును సర్వవిధాలా ఆదుకొంటూవచ్చారు.

స్వతస్సిద్ధమైన పట్టుదలతో, నాగేశ్వరరావు తన 'నాటకరంగ నటనా విధానాలను మార్చుకొని' చలనచిత్ర నటనా శిల్పాన్ని అవగాహన చేసుకున్నాడు

ఆ తరువాత నాగేశ్వరరావు చలనచిత్ర యాత్ర ప్రగతిగతి విదితమే

జానపద చిత్రాలలో పాత్రలే అతనికి తరచుగా లభించేవి

మూడు ముఖ్యపాత్రలు

ఇద్దరు ముగ్గురు భార్యలూ, నాలుగైదు యుద్ధాలూ, దేవలోక గాత్రలు, రెండు మూడుచావులూ మొదలైన సరంజామాగల భూమికలు అధికంగా ఉండేవి వాటివల్ల అతడు నటుడుగా కీర్తి గడించకపోయినా, అవి, అఖండవిజయాలనుసాధించి, తద్వారా అతనికి ప్రజల ఆదరాభిమానాలను సంపాదించి పెట్టాయి ఆ రోజులలో తాను ధరించిన ముఖ్య పాత్రలు వీరరస ప్రధానమైన బాలచంద్రుడి భూమిక, విఫల ప్రేమికుడు ఖయస్ (మజ్నూ), పల్లెటూరి వెర్రిబాగులవాడు వేణు (సంసారం) అని నాగేశ్వరరావు అంటాడు

భిన్న ప్రకృతులుగల ఈ మూడు పాత్రలనూ సవ్యంగా అర్థం చేసుకు ఒప్పించ ప్రయత్నించడంలో తాను ఎంతో అనుభవం గడించానని అంటాడు

మూడు మార్గాలలో, మంచి స్థాయిని అందుకొన గలగడం అతని ప్రజాభిమానాన్ని గౌరవాన్ని ఇనుమడింప చేసింది.

ఇదే అతని ప్రగతికి బలం, జవం ఇచ్చింది

"నామీద నాకే నమ్మకం కలుగసాగింది" అంటాడు నాగేశ్వరరావు

దీనివల్ల అతనికి లభించే పాత్రలలో వైవిధ్యం కనబడసాగింది ఒక నటుడు ఎప్పుడూ ఒకేవిధమైన, ఒకే రసానికి సంబంధించిన పాత్రలనుమాత్రమే బాగా పోషిస్తాడన్న భావాన్ని ఎదటివాళ్ళకు కలిగించరాదని నిశ్చయించుకున్నాడు

ఆ లక్ష్యంతోనే ప్రయత్నంచేసినా మరి కొంతకాలంవరకూ పటుత్వంలేని కథలూ, పసలేని పాత్రలూ అతనికి తటస్థపడేవి ఇష్టం లేకపోయినా పరిస్థితుల బలంవల్ల అనేక అనేక పాత్రలను 'భరించేవాడు' నాగేశ్వరరావు.

సమర్థుడైన నటుడు ఒకసారి బాగా నటించడం మరోసారి విఫలుడవడం అసంభవం. ఆయా పాత్రల తరహా, వాటి అవధులూ మొదలగు అంశాలెన్నో ఉంటాయి వాటినిబట్టే నటుడికి తన శక్తి చూపే అవకాశాలు మితంగానో అమితంగానో ఉంటాయి

నాగేశ్వరరావు పసలేని పాత్రలూ, ఒకే తరహా పాత్రలూ వరుసగా నటించడం జరిగింది కొన్నాళ్ళు

"శ్రేయోభిలాషులు వద్దన్నా విన్నాను కాను. పరిస్థితుల ప్రోద్బలంవల్ల, ఇష్టం లేకపోయినా కొన్ని పాత్రలు అంగీకరించాను. ఫరవాలేదని, నాకు నేనే నచ్చచెప్పుకుని, కొన్నాళ్లు ఆత్మవంచనకు పాల్పడ్డాను" అంటాడు నాగేశ్వరరావు

కొన్ని చిత్రాలు దెబ్బతిన్నపుడు (ఆర్థికంగా) ప్రజల అభిమానం కోల్పోతున్నా

★ నాగేశ్వరరావు కథ ★

నేమోనన్న అనుమానం కలిగింది. ఆ అభిమానం నిలుపుకోలేమన్న భయం పొడచూపింది; లేదా ధైర్యం సడలింది.

అపుడు కూడా మిగిలిన ఆస్తి, అతనిని అంటి పెట్టుకున్నది – మొండిపట్టుదల ఒక్కటే. 'ఈ కథ ఇలా సాగరాదు' అని గట్టిగా నిశ్చయించుకున్నాడు

ఇలా అనుకున్న కొద్ది రోజులకే, మంచిపాత్రలు రాసాగాయి.

రోజులు మారినరోజులు

పరదేశి, బ్రతుకు తెరువు, దేవదాసు ప్రభృతిచిత్రాలు ఈ కోవలోవి సమగ్ర రూపురేఖలతో సజీవంగా ఒప్పిన ఈ పాత్రలను పోషించడంలో, నాగేశ్వరరావు ఎంతో అనుభవం గడించాడు

నటుడుగా అతడి గౌరవప్రతిష్ఠలు పెరిగాయి జానపద కథానాయకుడన్న అపప్రథ, అభాండం తొలగిపోయి, బహుముఖ ప్రజ్ఞాశాలి అనిపించుకున్నాడు ప్రజల అభిమానమే కాక, సాటి నటీనటుల, పరిశ్రమలోని దర్శకుల గౌరవాన్ని చూరగొన్నాడు.

మొండితనం అన్న నామాంతరం సంపాదించుకున్న అతని పట్టుదలే మళ్లీ అతన్ని నిలబెట్టింది.

"ఈ పాత్రలను పోషించడంలో, ఒక్క సంవత్సరంలోనే ఎన్నో ఏళ్ళ వయసు ధార పోశాననిపించింది ఫలితాలు సాధించడంలో అయా చిత్రాల దర్శకులు కూడా నాకు ఎంతో సహాయపడ్డారు. వారిమేలు మరువలేను" అంటాడు నాగేశ్వరరావు తన కథలో ఈ ఘట్టంపై వ్యాఖ్యానిస్తూ

నటజీవితం విస్తృతం కావడంతో 'జీవిత నటన'కు నాగేశ్వరరావు మెల్లిగా స్వస్తి చెప్పివేశాడు.

స్థిమితంగా ఆలోచించుకుని, జీవితం గురించి, నటనగురించి కొన్ని నిర్ణయాలు చేసుకున్నాడు అవి·

ఎక్కువ చిత్రాలలో పని ఒక్కసారే అంగీకరించి, ఏఒక్కదానికోసం సవ్యంగా సంపూర్ణంగా పని చేయలేని పరిస్థితిని వారించుకోవడం.

ఆత్మవంచనకు ఆస్కారం లేకుండా మనసుకుతోచినమాట, మనసారా నమ్మిన మాటనే పాటించడం

ప్రజల అభిమానం పెరిగినపుడు నటుడి బాధ్యతలూ పెరుగుతాయన్న పరమ సత్యాన్ని గుర్తించి గౌరవించడం

* * *

ఆ తరువాత ఘట్టంలోకూడా నాగేశ్వరరావుకు శక్తిచూపే అవకాశం అవధిగల పాత్రలు – భిన్నప్రకృతులుగలవి లభించ



ఆంధ్రవిద్యార్థి విజ్ఞానసమితివారు సన్మానం చేసినపుడు తీసినచిత్రం.

సాగాయి దొంగరాముడు, మిస్సమ్మ, విప్రనారాయణ, తెనాలిరామకృష్ణ, అర్ధాంగి, రోజులుమారాయి, అనార్కలీ మొదలైనవి.

భిన్నప్రకృతులుగల ఆ పాత్రలు నా శక్తికి సవాలుగా నిలచాయి నేనూ దాన్ని ఎదుర్కొని శక్తివంచన లేకుండా కష్టపడి కృషి చేశాను ఒకొక్క పాత్ర ప్రభావం, మరొక పాత్ర స్వభావాన్ని పాడుచేసే ప్రమాదం లేకుండా చూచుకోవలసివచ్చేది ఇందులో దర్శకులు నాకెంతో సహాయం చేశారు. నేను దారితప్పకుండా హెచ్చరించి నన్ను నడిపేవారు. వారికి నేను సర్వదా కృతజ్ఞుణ్ని" అన్నాడు నాగేశ్వరరావు అలాగే చరణదాసి, ఇలవేలుపు చిత్రాలలో పాత్రలు కూడా అతని కృషికి రాణించడానికి దోహదం చేశాయి.

"పసలేని పాత్రలు లభించినపుడు ఎంత నిరుత్సాహం కలిగేదో, శక్తికిమించిన పని పించిన పాత్రలు దొరికినపుడు రెట్టించిన ఉత్సాహం కలిగేది." అంటాడు నాగేశ్వరరావు తన ప్రతిభకి సవాలుగా తీసుకుని పట్టుదలతో, ఆపైన మొండితనంతో సాధించడం అతనికి సరదా, అలవాటు, ఆశయం, లక్ష్యం, జీవితం

సాగించిన కృషిని, సాధించిన ఫలితాన్ని బేరీజువేసి, మూసుకోవడం మురిసి గర్వపడడానికి కాదు; కాని ముందుకుసాగడానికి అది శక్తినిస్తుంది ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది.

ఆత్మవిశ్వాసానికి పొగరుగా 'అపార్థ నిర్వచనం' చెప్పుకోవడంతప్పు

"నేను నాపాత్రలకు ఇచ్చిన 'జీవ' ధనం కన్నా, వాటిని ధరించి గడించిన విజ్ఞానధనమే ఎక్కువ" అంటాడు నాగేశ్వరరావు సమర్థుడి వినమ్రతతో.

కళాకారుడిగా అతనికి సంతృప్తిలేదు.

మానవజీవితానికి సంతృప్తి ఆరోగ్యకరం. అసంతృప్తి అనారోగ్యకరం—

అయితే నటజీవిత ప్రగతికి సంతృప్తి ప్రతిబంధకం అవుతుంది అసంతృప్తి-లేదా, ఇంకా సాధించాలన్న ఆకాంక్ష, తీరని కోరిక ముందుకు సాగడానికి దారితీస్తుంది.

"ఇది నేను మనసారానమ్మే నిజం" అంటాడు నాగేశ్వరరావు ★

"ధర్మపత్ని" నుండి "దొంగల్లో దొర" వరకు

(25-వ పేజీ తరువాయి)

తమిళం

నాగేశ్వరరావు పాల్గొన్న తమిళచిత్రాలు 12 ఉన్నాయి వీటిలో దేవదాసు, ఇటీవల ఎంగళ్ వీట్టు మహాలక్ష్మివంటి చిత్రాలు విశేష ప్రజాదరణకు పాత్రము లయ్యాయి. నాగేశ్వరరావు తమిళ నాడులో ప్రజలకు కూడా అభిమాన నటుడయ్యాడు చిత్రాల వివరాలు

మాయమలై (1950), సౌదామిని (51 ఏప్రిల్), ఒరుఇరవు (51 ఏప్రిల్), స్త్రీ సాగసం (51 సెప్టెంబరు), మాయక్కారి (51 డిసెంబరు), కాదల్ (52 జూన్), పూంగోదై (53 ఫిబ్రవరి), పెట్ర తాయ్ (53 మే), దేవదాసు (53 సెప్టెంబరు. రజతోత్సవాలు), మాదర్ కుల మాణిక్కం (56 డిసెంబరు శతదినోత్సవాలు), ఎంగళ్ వీట్టు మహాలక్ష్మి (57 ఫిబ్రవరి శ ది), అల్లావుద్దీనుం అర్పుతవిళక్కుం (57 మార్చి.)

నాగేశ్వరరావు నటించిన ఎక్కువ చిత్రాలు భరణీవారివి (ఆరు) అతను పాల్గొన్న వాటిలో ఎక్కువ చిత్రాలకు దర్శకత్వం నిర్వహించినవారు శ్రీ వేదాంతం రాఘవయ్య ★

Printer and Publisher for Nageswara Rao Estates (Private) Ltd, by S Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.